thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 147 కరీంనగర్ మంగళవారం, 5 ఆగష్టు 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## ఇప్పటికీ ట్రంప్‌కు నోబెల్ ఇవ్వాలంటారా?

న్యూఢిల్లీ/హైదరాబాద్ : ఇరాన్ అణు కేంద్రాలపై అమెరికా దాడులు చేసిన నేపథ్యంలో ఇంతకు ముందు అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని సిఫారసు చేస్తామన్న పాకిస్థాన్‌పై ఎంఐఎం చీఫ్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఈ ఘనకార్యం చేసినందుకు ట్రంప్‌నకు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని పాకిస్థాన్ కోరుకుంటోందా? అని ఆయన ప్రశ్నించారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో గత నెలలో భారత్–పాక్ మధ్య ఘర్షణ సందర్భంగా ట్రంప్ జోక్యం చేసుకున్నందుకు నోబెల్ శాంతి బహుమతికి ట్రంప్ పేరును సిఫారసు చేయనున్నట్టు శనివారం పాకిస్థాన్ ప్రకటించింది. ఈ ప్రకటన వెలువడిన కొన్ని గంటలకే ఇరాన్‌పై అమెరికా నేరుగా దాడులకు దిగింది. ఇరాన్ అణు కేంద్రాలపై అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించి అమెరికా దాడులకు పాల్పడిందని ఒవైసీ అన్నారు. సుమారు 60 లక్షలకు పైగా భారతీయులు గల్ఫ్ దేశాల్లో ఉన్నారని.. యుద్ధం నేపథ్యంలో ప్రవాస భారతీయుల భద్రతపై ఆందోళన కలుగుతోందన్నారు.




# దడపుట్టిస్తున్న 'కాళేశ్వరం' నివేదిక..

## మైండ్ బ్లాంక్ అయ్యే విషయాలు వెలుగులోకి

జస్టిస్ పి.చంద్రఘోష్ కాళేశ్వరం కమిషన్ నివేదికపై అధికారుల అధ్యయనం ముగిసింది. ప్రాజెక్టు నిర్మాణంలో భాగస్వామ్యమైన అందరి గురించి నివేదికలో కమిషన్ స్పష్టంగా పేర్కొంది. పూర్తిస్థాయి నివేదికలో కీలక అంశాలను కమిటీ ప్రస్తావించింది. బాధ్యులైన వారిపై క్రిమినల్ చర్యలకు కమిషన్ సిఫారసు చేసిన విషయంలో తెలిసిందే. ఈ నేపథ్యంలోనే కాళేశ్వరం నివేదికలో సంచలన బయటకు వచ్చాయి.

**బ్యారేజీల నిర్మాణానికి కేబినెట్ అనుమతుల్లేవ్...** ప్రాజెక్టులో విధాన, ఆర్థిక పరంగా అవకతవకలు జరిగాయి కమిషన్ పెర్కొంది. పెద్ద ఎత్తున ప్రభుత్వ నిధుల దుర్వినియోగం జరగిందని రిపోర్టులో ప్రస్తావించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులపై.. నాడు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆరే అన్ని నిర్ణయాలు తీసుకున్నారని వెల్లడించారు. ఏకంగా వాప్కోస్ నివేదికను తొక్కిపెట్టారని జస్టిస్ చంద్రఘోష్ కమిషన్ స్పష్టం చేసింది. తుమ్మడిహట్టిలో నీటి లభ్యత లేదని సమర్థించుకున్నారని కమిషన్ ఆక్షేపించింది. తమ్మడిహట్టి నుంచి మేడిగడ్డకు సైట్ మార్చడంలో ఏమాత్రం నిజాయితీ, చిత్తశుద్ధి చేపలేదని పేర్కొన్నారు. బ్యారేజీల నిర్మాణ ప్రాథమిక అనుతులకు కేబినెట్ అనుమతులు లేవని నివేదికలో వెల్లడించారు. టర్న్ పద్ధతిలో బ్యారేజీల నిర్మాణం, నిర్వహణ చేపట్టాలని సీడబ్ల్యూసీ సలహా ఇచ్చినా.. గంపగుత్తగా ఒకే సంస్థకు కాంట్రాక్ట్ ఇచ్చేశారని తెలిపారు.

**ఉద్దేశపూర్వంగానే హరీశ్ ఆ విషయం పట్టించుకోలే..** కాళేశ్వరం అవకతవకలకు పూర్తి బాధ్యత కేసీఆర్‌దేనని కాళేశ్వరం కమిషన్ రిపోర్టు బయటపెట్టింది.

కేసీఆర్ ప్రమేయం, ఆదేశాలతోనే మూడు బ్యారేజీల్లోనూ సమస్యలు వచ్చాయని పేర్కొన్నారు. నిపుణుల కమిటీ నివేదికను హరీశ్ రావు ఉద్దేశపూర్వకంగానే పట్టించుకోలేని అన్నారు. ఆర్థికపరమైన నిర్ణయాలు తీసుకోవడంలో కొత్త ఏర్పడిన రాష్ట్ర స్థితిగతులను ఈటల రాజేందర్ పట్టించుకోలేదని రిపోర్టులో కమిషన్ బహిర్గతం చేసింది.

**కేసీఆర్‌కు షాక్.. రేవంత్ సర్కార్ సంచలన నిర్ణయం!....** తెలంగాణ మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు తెలంగాణ సర్కార్ షాక్ ఇచ్చేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. కాళేశ్వరం కమిషన్ నివేదిక ఆధారంగా సిట్ ఏర్పాటు యోచనలో రేవంత్ సర్కార్ ఉన్నట్లు సమాచారం. కాగా ఇటీవల కాళేశ్వరం ఇచ్చిన రిపోర్ట్‌లో దోషిగా కేసీఆర్ పేరుని అధికారులు ప్రస్తావించారు. కేసీఆర్ ఇచ్చిన అదేశాల మేరకే తాము పనిచేసినట్లు అధికారులు విచారణలో చెప్పినట్లు తెలుస్తోంది. అయితే... ఈనెల మూడో వారంలో 3 రోజులపాటు తెలంగాణ అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాల్లో కాళేశ్వరం ప్రాజెక్టు పేరిట జరిగిన అవినీతి, అక్రమాలపై అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇవ్వనున్నారు.

## దక్షిణ తెలంగాణ జిల్లాలకు భారీవర్ష సూచన



హైదరాబాద్: తెలంగాణలో మూడు, నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. దక్షిణ తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు నాలుగు రోజుల పాటు వర్ష సూచన ఉందని.. ఇవాళ సాయంత్రం నగరంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని వెల్లడించారు.

## కేసుల 'మిస్టరీ' ఏంటి..?




కర్ణాటక రాష్ట్రంలోని ప్రముఖ క్షేత్రమైన 'ధర్మస్థల' ప్రాంతం ఇటీవల వార్తల్లో నిలిచింది. రెండు దశాబ్దాల్లో అనేక మంది మహిళలు, యువతులు హత్యకు గురయ్యారని, వారి మృతదేహాలను తానే పూడ్చి పెట్టానని ఓ రిటైర్డ్ ఉద్యోగి ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంచలనం రేపింది.

అవన్నీ అనుమానాస్పద రీతిలో.. లైంగిక దాడులకు గురై చనిపోయినట్లు అనుమానాలున్నట్లు పేర్కొనడం అందరినీ ఉలిక్కిపడేలా చేసింది. ఈ నెల 3న న్యాయవాదితో కలిసి అక్కడి పీఎస్ కు వచ్చిన వ్యక్తి చేసిన ఫిర్యాదు అందరినీ ఉలిక్కిపడేలా చేసింది. ధర్మశాల దేవాలయంలో పారిశుధ్య కార్మికుడిగా పని చేసిన తాను దాదాపు 20ఏళ్ల పాటు అనేక మృతదేహాలను పాతిపెట్టానని చెప్పడంతో సంచలనంగా మారింది. ప్రస్తుతం మానవహక్కుల, మహిళ సంఘాలు నిజాలు నిగ్గు తేల్చడానికి ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి.

అయితే ఇంత జరుగుతున్నా అప్పుడు ఉన్న ప్రభుత్వాలు ఎందుకు గుర్తించలేదని.. ఒకవేళ ఈ ఘటనను గుర్తించినా చూసీ చూడనట్టు వ్యవహరించిందా.. అనే ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై అప్పుడున్న ప్రభుత్వాలు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని దేశంలోని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.


**'సిట్' కోసం సీఎంపై ఒత్తిడి..** ఈ కేసు విచారణ, దర్యాప్తులో పోలీసులు అలసత్వం వహిస్తున్నారని పలు న్యాయవాద బృందాలు ఆందోళన వ్యక్తం చేశాయి. దీనిపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ.. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలగౌడ నేతృత్వంలోని బృందం సీఎం సిద్ధరామయ్య ను కలిసి విజ్ఞప్తి చేసింది. ధర్మస్థల వ్యవహారం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని, దీనిపై నిష్పక్షపాత దర్యాప్తునకు సిట్‌ను ఏర్పాటు చేయాలని కర్ణాటక మహిళా కమిషన్ ముఖ్యమంత్రిని కోరింది.

**మిస్టరీగా పలు కేసులు..?...** 2003లో స్నేహితులతో కలిసి ధర్మస్థలకు వెళ్లిన ఎంబీబీఎస్ విద్యార్థిని అనన్య భట్ కనిపించకుండా పోయింది. ధర్మస్థల అంశం ఇటీవల తెరపైకి రావడంతో.. తన కుమార్తె మిస్సింగ్ కేసును దర్యాప్తు చేయాలని కోరుతూ తల్లి సుజాత భట్ (60) దక్షిణ కన్నడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పట్లో ఫిర్యాదు చేస్తే పోలీసులు పట్టించుకోలేదని, తనను బెదిరించి పంపించారని ఆవేదన వ్యక్తం చేశారు. 2012లో సౌజన్య అనే విద్యార్థిని అత్యాచారం– హత్య కేసు స్థానికంగా సంచలనం రేపింది. ఈ కేసులో నిందితులకు శిక్ష పడాలని కోరుతూ పౌర సంఘాలు, ఆమె కుటుంబ సభ్యులు, విద్యార్థి సంఘాలు కొంత కాలంగా ఆందోళనలను ఉద్ధృతం చేశాయి.

**సంచలన వీడియో..** ఈ క్రమంలోనే 'అక్కడ వరుస హత్యలకు కారకులు ఎవరు?' అని ప్రశ్నిస్తూ ఓ యూట్యూబర్ చేసిన వీడియో ఈ వ్యవహారానికి మరింత ఆజ్యం పోసింది. మాజీ పారిశుద్ధ్య కార్మికుడు చెప్పిన వివరాల ఆధారంగా ఏఐ సాయంతో ఆ వీడియో రూపొందించాడు. దీన్ని తీవ్రంగా పరిగణించిన పోలీసులు.. అసత్య వార్తలు వ్యాప్తి చేస్తున్నారనే అభియోగాలపై ఆ యూట్యూబర్‌పై కేసు నమోదు చేశారు. అయితే, ఇప్పటికే ఆ వీడియోకు 50 లక్షలకుపైగా వ్యూస్ రావడం గమనార్హం.

# ట్రంప్ హెచ్చరికలను పక్కన పెట్టిన ఇండియా







## సరైన నిర్ణయం తీసుకుంది. రష్యాతో డీలింగ్!

న్యూయార్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలను పట్టించుకోకుండా, రష్యా నుంచి ముడి చమురును కొనుగోలు చేయడం కొనసాగిస్తామని భారత్ ప్రకటించింది. భారతదేశ ఇంధన విధానంలో ఎలాంటి మార్పు లేదని కూడా స్పష్టం చేసింది. భారత్ రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడం మానేసిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పిన నేపథ్యంలో ఈ వివరణ వచ్చింది. గత శుక్రవారం విలేకరులతో మాట్లాడిన ట్రంప్, భారత్ రష్యా చమురు కొనడం ఆపేసిందని తాను విన్నానని చెప్పారు. ఆయన దీనిని ఒక మంచి చర్యగా కూడా పేర్కొన్నారు.

**భారత్ స్పందన...** అయితే ఏఎన్ఐ మరియు రాయిటర్స్ వర్గాలు భారత ప్రభుత్వ అధికారులను ఉటంకిస్తూ, ట్రంప్ వాదనను ఖండించాయి. "భారత ఇంధన విధానంలో ఎలాంటి మార్పు లేదు. ధర, నాణ్యత, రవాణా సౌకర్యాలు మరియు మార్కెట్ పరిస్థితుల ఆధారంగానే చమురు కంపెనీలు కొనుగోలు నిర్ణయాలు తీసుకుంటాయి. రష్యా నుంచి దిగుమతులు నిలిపివేయాలని ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదు" అని వారు తెలిపారు.

**రష్యా చమురు దిగుమతులు....** ప్రపంచంలో మూడవ అతిపెద్ద చమురు దిగుమతిదారు అయిన భారత్, రష్యా నుంచి సముద్ర మార్గం ద్వారా దిగుమతి చేసుకునే ముడి చమురును ఎక్కువగా కొనుగోలు చేసే దేశం. ఇది రష్యాకు ఒక ముఖ్యమైన ఆదాయ వనరుగా ఉంది.

**ఇతర దేశాలతో చమురు వాణిజ్యం...** ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ మరియు మంగళూరు రిఫైనరీ పెట్రోకెమికల్ లిమిటెడ్ వంటి భారత ప్రభుత్వ యాజమాన్యంలోని చమురు శుద్ధి కర్మాగారాలు గత వారం రష్యా ముడి చమురును కొనుగోలు చేయలేదు. ఈ సంస్థలు సాధారణంగా రష్యా చమురును డెలివరీ ఆధారంగా కొనుగోలు చేస్తాయి. ప్రస్తుతం, మధ్యప్రాచ్య దేశాల నుంచి అబుదాబి యొక్క ముర్బన్ ముడి చమురు మరియు పశ్చిమ ఆఫ్రికా దేశాల చమురు వంటి ప్రత్యామ్నాయాలను మార్కెట్ నుంచి పొందుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లోనే, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలను పట్టించుకోకుండా, రష్యా నుంచి ముడి చమురును కొనుగోలు చేయడం కొనసాగిస్తామని భారత్ ప్రకటించింది. భారతదేశ ఇంధన విధానంలో ఎలాంటి మార్పు లేదని కూడా స్పష్టం చేసింది.

**ట్రంప్ హెచ్చరికలు....** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆగస్టు 7 నుండి భారత్‌కు వ్యతిరేకంగా వాణిజ్య సుంకాలు విధిస్తామని ప్రకటించారు. నేటి నుంచి ఆ సుంకాలు అమల్లోకి వస్తాయి. అయితే భారత్ దీనికి ప్రతిగా ఎలాంటి సుంకాలూ విధించదని, ప్రస్తుతానికి భారత్ నుంచి బలమైన ప్రతిస్పందన ఉండదని ఢిల్లీ వర్గాలు తెలిపాయి. భారత దిగుమతి వస్తువులపై 25% సుంకం విధిస్తామని ట్రంప్ తెలిపారు. అదనపు జరిమానాలు కూడా విధించవచ్చని పేర్కొన్నారు. ఇది ఒక ముఖ్యమైన అంతర్జాతీయ పరిణామం. ఈ ప్రకటనపై భారత ప్రభుత్వం వెంటనే స్పందించలేదు.

చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకుంటామని సమాచారం. ఇరుదేశాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని శాంతి ఒప్పందానికి భారత్ సిద్ధంగా ఉందని ఢిల్లీ వర్గాలు తెలిపాయి. భారతదేశ రక్షణ అవసరాలలో ఎక్కువ భాగం రష్యా నుంచే తీరుతాయి.

అంతేకాకుండా, రష్యా నుంచి ఇంధనం కొనుగోలు చేసే దేశాలలో భారత్ కూడా ముందుంది. ఉక్రెయిన్ యుద్ధంలో రష్యా తీరును ప్రపంచ దేశాలు ఖండిస్తున్న నేపథ్యంలో, ఆగస్టు నుంచి భారత్‌కు 25% సుంకం విధిస్తామని ట్రంప్ హెచ్చరించారు. ఇది భారత్‌పై విధించే జరిమానా అవుతుందని ఆయన తెలిపారు.



# కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేస్తే అప్పులపై వడ్డీ తగ్గింపును పరిశీలిస్తాం

దిల్లీ: కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి చేస్తే అప్పులపై వడ్డీ తగ్గించే అంశాన్ని పరిశీలిస్తామని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. రుణాల చెల్లింపు, రీ షెడ్యూల్ మార్పు చేస్తే ఆర్బీఐ నిబంధనల మేరకు కాళేశ్వరం ప్రాజెక్టు ఖాతా స్టాండర్డ్ నుంచి సబ్ స్టాండర్డ్‌కు డౌన్ గ్రేడ్ అవుతుందని కేంద్ర ఆర్థికశాఖ పేర్కొంది. తెలంగాణకు చెందిన కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు లోక్‌సభలో కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. "కాళేశ్వరం ప్రాజెక్టు రుణాల పునర్ వ్యవస్థీకరణ చేయాలని తెలంగాణ ప్రభుత్వం నుంచి వినతులు వచ్చాయి. ప్రాజెక్టు స్పెషల్ పర్పస్ వెహికల్‌కు పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ రుణాలు ఇచ్చాయి. పీఎఫ్‌సీ, ఆర్‌ఈసీ లాంటి నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ సంస్థలు.. వివిధ మార్గాల్లో నిధులను సేకరిస్తాయి. వాటికయ్యే ఖర్చుల ఆధారంగా వడ్డీ రేట్లను నిర్ణయిస్తారు. ప్రాజెక్టు పూర్తయ్యే సమయాన్ని ఇప్పటికే డిసెంబర్ 2024కు ఆర్‌ఈసీ పొడిగించింది. ప్రాజెక్టు పూర్తయిన తర్వాతే రుణాలపై వడ్డీ రేట్ల తగ్గింపును పరిశీలిస్తాం" అని కేంద్ర ఆర్థికశాఖ పేర్కొంది.

# లైఫ్‌సైన్సెస్ కంపెనీలకు రాజధానిగా హైదరాబాద్ : సీఎం రేవంత్



హైదరాబాద్: లైఫ్‌సైన్సెస్ కంపెనీలకు రాజధానిగా హైదరాబాద్ ఎదిగిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అమెరికాకు చెందిన ప్రముఖ ఫార్మా కంపెనీ లిల్లీని గచ్చిబౌలిలో ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. హైదరాబాద్ కేంద్రంగా తయారైన ఔషధాలు, టీకాలు చాలా దేశాలకు ఎగుమతి అవుతున్నాయని తెలిపారు. ఫార్మా కంపెనీలకు ప్రత్యేక జీనోమ్ వ్యాలీ ఇక్కడ ఉందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో పెట్టుబడులకు అనువైన వాతావరణం ఉందని అన్నారు. "రైజింగ్ తెలంగాణ 2047 లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. రాష్ట్రంలో ఫార్మా కంపెనీలకే ప్రత్యేకమైన జీనోమ్ వ్యాలీ ఉంది. మెడ్ టెక్నాలజీకి రాష్ట్రం ప్రత్యేకమైన హబ్‌గా ఎదుగుతోంది" అని పేర్కొన్నారు.



# బ్యారేజీల నిర్మాణానికి పూర్తి బాధ్యత అప్పటి సీఎందే

హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీలపై జస్టిస్ పీసీ ఘోష్ నివేదికను అధికారుల కమిటీ అధ్యయనం చేసింది. దీని సారాంశాన్ని సిద్ధం చేసింది. అందులోని వివరాల ప్రకారం.. "మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల నిర్మాణ నిర్ణయం అప్పటి సీఎం కేసీఆర్‌దే. నిపుణుల కమిటీ నివేదికను అప్పటి సీఎం కేసీఆర్, నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు పక్కకు పెట్టారు. తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత లేదన్నది సహేతుక కారణం కాదు. బ్యారేజీల నిర్మాణానికి మంత్రివర్గ ఆమోదం జరగలేదు. వ్యాప్కోస్ నివేదిక, డీపీఆర్ కంటే ముందే బ్యారేజీలకు సిద్ధం అయ్యారు. టెండర్లు, ఓ అండ్ ఎం డిజైన్, నాణ్యతలో లోపాలున్నాయి. బ్యారేజీల నిర్మాణానికి పూర్తి బాధ్యత అప్పటి సీఎం కేసీఆర్‌దే. జవాబుదారీతనం, పాలనాపరమైన విధానాలు పాటించలేదు. పాలనా విధానాలు అనుసరించకుండా హరీశ్‌రావు ఆదేశాలు ఇచ్చారు. ఆర్థిక జవాబుదారీ తనాన్ని అప్పటి ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ పాటించలేదు. కాళేశ్వరం బోర్డులో అధికారులు ఉన్నా వారికి సంబంధం లేదని ఈటల చెప్పారు. ప్రణాళిక, నిర్మాణం, ఓ అండ్ ఎం, నీటినిల్వ, ఆర్థిక అంశాలకు అప్పటి సీఎందే బాధ్యత.

**కాళేశ్వరంలో ఆర్థిక అవకతవకలు, నిబంధనల ఉల్లంఘన...**

కాళేశ్వరంలో ఆర్థిక అవకతవకలు, నిబంధనల ఉల్లంఘన జరిగింది. ప్రాజెక్టు అధికారులు, నిర్మాణ సంస్థతో కుమ్మక్కయ్యారు. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణంలో ప్రజాధనం దుర్వినియోగమైంది. బ్యారేజీలు దెబ్బతినడానికి కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలే కారణం. నిర్మాణ స్థలం మార్పు, అంచనాల సవరింపులో అవకతవకలున్నాయి. డిజైన్ల లోపాలు, నాణ్యత తనిఖీలు లేకపోవడంతో నష్టం జరిగింది. ప్రజాధనం దుర్వినియోగానికి బోర్డు సభ్యులు కూడా బాధ్యులు. కాళేశ్వరం బోర్డులోని అధికారులపై క్రిమినల్ బీచ్ ఆఫ్ ట్రస్ట్ కింద చర్యలు తీసుకోవాలి. మేడిగడ్డ నిర్మాణంపై ఎల్ అండ్ టీ సంస్థకు ఎలాంటి సర్టిఫికెట్లు ఇవ్వొద్దు. బ్యారేజీ ఏడో బ్లాక్‌ను ఆ సంస్థ పునరుద్ధరించాలి. ఇతర ఆనకట్టల్లో లోపాల సవరణ కూడా చేయాల్సిందే. ఈ వ్యయాన్ని ఎల్ అండ్ టీనే భరించాలి." అని ఈ మేరకు నివేదిక సారాంశాన్ని అధికారుల కమిటీ వెల్లడించింది.

# చలో దిల్లీ.. ప్రత్యేక రైలులో బయలుదేరిన కాంగ్రెస్ నేతలు



చర్లపల్లి: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం కాంగ్రెస్ పార్టీ 'చలో దిల్లీ' కార్యక్రమం చేపట్టింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నేతలు చర్లపల్లి నుంచి ప్రత్యేక రైలులో దిల్లీ బయలుదేరారు. చర్లపల్లి రైల్వేస్టేషన్‌లో ఏఐసీసీ తెలంగాణ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి జెండా ఊపి రైలును ప్రారంభించారు. వీరితో పాటు కాంగ్రెస్ శ్రేణులంతా దిల్లీకి బయల్దేరి వెళ్లారు. బీసీ రిజర్వేషన్ల బిల్లును రాష్ట్రపతి ఆమోదించాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. బిల్లు ఆమోదించాలనే డిమాండ్‌తో ఈనెల 6న దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేపట్టనున్నారు. ప్రతి జిల్లా నుంచి 25 మంది చొప్పున రైలులో వెళ్లారు. మరోవైపు బీసీ రిజర్వేషన్ పెంపుపై చర్చ కోరుతూ మంగళవారం పార్లమెంటులో కాంగ్రెస్ ఎంపీలు వాయిదా తీర్మానం ఇవ్వనున్నారు. ఈ నెల 7న ఆ పార్టీ నేతలు రాష్ట్రపతిని కలిసి వినతిపత్రం ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించినా కేంద్రం మోకాలడ్డుతోందని విమర్శించారు. రిజర్వేషన్లను సాధించే వరకు పోరాటం చేస్తామన్నారు.



# ఈ పోరాటం చరిత్రలో నిలిచిపోతుంది

హైదరాబాద్: తెలంగాణ జాగృతి ఈరోజు చేసే పోరాటం చరిత్రలో నిలిచిపోతుందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన కోసం భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్సీ కవిత ధర్నాచౌక్ వద్ద 72 గంటల నిరాహార దీక్షను చేపట్టారు. బీఆర్ అంబేడ్కర్, పులే, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలకు ఆమె నివాళి అర్పించారు. కార్యక్రమానికి పెద్దఎత్తున కార్యకర్తలు, తెలంగాణ జాగృతి శ్రేణులు తరలివచ్చి ఆమెకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. "తెలంగాణలో ప్రతి ఒక్కరికీ రాజ్యాధికారంలో వాటా కావాలి, ఆర్థిక అవకాశాలు రావాలి. సమాజంలో సగ భాగం బీసీలు ఉన్నారు. వాళ్లకు రాజకీయంగా సమ ప్రాధాన్యం దక్కాలనే ఉక్కు సంకల్పంతో ఈ దీక్ష చేపట్టాం. కామారెడ్డి డిక్లరేషన్‌లో చెప్పినట్లు బీసీలకు న్యాయం చేయాలని గత కొన్ని నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం వెంట పడుతున్నాం. అందరి ఆకాంక్ష ఒకటే.. స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి. కానీ రాష్ట్ర ప్రభుత్వం భాజపా మీద నెపం పెట్టి తప్పించుకోవాలని చూస్తోంది. బీసీ బిల్లుపై భాజపా లేవనెత్తిన అనుమానాలను సీఎం నివృత్తి చేయాలి. ముస్లింలకు అదనంగా 10 శాతం రిజర్వేషన్లు ఇస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇవ్వాలి. ముస్లింలను మినహాయించి బీసీలకే 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని చెప్పాలి.

అప్పుడు భాజపా ఎందుకు ఒప్పుకోదో మేమూ చూస్తాం. ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్‌కు ప్రత్యేకంగా పార్లమెంటులో బిల్లు పెట్టాలి. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఇందుకు కృషి చేయాలి" అని కవిత అన్నారు.



# ఫిష్ వెంకట్ కుటుంబాన్ని పరామర్శించిన సోనూసూద్

**హైదరాబాద్ నగరం అడ్డగుట్టలోని ఫిష్ వెంకట్ నివాసంలో ఆయన కుటుంబసభ్యులను నటుడు సోనూసూద్ పరామర్శించారు. ఇటీవల ఫిష్ వెంకట్ అనారోగ్యంతో మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోనూసూద్.. ఆయన కుటుంబసభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారికి అన్ని విధాలుగా అండగా ఉంటానని చెప్పారు.**

# బీసీలకే 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామంటే పూర్తి మద్దతిస్తాం: రామచందర్‌రావు



హైదరాబాద్: బీసీలకే 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామంటే భాజపా పూర్తి మద్దతిస్తుందని తెలంగాణ భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావు తెలిపారు. సోమవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. దిల్లీలో కాంగ్రెస్ ధర్నాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో చేసినట్లే దిల్లీకి వెళ్లి నాటకాలు చేస్తున్నారని విమర్శించారు. "రాష్ట్ర ప్రభుత్వానికి బీసీ రిజర్వేషన్లు ఇవ్వడం ఇష్టం లేదు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు పెట్టినప్పుడు ముస్లింలకు 10శాతం ఇస్తామని చెప్పలేదు. బీసీలకే 42 శాతం అమలు చేస్తామంటే పూర్తి మద్దతిస్తాం. ముస్లింలకు 10 శాతం ఇస్తే.. 10 శాతం బీసీలకు అన్యాయం జరుగుతుంది. రిజర్వేషన్లను భాజపా అడ్డుకుంటోందని ప్రచారం చేస్తోన్న కాంగ్రెస్‌ను బీసీలు నమ్మరు. ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికలు పెట్టే ఉద్దేశం లేదు"అని రామచందర్‌రావు అన్నారు.

# 'సృష్టి' కేసు.. తవ్వేకొద్దీ బయటపడుతున్న మరిన్ని అక్రమాలు..




హైదరాబాద్: సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ సంస్థ నిర్వాహకులు ఐవీఎఫ్ చికిత్సకు వచ్చిన వారిని సరోగసి పేరిట మోసం చేసి డబ్బులు తీసుకున్నారని ఫిర్యాదులు అందాయి. ఈ మేరకు గోపాలపురం పోలీసులు మరో 4 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. తమకు అందించిన మెడికల్ రిపోర్టులు తీసుకొచ్చి బాధితులు ఫిర్యాదు చేస్తున్నారు. నల్గొండకు చెందిన దంపతుల నుంచి ఫెర్టిలిటీ నిర్వాహకురాలు నమ్రత రూ.44 లక్షలు కాజేసింది. బాధితుల ఫిర్యాదు మేరకు నమ్రత, సదానందం, చెన్నారావు, అర్చన, సురేఖపై కేసు నమోదైంది. హైదరాబాద్‌కు చెందిన బాధితురాలి ఫిర్యాదు మేరకు మరో కేసు నమోదైంది. సరోగసి చేస్తామని బాధితురాలికి నమ్రత హార్మోన్ ఇంజక్షన్‌లు ఇచ్చింది. కొన్ని రోజుల తర్వాత కల్యాణి గ్యాంగ్ విశాఖకు పిలిచి స్పెర్మ్ తీసుకొని పంపింది. ఈ వ్యవహారంలో సరోగసి పేరుతో రూ.18 లక్షలు కాజేశారు. ఈ ఘటనకు సంబంధించి నమ్రత, డా.విద్యులత, కల్యాణి, శేషగిరి, శ్రీనివాసరెడ్డిపై కేసు నమోదైంది. ఎన్నారైలను కూడా నమ్రత గ్యాంగ్ మోసం చేసినట్లు ఫిర్యాదు అందింది. బాధితుల నుంచి రూ.25 లక్షలు కాజేశారు. దీంతో నమ్రతపై పోలీసులు కేసు నమోదు చేశారు. హైదరాబాద్‌కు చెందిన బాధితుల నుంచి ఈ గ్యాంగ్ రూ.50 లక్షలు కాజేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు నమ్రత, చెన్నారావు, సురేఖపై కేసు నమోదు చేశారు.

# కౌశిక్‌రెడ్డిపై నమోదైన కేసులపై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు

హైదరాబాద్: తనపై పలు పోలీసు స్టేషన్లలో నమోదైన కేసులను కొట్టివేయాలని భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేశారని పలు పోలీసుస్టేషన్‌లలో కౌశిక్ రెడ్డిపై కేసులు నమోదయ్యాయి. కాంగ్రెస్ నేతలు ఇచ్చిన ఫిర్యాదుతో.. ఒకే ఘటనపై వేర్వేరు పోలీసు స్టేషన్‌లలో కేసులు పెట్టారని కౌశిక్ రెడ్డి న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా కేసులు నమోదు చేశారని పేర్కొన్నారు. కేసులపై స్టే విధించి, అరెస్టు చేయకుండా ఆదేశాలివ్వాలని మధ్యంతర పిటిషన్ వేశారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు.. అన్ని పోలీసు స్టేషన్లలో నమోదైన కేసులపై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. తదుపరి విచారణను వాయిదా వేసింది.



# గోవా గవర్నర్ అశోక్ గజపతి రాజు దిల్లీ పర్యటన.. రాష్ట్రపతి, ప్రధానితో భేటీ

**దిల్లీ: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని గోవా గవర్నర్ అశోక్ గజపతి రాజు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గోవా గర్నవర్‌గా నియమితులైన తర్వాత దిల్లీలో పర్యటిస్తున్న ఆయన.. తొలుత రాష్ట్రపతి భవన్‌కు చేరుకొని ద్రౌపదీ ముర్ముతో సమావేశమయ్యారు. అనంతరం పార్లమెంట్‌కు వెళ్లి ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు అమిత్‌షా, జేపీ నడ్డా, రామ్మోహన్‌నాయుడుతో వేర్వేరుగా భేటీ అయ్యారు. పార్లమెంట్ వద్ద అశోక్ గజపతిరాజుకు తెదేపా ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, కలిశెట్టి అప్పలనాయుడు స్వాగతం పలికారు.**

# గింజా టాక్సీ మొదటి అడుగు - నేటి యాంత్రిక యుగానికి బాట

## 1912 ఆగస్టు 5...జపాన్‌లో టాక్సీ సేవల ఆరంభం

1912 ఆగస్టు 5ం జపాన్ రవాణా చరిత్రలో ఓ మైలురాయి. అదే రోజు టోక్యో నగరంలోని గింజా అనే ప్రముఖ వాణిజ్య ప్రాంతంలో, మొట్ట మొదటి సారిగా టాక్సీ సేవలు ప్రారంభమయ్యాయి. ఇది కేవలం కొత్త వాహన సేవ ప్రారంభం మాత్రమే కాదు. జపాన్ ఆధునికత వైపు పయనాన్ని సూచించే సంఘటన. రవాణా రంగంలో కొత్త శకానికి ఇది నాంది పలికింది. ఈ సేవలను ప్రారంభించిన సంస్థ పేరు టోక్యో టాక్సీ ఆటోమొబైల్ కంపెనీ. ఆరంభంలో కేవలం ఆరు టాక్సీలతో ప్రారంభమయ్యాయి. ఫ్రాన్స్‌కు చెందిన డారాక్ కంపెనీ తయారీ వాహనాలు టాక్సీలుగా మార్చి, గింజా వీధుల్లో ప్రయోగాత్మకంగా ప్రవేశ పెట్టారు. ఇవి జపాన్‌లో మొదటి మోటార్ ఆధారిత, కిరాయికి నడిచే వ్యక్తిగత ప్రయాణ వాహనాలు. అప్పటి టోక్యో నగరం వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆధునిక నగరంగా ఎదుగుతోంది. గింజా ప్రాంతం %-% వ్యాపారం, విదేశీ సంస్థలు, డిపార్ట్‌మెంట్ స్టోర్లు, సినిమా హాళ్లు ఉండే సాంస్కృతిక కేంద్రంగా పేరు పడింది. ఈ ప్రాంతంలో టాక్సీ సేవల ప్రారంభం వ్యాపార అవసరాలకే కాదు, సామాజికంగా కూడా నగర జీవనశైలిలో కీలక మార్పును తెచ్చింది. ఈ టాక్సీల్లో ప్రయాణ ధర మీటర్ ఆధారంగా నిర్ణయించడ మన్నది అప్పటికి అత్యంత ఆధునిక వ్యవస్థ. ఇది ఖర్చుతో కూడుకున్నప్పటికీ, పారదర్శకత, వేగం, స్వచ్ఛత, సమయ పాలన వంటి అంశాలతో ప్రజల్లో విశ్వాసం పొందింది. తొలి దశలో ఇది ధనవంతుల ప్రయోజనం గానే ఉన్నా, 1920ల నాటికి వాహనాల సంఖ్య పెరగడంతో సామాన్యులు కూడా ఈ సేవలకు దరి చేరారు. జపాన్ ప్రభుత్వ పాలనలోను, పట్టణాభివృద్ధి లోను ఈ సేవల ప్రభావం గణనీయంగా కనిపించింది. ప్రభుత్వ అధికారులు, వ్యాపార వేత్తలు, విదేశీ అతిథులు టాక్సీలను వాడటంతో వాటికి స్థిర స్థానం లభించింది. యూరోప్, అమెరికాలో పెరుగుతున్న టాక్సీ సంస్కృతిని తూర్పు ఆసియాలో ముందుగా స్వీకరించిన దేశం జపానే కావడం విశేషం. నేటి జపాన్‌లో టాక్సీ సేవలు ప్రపంచ స్థాయి ప్రమాణాలకు నిలబడినవి. ఆధునిక టాక్సీలు, క్యాబ్‌లు, సాంకేతికతతో సమన్వయంగా పనిచేస్తున్నాయి. జీపీఎస్, జాతీయ టాక్సీ యాప్‌లు, డిజిటల్ మీటర్లు, మొబైల్ బుకింగ్, ఈ-పేమెంట్స్, క్రెడిట్ కార్డ్ మిషన్లు, నావిగేషన్ సదుపాయాలు వంటి సౌకర్యాలతో సాంకేతికంగా మెరుగైన సేవలుగా మారాయి. ప్రస్తుతం జపాన్‌లో దాదాపు 2.4 లక్షల టాక్సీలు పని చేస్తున్నాయి. టోక్యో, ఒసాకా వంటి నగరాల్లో "కమ్యూనిటీ



క్యాబ్"లు, "గ్రీప్ ట్యాక్సీ", "సావారి", "టోక్యో మెక్సీ" వంటి యాప్ ఆధారిత సంస్థలు ట్యాక్సీ రంగంలో పని చేస్తున్నాయి. డ్రైవర్లకు శిక్షణ ప్రమాణాలు, వినయంగా మాట్లాడే తీరులు, నిబంధనలు పాటించే నైపుణ్యాలు ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తున్నాయి. టాక్సీ డ్రైవర్లు యూనిఫార్మ్, తెల్లదుస్తులు, గ్లౌవ్స్, టోక్యో బాడ్జ్ ధరించి ఉంటారు. వాహనాలన్నీ అత్యంత పరిశుభ్రంగా ఉంటాయి. ప్రయాణికులకు స్వాగతం పలకడం, సహాయపడటం వంటివి వారి సేవా ధర్మంగా ఉన్నవి. జపాన్ టాక్సీ వ్యవస్థ ఇతర దేశాల్లోకూ ప్రభావం చూపింది. భారతదేశం సహా అనేక దేశాల్లో, టోక్యో టాక్సీల సాఫ్ట్‌వేర్ మోడల్‌ను అనుసరిస్తూ యాప్‌లు రూపు దిద్దుకున్నాయి. "%జీుజూఖుఋఇఅ%", "%మీఎ%", "GO" వంటి అప్లికేషన్‌లు, గూగుల్ మ్యాప్ సపోర్టుతో మరింత వేగవంతమైన, ఖచ్చితమైన సేవలను అందిస్తున్నాయి. 1912లో ప్రారంభమైన ఆరంభ టాక్సీ సేవలు జపాన్ నగర పాలనలో, ప్రజల జీవనశైలిలో, సాంకేతిక అభివృద్ధిలో కీలక ఘట్టంగా నిలిచాయి. టోక్యో గింజా వీధుల్లో ప్రారంభమైన ఆ ఐదు టాక్సీల ప్రయోగం, నేడు ప్రపంచ ప్రామాణికాలను నిర్ణయించే స్థాయికి ఎదిగింది. రవాణా రంగంలోని నూతన యుగానికి జపాన్ వేసిన ఈ బాట, ఇప్పటికీ మార్గదర్శకంగా నిలుస్తోంది. జపాన్ టాక్సీ వ్యవస్థ అనేది కేవలం వాహన సేవ కాదు. అది ఆధునికత, సమయపాలన, పరిశుభ్రత, సాంకేతికత కలగలిసిన ఒక సంస్కృతి. 1912 ఆగస్టు 5న ప్రారంభమైన ఈ వ్యవస్థ, శతాబ్ద కాలంగా కొనసాగుతూ, ప్రపంచంలోని నగర రవాణా వ్యవస్థకు ఆదర్శంగా మారింది. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# "తెలుగుని తేజంగా మలిచిన మానవతావాది మండలి వెంకట కృష్ణారావు"

# తెలుగుజాతికి వెలుగు చూపిన దివ్యజ్యోతి: మండలి వెంకట కృష్ణారావు"

## మండలి వెంకట కృష్ణారావు: నిస్వార్థ సేవకు, తెలుగుదనానికి జీవ రూపం



తెలుగు ప్రజల మధ్య నిస్వార్థత, నిష్కల్మషత, నిబద్ధత అనే మూడింటి సమ్మేళనంగా వెలిగిన మహా వ్యక్తి మండలి వెంకట కృష్ణారావు. రాజకీయ నాయకుడిగా, సాంస్కృతిక చైతన్యంగా, భాషా సేవకుడిగా, మానవతా దృక్పథంతో జీవించిన వ్యక్తిత్వం అత్యంత విలక్షణమైనది. కృష్ణా జిల్లా అవనిగడ్డ మండలంలోని మోదుమూడి గ్రామంలో 1926 ఆగస్టు 4న జన్మించిన ఆయన చిన్ననాటి నుంచే సత్యం, ధర్మం, విద్య, సేవ అనే గుణాల ప్రభావంతో నిర్మాణమైన కుటుంబంలో పెరిగారు. తండ్రి మండలి వెంకట సుబ్బయ్య గ్రామ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేయడం వల్ల విద్యతోపాటు సేవా భావన పట్ల గాఢమైన అభిరుచి పెరిగింది. గ్రామీణ వాతావరణంలో బాల్యం గడిపిన ఆయన చిన్నతనంలోనే తెలుగు భాషపై, సాహిత్యంపై, నాటక కళలపై మక్కువ పెంచుకున్నారు. ప్రాథమిక విద్య తరువాత గుంటూరులో ఆంధ్ర క్రైస్తవ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసి, ఆంధ్ర విశ్వ విద్యాలయంలో బి.ఎ. ఆనర్స్ (తెలుగు)లో పట్టా సాధించారు. విద్యార్థి దశ నుంచే ఆచరణాత్మక భావజాలంతో సాహిత్య విమర్శ, నాటకరంగం, ప్రజా ఉద్యమాల పట్ల ఆకర్షితుడయ్యారు. స్వాతంత్ర్యానంతర కాలంలో కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయ రంగంలో అడుగుపెట్టి యువ నాయకుడిగా గుర్తింపు పొందిన ఆయన పదవుల కోసం కాక, ప్రజల సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకొని ఆ రాజకీయాన్ని ఓ మార్గంగా మార్చుకున్నారు. 1962, 1967, 1972, 1978 సంవత్సరాలలో వరుసగా నాలుగు సార్లు అవనిగడ్డ శాసనసభ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలవడం ఆయన ప్రజాదరణకు నిదర్శనం. నిస్వార్థ నాయకత్వం, ప్రజల పట్ల ఉన్న అపారమైన అభిమానంతో ఆయన ఆంధ్రప్రదేశ్ శాసనసభలో విలక్షణంగా నిలిచారు. 1972 నుండి 1978 వరకు విద్యా మరియు సాంస్కృతిక శాఖల మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. విద్యాశాఖ మంత్రిగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రమాణాలు మెరుగుపర్చేలా, విద్యా నిధులను పెంచేలా, బోధనా విధానాల్లో మార్పులు చేయడంలో ఆయన గొప్ప శ్రమ చేశారు. గురుకుల విద్యాలయాల స్థాపన, అనాథ బాలబాలికల వసతి గృహాల ఏర్పాటుకు కృషి చేశారు. అంతేకాకుండా పాఠ్య పుస్తకాల్లో తెలుగు మాధుర్యాన్ని పటిష్ఠంగా నిలిపే దిశగా వ్యవస్థాపక చర్యలు చేపట్టారు. సాంస్కృతిక శాఖా మంత్రిగా ఆయన చేసిన సేవలు తెలుగు భాషా సంస్కృతికి చిరస్థాయిగా నిలిచేలా చేశాయి. తెలుగు నిఘంటువుల రూపకల్పనకు ప్రభుత్వం స్థాయిలో ప్రోత్సాహం కల్పించారు. పాఠశాలలలో తెలుగు అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు, నాటక కళల ప్రోత్సాహానికి నిధుల కేటాయింపు వంటి చర్యలు ఆయన కృషిలో భాగం. తెలుగు భాషాభిమానిగా ఆయన చూపిన తపన అసాధారణమైనది. 1975లో హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభలను విజ్ఞాన, సాంస్కృతిక మహా కార్యక్రమంగా తీర్చిదిద్దిన ఘనత ఆయనదే. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు భాషాభిమానులను ఏకతాటిపైకి తెచ్చిన ఈ మహాసభల అనంతరం స్థాపించబడిన అంతర్జాతీయ తెలుగు కేంద్రానికి ఆయన వ్యవస్థాపక అధ్యక్షుడిగా నియమితులయ్యారు. తెలుగు భాషాభివృద్ధికి ప్రభుత్వం స్థాయిలో కేంద్రాన్ని ఏర్పాటు చేయడం ఆయన దూరదృష్టికి ప్రతీకగా నిలిచింది. ఆయన స్థాపించిన "జగతి" అనే సంస్థ వేదికగా నాటక రంగానికి అపూర్వ సేవలు అందించారు. ఈ వేదికపై ప్రతిభావంతులైన కళాకారులను ప్రోత్సహిస్తూ అనేక నాటక ప్రదర్శనలు నిర్వహించారు. కళ అంటే కేవలం వినోదమేగాక, విలువల బోధనా మాధ్యమమన్న అవగాహనతో ఆయన కళారూపాలను ఎంపిక చేసుకున్నారు. వ్యక్తిగతంగా ఆయన నాటక రచయితగా, ప్రదర్శకునిగా ఎంతో క్రియాశీలకంగా వ్యవహరించారు. సాహిత్యంపై ఆయనకు ఉన్న అవగాహన, భాషాపట్ల ఉన్న ప్రేమ ఆయన రచనల్లో స్పష్టంగా ప్రతిఫలించాయి. "సాహిత్యసేవ", "మాజీమంత్రి ఆత్మకథ" వంటి రచనలు ఆయన అనుభవాల సంకలనం మాత్రమే కాదు, తెలుగు సమాజానికి ఓ దర్పణం. మహా భారతంపై ఆయనకు ఉన్న లోతైన అధ్యయనం ద్వారా ప్రజలకు నైతిక విలువలు బోధించే కార్యక్రమాలు చేపట్టడం మరో విశిష్టత. దేశంలోని అనేక ప్రాంతాల్లో మహాభారతంలోని ధర్మ సిద్ధాంతాలపై ప్రసంగాలు చేశారు. ఆయన ప్రవచనాలలో భాషా మాధుర్యం తోపాటు ప్రజల హృదయాలకు హత్తుకునే శక్తి ఉండేది. అవనిగడ్డ నియోజక వర్గానికి ఆయన చేసిన సేవలు ప్రజల గుండెల్లో చెరిగిపోని గుర్తులుగా నిలిచాయి. విద్యా, నీటి పారుదల, రహదారులు, మత్స్యకారుల అభివృద్ధి వంటి అనేక రంగాల్లో ప్రణాళికా బద్ధంగా పని చేసారు. 1977లో దివి సీమను కుదిపేసిన చాపడిపోటు తుపాను సందర్భంగా సహాయ చర్యలను సమన్వయ పరచడంలో ఆయన పాత్ర అపూర్వమైనది. శాసనసభ లోనే కాక, సహాయక కేంద్రాల్లో, బాధిత ప్రాంతాల్లో ప్రత్యక్షంగా పాల్గొని ఆయన చేసిన సహాయ చర్యలు వేలాది ప్రజల జీవితాలను ప్రభావితం చేశాయి. విపత్తు సమయంలో అధికార వ్యవస్థతో సమన్వయం, ప్రజలలో నమ్మకం, రాజకీయ పార్టీలకు అతీతంగా స్పందించడం ఆయన సేవా ధర్మానికి పరాకాష్ట. ఆయన సేవలకు గుర్తుగా దివి సీమను మెరుగు పరిచే పులిగడ్డ - పెనుమూడి వంతెనకు ఆయన పేరు పెట్టడమే కాక, భవదేవర పల్లిలో "మండలి వెంకట కృష్ణారావు ఫిషరీస్ పాలిటెక్నిక్" స్థాపన ద్వారా మత్స్యకారుల జీవితాల్లో వెలుగును నింపారు. ఆయన కుమారుడు మండలి బుద్ధప్రసాద్ కూడా తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూ, గాంధేయ వాదంతో కూడిన రాజకీయ జీవితం గడిపారు. 1997 అక్టోబర్ 27న ఆయన పరమ పదించారు. కానీ ఆయన ఆశయాలు, కార్య పద్ధతులు, విలువలు నేటికీ ప్రజల మనసుల్లో స్పష్టంగా ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. ఆయన జీవితం సంక్షిప్తంగా చెప్పదగినదేమీ కాదు. అది ఒక చరిత్ర, అది ఒక విద్యా పాఠం, అది ఒక సాంస్కృతిక సంజీవని. మండలి వెంకట కృష్ణారావు మనకు చూపిన మార్గం ౹ ప్రజాసేవ పట్ల అంకిత భావం, భాషపట్ల అభిమానం, సమాజం పట్ల నిబద్ధత కలిగిన జీవన రీతికి ప్రతినిధి. ఆయన ఆదర్శ జీవితం తెలుగుజాతికి ఒక విలువైన పాఠశాల. ఈ రోజుల్లో సార్థకమైన నాయకత్వం కోసం ఎదురు చూస్తున్న సమాజానికి ఆయన జీవితం ఒక పుట కథ కాదు ౹ ఒక చరిత్ర గ్రంథం. భావి తరాలకు సందేశం, మార్గదర్శకం.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# పుణ్యప్రదం... పుత్రదా ఏకాదశి వ్రతం



ఉప అంటే దగ్గరగా, వాసం అంటే ఉండటంబీ దైవానికి దగ్గరవాలనేదే ఉపవాసం లోని ఉద్దేశం. పూజ, జపం, ధ్యానం లేదా ఉపాసన మొదలైన సాధనల ద్వారా మనసును మాధవుడిపై లగ్నం చేయాలి. సాధారణంగా ఏడాదిలో 24, అధిక మాస యుక్త సంవత్సరంలో అయితే 26 ఏకాదశులు వస్తున్నా, దేని ప్రత్యేకత దానిదే. శ్రావణ శుక్ల ఏకాదశిని పుత్రదా ఏకాదశి అంటారు. పుత్రదా అనే పదానికి పుత్రులను ఇచ్చేది అని అర్థం. అందుకే శ్రావణ మాసంలో పుత్రద ఏకాదశి ఉపవాసం పాటించడం వల్ల పుత్ర సంతానం కలుగు తుందని నమ్ముతారు. భారతదేశ మంతటా శ్రావణ పుత్రద ఏకాదశిని భక్తి శ్రద్ధలతో జరుపు కుంటారు. శ్రావణ మాసంలో శుక్ల ఏకాదశి రోజు ఉపవాసం ఉండి ప్రత్యేక వ్రతం ఆచరించడం ద్వారా సంతానం లేని దంపతులకు సంతానం కలుగుతుందని సాంప్రదాయ ఆచరణ పరుల విశ్వాసం. శ్రావణ పుత్రద ఏకాదశి ప్రాముఖ్యతను భవిష్య పురాణంలో ధర్మ రాజుకు శ్రీ కృష్ణుడు పుత్ర ఏకాదశి విశిష్టతను వివరించి, ఆ నాడు ఉపవాసం పాటించడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి శ్రీకృష్ణుడు స్వయంగా వివరించాడు. అలాగే మహిజిత్తు అనే రాజు తన రాజ్యంలోని ప్రజలకు ఏ కష్టాలు లేకుండా కన్న బిడ్డల వలె చూసుకొనగా, రాజుకు సంతానం లేకపోవడం ఒక్కటే నిత్య బాధాకరంగా మారింది. గ్రామ ప్రజలు కూడా తమ రాజుకు సంతానం కలగాలని పెద్ద ఎత్తున పూజలు చేశారు. ఆ రాజ్యానికి సమీపంలోనే ఉన్న తాపసి లోమశుడనే మహర్షి వద్దకు వెళ్ళిన, గ్రామ ప్రజలు, ఏ చేస్తే తమ రాజుకు సంతానం కలిగే వ్రతం చెప్పమని వేడుకోగా మహర్షి శ్రావణ మాసంలోని మొదటి ఏకాదశిని నిష్ఠగా ఆచరిస్తే వారికి సంతానం కలుగుతుందని చెప్పాడు. ఆ మహర్షి సూచన ప్రకారం రాజ దంపతులతో పాటు ప్రజలందరూ కూడా ఎంతో నిష్టగా ఏకాదశి వ్రతాన్ని ఆచరించిన ఫలితంగా రాజుకు పుత్రసంతానం సంప్రాప్తి కలిగింది. అప్పటినుండి ఈ ఏకాదశిని పుత్రదా ఏకాదశి అని పిలుస్తారని పురాణ కథనం. వ్రతాచరణ ప్రకారం విష్ణు విగ్రహానికి పంచామృతం అభిషేకం నిర్వహిస్తారు. పూజా ద్రవ్యాలు, పుష్పాలు, పండ్లు సమర్పిస్తారు. విష్ణువును స్తుతిస్తూ భజనలు, భక్తి పాటలు పాడుతూ రాత్రంతా జాగరణ చేస్తారు. ఏకాదశికి ముందు రోజు అంటే దశమి రోజు మధ్యాహ్నానికి ముందు 'సాత్విక' ఆహారాన్ని మాత్రమే తినాలి. దశమి రాత్రికి సంపూర్ణ బ్రహ్మచర్యం పాటించాలి. రాత్రి పూట భోజనం చేయకూడదు. ఏకాదశి నాడు దంత దావనం చేయకుండా నిమ్మ, జామ లేక మామిడి ఆకులు నోట్లో వేసుకుని నమలాలి. ఏకాదశి రోజు ప్రాతఃకాలం అంటే సూర్యోదయానికి పూర్వమే నిద్రలేచి కాలకృత్యాలు తీర్చుకుని స్నానం, దైవారాధన, దీపారాధన చేసుకుని తమతమ కార్యాక్రమాలు యథావిధిగా చేసుకోవాలి. మధ్యాహ్నం, సాయంత్రం కూడా ఎటువంటి ఆహారాన్ని తీసుకోవద్దు. ఆరోగ్య పరంగా ఇబ్బందులు ఉన్నవారు, ఉద్యోగులు, శ్రామికులు, పిల్లలు, పెద్దలు తేలికపాటి అల్పాహారాన్ని తీసుకోవచ్చు. ఏకాదశి నాడు ఉదయం పూట అవకాశం ఉన్నవారు దేవాలయాల సందర్శన, పూజలు, స్తోత్ర పారాయణాలు చేయాలి. వీలైతే తప్పక గోపూజ చేయాలి. విష్ణు నామస్మరణ చేయాలి. రాత్రివేళ భాగవతాన్ని చదువు కోవడం, విష్ణుసహస్రనామ పారాయణ చేయాలి. ఏకాదశి సూర్యోదయం నుండి ద్వాదశి తెల్లవారు జాము వరకు ఎలాంటి ఆహారాన్ని తిన కూడదు. మర్నాడు ద్వాదశి పారణ చేయాలి. అంటే ప్రాతః కాలంలోనే లేచి యధావిధిగా నిత్య కాలకృత్యాలు, దేవతారాధన చేసుకుని వెంటనే శుచితో చేసిన మహా నైవేద్యాన్ని దేవునికి నైవేద్యంగా సమర్పించి వెంటనే అతిథి ఉంటే వారికి భోజనం పెట్టి తర్వాత భోజనం చేయాలి. శ్రావణ శుద్ధ ఏకాదశికి మరో ప్రత్యేకత కూడా ఉంది. ఈ రోజు కుబేరుని జన్మదినం అని పండితులు చెబుతున్నారు. సిరి సంపదలకు అధిపతి అయిన కుబేరుని కనుక ఈ రోజున పూజిస్తే, ఆయన అనుగ్రహం తప్పక లభిస్తుందట. ఈ రోజు కుబేర యంత్రాన్ని పూజించినా, కుబేర మంత్రాన్ని జపించినా, కుబేర అష్టోత్తరాన్ని పఠించినా విశేషమైన ఫలితం దక్కుతుందని చెపుతారు. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**



# అమెరికాలో పెట్టుబడులకు భారతీయులు సై..!

అగ్రరాజ్యం అమెరికాలో పెట్టుబడులు పెట్టేందుకు భారతీయులు బాగా ఆసక్తి చూపుతున్నారు. ఉద్యోగాలకు అవసరమైన హెచ్1బీ వీసాలు రావడం కష్టంగా మారినా.. వ్యాపారానికి అవసరమైన ఈబీ-5 వీసా(%ఖూ ×అజవర్ఎవత్ ఎఱయిం%)లకు మాత్రం డిమాండ్ తగ్గలేదని డేటా చెబుతోంది. త్వరలో వీటిని ట్రంప్ ప్రకటించిన గోల్డ్‌కార్డులతో భర్తీ చేయనున్న విషయం తెలిసిందే. తాజాగా ఈబీ-5 దరఖాస్తులకు సంబంధించిన డేటాను పరిశీలిస్తే.. గతంలో ఎన్నడూ లేనంతగా భారతీయులు దీనికోసం ఏడాది వ్యవధిలో దరఖాస్తు చేసుకొన్నట్లు అర్థమవుతుంది. గతేడాది ఏప్రిల్ 2024 నుంచి భారతీయుల్లో దీనికి ఆదరణ పెరిగింది. యునైటెడ్ స్టేట్స్ ఇమిగ్రేషన్ ఫండ్ డేటా "2025 ఆర్థిక సంవత్సరం (అక్టోబర్ 2024 నుంచి జనవరి 2025)లో భారతీయుల నుంచి 1,200కు పైగా ఐ-526ఈ పిటిషన్లు వచ్చాయి" అని యూఎస్ఐఎఫ్ సీఎంవో నికోలస్ మాస్ట్రోన్నీ-3 పేర్కొన్నారు. ఇతర రకం వీసాల జారీలో పెద్దసంఖ్యలో బ్యాక్‌లాగ్ ఉండటంతో ఈబీ-5కు డిమాండ్ పెరిగిందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా హెచ్1బీ, గ్రీన్‌కార్డ్‌ల జారీ కష్టంగా మారడం కూడా దీనికి కారణమైంది. ఇప్పటివరకు ఇమిగ్రేషన్ సంస్థ వద్ద దాదాపు 1.1 కోట్ల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈనేపథ్యంలో వేగంగా లభించే ఈబీ-5ను అమెరికా శాశ్వత నివాసానికి మార్గంగా ఎంచుకొన్నారు. వాషింగ్టన్ కేంద్రంగా పనిచేసే 'ఇన్వెస్ట్ ఇన్ ది యూఎస్ఏ' సంస్థ డేటా ప్రకారం 2024 ఆర్థిక సంవత్సరంలో భారతీయులకు 1,428 ఈబీ-5 వీసాలను జారీ చేశారు. అంతకుముందు ఏడాది ఈ సంఖ్య కేవలం 815 మాత్రమే.

**మరింత కఠినంగా గ్రీన్‌కార్డ్..** అమెరికాలో గ్రీన్‌కార్డ్ కోసం అక్కడి ప్రభుత్వం నిబంధనలు మరింత కఠినతరం చేసింది. తాజాగా యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ వీటిని ప్రకటించింది. కుటుంబసభ్యులకు జారీ చేసే ఇమిగ్రెంట్ వీసాలకు కూడా స్క్రీనింగ్, వెట్టింగ్ ప్రక్రియను కఠినతరం చేసింది. అనర్హమైన అప్లికేషన్లు తొలగించేందుకు దీనిని చేపట్టినట్లు ప్రకటించింది. యూఎస్‌సీఐఎస్ సంస్థ మరింత పకడ్బందీగా అర్హమైన వివాహాలను, సరైన కుటుంబసంబంధాలను గుర్తించేందుకు ఇది ఉపయోగపడుతుందని వెల్లడించింది. దీంతోపాటు అవసరమైన చట్టాలను పాటిస్తున్నారని ధ్రువీకరించుకొనేందుకు ఇది అవసరమని భావించారు. ఇక జాతీయ భద్రతకు ఇబ్బందిలేకుండా ఇబ్బందికర వ్యక్తులను గుర్తించేందుకు కూడా ఇది ఉపయోగపడనుంది. కొత్త నిబంధనలు ఆగస్టు 1 నుంచి అమల్లోకి వచ్చాయి. వీటిని పెండింగ్‌లో ఉన్న, కొత్తగా దరఖాస్తు చేసుకొన్న వాటికి వర్తింపజేయనున్నారు. నకిలీ వివాహాలు చేసుకొని అమెరికాలోకి ప్రవేశించే వారిని అరికట్టడం కూడా దీని లక్ష్యం. ఇకనుంచి వివాహాలకు సంబంధించి అధికారులకు మరింత సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. వీటిల్లో జాయింట్ ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్, ఫొటోగ్రాఫ్, మిత్రులు, బంధువుల నుంచి అభినందన పత్రాలు వంటివి ఉన్నాయి. దీంతోపాటు వీసా దరఖాస్తుదారులు వ్యక్తిగతంగా ఇంటర్వ్యూకు హాజరుకావాలి. స్పాన్సర్ గతంలో ఎవరికైనా స్పౌస్‌ల వీసాలు జారీ చేసినా.. ఇమిగ్రేషన్ రికార్డుల్లో తేడాలు ఉన్నా వాటిని యూఎస్‌సీఐఎస్ మరింత లోతుగా దర్యాప్తు చేపడుతుంది.

# చైనాకు ఎందుకు క్లీన్‌చిట్ ఇచ్చారు?కేంద్రానిది 'డీడీఎల్‌జే' పాలసీ: కాంగ్రెస్ విమర్శ

కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. జూన్ 15, 2020న గల్వాన్‌లో మన సైనికులు దేశం కోసం వీరోచితంగా పోరాడి ప్రాణాలను త్యాగం చేసిన తర్వాత మాట్లాడిన ప్రధాని.. మన భూభాగంలోకి ఎవరూ చొరబడలేదని చైనాకు ఎందుకు క్లీన్ చిట్ ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. మన సైనికులు అమరులైనప్పటి నుంచి.. దేశభక్తి కలిగిన ప్రతి భారతీయుడు అనేక ప్రశ్నలు లేవనెత్తినప్పటికీ.. సమాధానాలు ఇవ్వడానికి బదులుగా, మోదీ ప్రభుత్వం గత ఐదేళ్లుగా 'తిరస్కరించు, దృష్టి మరల్చు, అబద్ధం చెప్పు, సమర్థించు' అనే విధానాన్ని అనుసరిస్తూ వస్తోందంటూ ధ్వజమెత్తారు. జవాబుదారీతనం నుంచి తప్పించుకోవడానికి మోదీ ప్రభుత్వం ఎటువంటి పరిస్థితులైనా సృష్టించగదని జైరాం రమేశ్ ఎద్దేవా చేశారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో చైనా పాకిస్థాన్‌కు బహిరంగంగా మద్దతు ప్రకటించినప్పటికీ మోదీ నుంచి ఎటువంటి స్పందన లేదన్నారు. చైనా మన భూ భాగాన్ని ఆక్రమించిందని రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన కొన్ని గంటల తర్వాత జైరాం రమేశ్ ఈ వ్యాఖ్యలు చేశారు. 2 వేల కిలోమీటర్ల మేర భారత భూభాగాన్ని చైనా ఆక్రమించుకుందని రాహుల్ చేసిన వ్యాఖ్యలను సోమవారం సుప్రీం కోర్టు తప్పుబట్టింది. చైనా ఆక్రమించిందనే విషయం మీకెలా తెలుసని కాంగ్రెస్ నేతను ప్రశ్నించిన సర్వోన్నత న్యాయస్థానం.. నిజమైన భారతీయులెవరూ అలా మాట్లాడరంటూ వ్యాఖ్యానించింది.




# హైకోర్టు అదనపు జడ్జిగా జస్టిస్ తుహిన్ కుమార్

అమరావతి: ఏపీ హైకోర్టు అదనపు జడ్జిగా జస్టిస్ తుహిన్ కుమార్ గేదెల ప్రమాణస్వీకారం చేశారు. ఆయనతో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్ ప్రమాణస్వీకారం చేయించారు. తుహిన్ నియామకంతో హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 30కి చేరింది. తుహిన్ కుమార్ స్వస్థలం ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా కత్తుల కవిటి గ్రామం. 1994 మార్చి 9న బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా ఆయన పేరు నమోదైంది. 2000-2004 మధ్య హైకోర్టులో ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా సేవలు అందించారు. 2010-14 మధ్య జీఎంసీ తరఫున హైకోర్టులో స్టాండింగ్ కౌన్సిల్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. 2016-17లో ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు.

చురకలు

## సంపాదకీయం

# పుతిన్ వచ్చాకే వైరం పెరిగిందా?

### అమెరికా రష్యా సంబంధాల వెనుక అసలు కథ!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ విధానం ప్రపంచవ్యాప్తంగా కలకలం రేపుతోంది. దీని కారణంగా గ్లోబల్ స్టాక్ మార్కెట్ నష్టాల్లోకి వెళుతోంది. ఈ విధానం వల్ల భారత్, చైనా వంటి అనేక దేశాలు ఇబ్బందుల్లో పడ్డాయి. టారిఫ్ కారణంగా రష్యా కూడా ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. రష్యా ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా చమురు, గ్యాస్ , ఖనిజాల ఎగుమతులపై ఆధారపడి ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ఈ సంక్షోభం మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది. ఒకానొక సమయంలో అమెరికా రష్యాపై ఆంక్షలు విధించింది.

అందుకే ఈ రెండు దేశాలు ఒకరితో ఒకరు వ్యాపారం చేసుకోవు.


**అమెరికా, రష్యా ఎందుకు శత్రువులు?...** అమెరికా, రష్యా మధ్య శత్రుత్వం ఈనాటిది కాదు. ఉక్రెయిన్ యుద్ధం కావచ్చు లేదా రెండవ ప్రపంచ యుద్ధం కావచ్చు. అమెరికా, రష్యా సంబంధాలు ఎల్లప్పుడూ ఉద్రిక్తంగానే ఉన్నాయి. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో సోవియట్ యూనియన్, అమెరికా మధ్య కూడా తీవ్రమైన విభేదాలు ఉన్నాయి. అందుకే ఈ రెండు దేశాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకునే స్థితికి చేరుకున్నాయి. సోవియట్ యూనియన్ కాలంలోనే రెండు దేశాల మధ్య వైరం పెరగడంతో ప్రపంచం రెండు శిబిరాలుగా విడిపోయింది. ఒకటి అమెరికా, యూరప్ , బ్రిటన్ కలిసి నాటోగా ఏర్పడగా, మరొకటి తూర్పు యూరప్‌తో కలిసి వార్సా ఒప్పందం కింద ఏర్పడింది.

**పుతిన్ రాకతో మరింత పెరిగిన వైరం...** అమెరికా, రష్యా మధ్య వైరం చాలా సంవత్సరాలుగా ఉన్నప్పటికీ, వ్లాదిమిర్ పుతిన్ అధికారం చేపట్టిన తర్వాత అది మరింత పెరిగింది. ఈ రెండు దేశాల మధ్య సంబంధాలు ఎంతగా దిగజారాయంటే, అమెరికా రష్యాపై అనేక రకాల ఆంక్షలు విధించింది. మరోవైపు రష్యా కూడా అనేకసార్లు అమెరికాపై అణ్వాయుధ దాడి చేస్తామని బెదిరించింది.

**అమెరికా, రష్యా వ్యాపారం చేసుకోరా?...** అమెరికా వాణిజ్య ప్రతినిధి కార్యాలయం ప్రకారం, 2024లో అమెరికా, రష్యా మధ్య వాణిజ్యం $3.5 బిలియన్లు (2.7 బిలియన్లు). ఇందులో ప్రధానంగా ఎరువులు, అణు ఇంధనం, కొన్ని లోహాలు ఉన్నాయి. అమెరికా, రష్యా మధ్య వాణిజ్యం నిలిచిపోయినప్పటికీ, కొన్ని ముఖ్యమైన వస్తువుల విషయంలో నేటికీ దిగుమతులు, ఎగుమతులు జరుగుతున్నాయి. కానీ చాలా వస్తువులపై అమెరికా రష్యాపై నిషేధం విధించింది.

# చీకటిలో చరిత్ర రాసిన క్రికెట్ ఆట - గ్యాస్ దీపాల కాంతిలో మొదలైన క్రికెట్ విప్లవం

### రాత్రి క్రికెట్‌కు పునాది వేసిన మెల్‌బోర్న్ 1879 ఘట్టం) - 1879 ఆగస్టు 5న మెల్‌బోర్న్‌లో జరిగిన తొలి రాత్రి క్రికెట్ మ్యాచ్ ఆధారంగా



1879 ఆగస్టు ఐదవ తేదీ. మెల్‌బోర్న్ నగరంలోని ప్రసిద్ధ క్రికెట్ మైదానం సాయంత్రం తర్వాత కూడా వెలుగుతో నిండిపోయింది. ఆ వెలుగులు సహజమైన సూర్యోదయ కిరణాలు కావు. గ్యాస్ దీపాల ప్రకాశం. అదే రోజు రాత్రి, క్రికెట్ చరిత్రలో ఒక అపూర్వ ఘట్టం ఆవిష్కృతమైంది. ఇది కేవలం ఒక ఆట మాత్రమే కాదుక్రీడలను సమకాలీన సాంకేతికతతో అనుసంధానించి, భవిష్యత్తు దిశగా మలిచిన ప్రయోగాత్మక ప్రదర్శన. క్రికెట్ రాత్రిపూట కూడా ఆడవచ్చన్న ఆలోచనకు కార్యరూపం ఇచ్చిన తొలి చరిత్రాత్మక ఉదంతం అదే. అప్పటి కాలంలో క్రికెట్ అనేది పగటిపూట మాత్రమే ఆడే ఆట. ప్రకృతి వెలుగే ప్రధాన ఆధారం. ఉదయం మొదలై సాయంత్రం కల్లా ముగియాల్సిన ఆటను చూసేందుకు ఉద్యోగస్తులకు, మధ్య తరగతి ప్రజలకు అవకాశం ఉండేది కాదు. ఈ నేపథ్యంలో, క్రీడను విస్తరించాలి, ప్రేక్షకులకు మరింత చేరువ చేయాలి అన్న సంకల్పంతో మెల్‌బోర్న్ క్రికెట్ క్లబ్ రాత్రిపూట క్రికెట్ నిర్వహణ అనే వినూత్న ఆలోచనను ముందుకు తెచ్చింది. విద్యుత్ దీపాల కాలం అది కాదు. అందువల్ల స్టేడియం చుట్టూ గ్యాస్ లైట్లు ఏర్పాటు చేశారు. సాధారణ వీధిదీపాల కంటే మూడింతల కాంతిని ఇస్తున్న ఈ ప్రత్యేక దీపాలు మైదానాన్ని ఒక విలక్షణ వేదికగా తీర్చిదిద్దాయి. ఆ రాత్రి సుమారు మూడువేల మంది ప్రేక్షకులు ఈ ప్రత్యక్ష క్రీడా ప్రయోగానికి సాక్షులయ్యారు. విక్టోరియా మరియు ఆస్ట్రేలియన్ ఎలెవన్ జట్ల మధ్య ప్రదర్శనాత్మక మ్యాచ్ ఘనంగా సాగింది. గ్యాస్ లైట్ల వెలుగులో బంతిని గమనించడం, దాన్ని సమర్థంగా ఫీల్డ్ చేయడం, బ్యాటింగ్‌లో అంచనా వేయడం మొదట్లో ఆటగాళ్లకు అసౌకర్యంగా అనిపించినప్పటికీ, త్వరలోనే పరిస్థితులకు అనుగుణంగా మారిపోయారు. గ్యాస్ వెలుగు కంటే బంతి వేగం ఎక్కువగా ఉండడంతో కెచ్‌లు పడడం కష్టంగా మారినా, ఆటకు వచ్చిన కొత్త అభిరుచి ప్రేక్షకుల హర్షధ్వనులను రేకెత్తించింది. ప్రకాశం పరిమితమైనా, మైదానంలోని శబ్ద రహిత గంభీరతలో ఆడిన ప్రతి బంతి ఒక కొత్త అనుభూతిని ప్రసాదించింది. ఈ రాత్రి ప్రయోగం పూర్తిగా సాఫల్యం సాధించిందని చెప్పలేము. గ్యాస్ లైట్ల వల్ల ఏర్పడిన నీడల మధ్య స్పష్టత కొద్దిగా నెమ్మదించినా, ఇది ఒక ఆవిష్కరణా ప్రయోగంగా చరిత్రలో నిలిచిపోయింది. అప్పట్లో దీని ప్రాచుర్యం పరిమితంగానే ఉన్నా, భవిష్యత్తులో విద్యుత్ ఫ్లడ్‌లైట్లు అందుబాటులోకి రాగానే రాత్రిపూట క్రికెట్ మళ్లీ చర్చలోకి వచ్చింది. 1950ల నాటికి ఫ్లడ్‌లైట్ మ్యాచ్‌లు మరింత ప్రచారం పొందాయి. నేటి డే-నైట్ టెస్టులు, వన్డేలు, టీ20లు, ఐపీఎల్ వంటి లీగ్‌లకు మూలసిద్ధాంతంగా ఈ చరిత్రాత్మక సంఘటన నిలిచింది. ఈ ప్రయోగం కేవలం క్రికెట్‌కు మాత్రమే కాదు, క్రీడా ప్రపంచానికి కూడా కొత్త దారులు చూపింది. సాంకేతికతను ఆటలోకి తీసుకురావడం, ఆటను ప్రజల జీవనశైలికి అనుగుణంగా మలచడం, వాణిజ్యపరంగా కొత్త అవకాశాలను అన్వేషించడయన్ని ఈ ఘట్టంలోనే తొలిసారిగా ప్రతిఫలించాయి. ఆటగాళ్లు పరిణతి చాటారు. ప్రేక్షకులు విశేషంగా స్పందించారు. నిర్వాహకులు తమ ప్రణాళికను విజయవంతంగా అమలు చేశారు. అది క్రీడా చరిత్రలో ఓ ఒళ్లు గుగురిపొడిచే స్మృతి. ఒక్క రాత్రి జరిగిన ఈ ప్రయోగం, పునరావృతమయ్యే మార్గం కాదుబీ కానీ మార్గాన్ని చూపిన దిక్సూచి. క్రీడలో మార్పులు ఒకదానికొకటి సంక్షిప్తంగా సాగవు. కానీ కొన్ని సంఘటనలు మార్పుకు మూలకారణంగా నిలిచిన శిలాశాసనాలవలె నిలిచిపోతాయి. మెల్‌బోర్న్ రాత్రి క్రికెట్ మ్యాచ్ అలాంటి మార్గదర్శక ఘట్టం. అది కేవలం వెలుగులో ఆడిన ఆట కాదు. వెలుగును చూస్తూ, క్రికెట్‌ను భవిష్యత్తులో ఎలా ఆడాలో చెప్పిన తొలి వేదాంత వాక్యం. నేడు ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ రూపురేఖలు మారినప్పటికీ, ఆ మార్పుకు మొదటి అడుగు వేసిన రోజు 1879 ఆగస్టు 5 ు క్రికెట్ జ్యోతికి దారి చూపిన రాత్రి. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# తెలుగు గీత కవితకు జీవశైలి ఇచ్చిన వడ్డేపల్లి - ఆగస్టు 5...గేయ గంధర్వుడు వడ్డేపల్లి కృష్ణ జయంతి



తెలుగు భాషా సాహిత్యంలో గేయ సాహిత్యానికి విలక్షణ శైలి, హృదయాన్ని తాకే భావ వృద్ధి, సంగీతానికి తగిన పద సౌందర్యాన్ని అందించిన అరుదైన రచయిత వడ్డేపల్లి కృష్ణ (ఆగస్టు 5, 1948 – సెప్టెంబర్ 6, 2024). లలిత గీతాల నుంచి భక్తి గీతాల వరకు, జానపద గేయాల నుంచి చలనచిత్ర పాటల దాకా అన్ని రంగాలలో తనదైన ముద్ర వేసిన వారు. ఆయన రచనలు వినిపించడమే కాదు, హృదయాన్ని పరవశింప జేసే శక్తిని కలిగి ఉన్నాయి. 1948 ఆగస్టు 5న ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని సిరిసిల్లలో ఒక చేనేత కుటుంబంలో జన్మించిన వడ్డేపల్లి కృష్ణ గారికి చిన్ననాటి నుంచి సాహిత్యం, సంగీతంపై మక్కువ ఉండేది. తల్లిదండ్రులు లక్ష్మమ్మ, లింగయ్యల అనుసంధానంలో పెరిగిన ఆయన చిన్ననాటి నుంచే కవిత్వానికి ఆకర్షితులయ్యారు. సినారె ప్రభావం స్పష్టంగా కనిపించే ఆయన పదబంధాలు, భావవ్యక్తీకరణ నైపుణ్యం కాలక్రమేణా గేయసాహిత్యానికి సజీవ ముద్రగా మారాయి. 1968లో “స్రవంతి”, “కృష్ణా పత్రిక”లలో పద్యాలు, గేయాలు ప్రచురితమవడం ద్వారా ఆయన రచనా జీవితం మొదలైంది. ‘కవికల్యాణం’, ‘గడ్డిపువ్వు’, ‘గాంధీ’, ‘మూడుపూలు ఆరుకాయలు’, ‘సంక్రాంతి లక్ష్మి’, ‘స్వదేశీయం’, ‘వివేకానంద విజయం’, ‘ఆమ్రపాలి’, ‘బతుకమ్మ’, ‘జయజయహే తెలంగాణ’, ‘రమణీయ రామప్ప’ వంటి అనేక సంగీత నృత్యరూపకాలు వ్రాసిన ఆయన, జాతీయ, ప్రాంతీయ నేపథ్యాలను భావప్రధానంగా మలచగల గుణాన్ని కలిగి ఉన్నారు. ఆకాశవాణి ద్వారా ప్రసారమైన ఆయన లలిత గీతాలు సామాన్య శ్రోతల నుండి సాహిత్య ప్రియుల దాకా విశేష ఆదరణ పొందాయి. “ఎందుకో ఈ కళ్లలో”, “వచ్చే సాయంకాలం మౌనమే పలుకేలా”, “తల్లి నీ చూపే దేవుడయ్యేను” వంటి పాటలు శ్రోతల మధుర జ్ఞాపకాల్లో నిలిచి పోయాయి. ‘చిత్రాలకు గీతాలు రచించిన ఆయన, చలన చిత్ర గేయ సాహిత్యంలో సాహిత్య విలువను నిలబెట్ట గలిగిన అరుదైన రచయితగా గుర్తింపు పొందారు. ఆయన టెలివిజన్ సీరియల్స్ కూడా రూపొందించారు, వాటిలో “భక్త కవి పోతన”, “భారతీయ సంస్కృతీ శిఖరాలు” ముఖ్యమైనవి. “గోభాగ్యం” లఘు చిత్రానికి జాతీయ స్థాయిలో స్పెషల్ జ్యూరీ అవార్డు కూడా అందుకున్నారు. అవగాహనతో కూడిన పద వినియోగం, శ్రావ్యమైన పద బలంతో కూడిన రచనలు ఆయన శైలికి ప్రధానంగా నిలిచాయి. ఆయన భక్తి గీతాలు ఆలయాల్లో, భజనల్లో ప్రతిరోజూ వినిపించేవే. ఆయన రచనలు కేవలం వినోదం గానీ, ఆధ్యాత్మిక అనుభూతికే పరిమితం కాకుండా, భావ వ్యక్తీకరణకు, తాత్వికతకు ఆవిష్కారంగా నిలిచాయి. సంగీతం, పద సౌందర్యం రెండింటికీ సమాన ప్రాముఖ్యత ఇస్తూ రచించగల శక్తి ఆయనకు ప్రత్యేకత నిచ్చింది. సాహిత్య సేవలకు గుర్తింపుగా ఆయనకు ‘నంది అవార్డు’, ‘తెలుగు యూనివర్శిటీ గౌరవ సత్కారం’, సినారె అవార్డు, మల్లాది’ స్మారక పురస్కారం, దాశరథి మెమోరియల్ అవార్డు, ఆత్రేయ అవార్డు, వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ పురస్కారం, రవీంద్రభారతి’ లో గవర్నర్ సమక్షంలో అక్కినేని నాగేశ్వరరావుచే కవి సత్కారం వంటి అనేక పురస్కారాలు లభించాయి. ఆయనకు “గేయ కిరీటి”, “లలితశ్రీ”, “కవన ప్రజ్ఞ” వంటి బిరుదులు లభించాయి. నంది అవార్డ్స్ కమిటీ చైర్మన్‌గా, ఇంటర్నేషనల్ చిల్డ్రన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ జ్యూరీ సభ్యునిగా, “పాడుతా తీయగా” లాంటి కార్యక్రమాల జడ్జిగా కూడా ఆయన సేవలు అందించారు. వెయ్యికి పైగా లలిత గీతాలను రచించిన ఆయన, “కరీంనగర్ క్షేత్రాలు” అనే ఆడియో సీడీ ద్వారా భక్తి పరంగా ప్రాంతీయ క్షేత్రాలకు విశిష్టతను చాటారు. “వెలుగచ్చింది” అనే నాటకంలో తెలంగాణ భాష, యాస పట్ల ఆయనకు ఉన్న మక్కువను చాటి చెప్పారు. తెలంగాణ భూమికి సంగీతార్పణంగా “జయజయహే తెలంగాణ” అనే నృత్యరూపకం ద్వారా తన చారిత్రక భావనను ప్రతిబింబించారు. ఆఖరి దశలో అనారోగ్యంతో బాధ పడుతున్న కృష్ణ హైదరాబాదులోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 2024 సెప్టెంబరు 6న మరణించారు. ఆయన మరణం తెలుగు గేయ సాహిత్య ప్రపంచానికి తీరని లోటు. కానీ ఆయన రచనలు, గీతాలు, పదాల సుగంధం పుస్తకాలుగా, ఆల్బములుగా, జ్ఞాపకాలుగా జీవించి ఉంటాయి. వడ్డేపల్లి కృష్ణ ఒక గేయ రచయితగా మాత్రమే కాక, భావ వేదనకు నిలయమైన కవిగా, సమాజ స్పందనలకు ప్రతిరూపమైన సృజన కర్తగా, సంగీతానికి సాహిత్య గంభీరతను నూరిన ప్రకాశమయమైన ప్రతిభావంతుడిగా నిలిచి పోతారు. ఆయన రచనలన్నీ భావితరాలకు శ్రావ్యమైన ఆదర్శంగా నిలవడం ఖాయం. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# బహుముఖ ప్రజ్ఞాశాలి చక్రపాణి - ఆగస్టు 5...చక్రపాణి జయంతి



మన తెలుగు సంస్కృతికి ప్రతీక, భారతీయ సనాతన సంప్రదాయానికి పతాక, చక్రపాణి మానస పుత్రిక, బి.నాగిరెడ్డి పిల్లల పత్రిక%ౌ%చందమామ. దాదాపు ఏడున్నర దశాబ్దాల క్రితం, 1947 జూలై నెలలో తొలిసారిగా ‘చందమామ’ ఆవిష్కృతం అయింది. చందమామ స్థాపించాలనే ఆలోచన పూర్తిగా చక్రపాణిదే. వాస్తవంగా చక్రపాణి కలంపేరు. ఆయన అసలు పేరు ఆలూరు వెంకట సుబ్బారావు (ఆగష్టు 5, 1908 – సెప్టెంబరు 24, 1975 ). బహుభాషావేత్త, తెలుగు రచయిత, పత్రికా సంపాదకుడు, సినీ నిర్మాత, దర్శకుడు. చందమామ – విజయా కంబైన్స్ నిర్మాణ సంస్థను స్థాపించిన వారిలో ఒకరు. చక్రపాణి గుంటూరు జిల్లా తెనాలిలో 1908, ఆగష్టు 5 న ఒక మధ్య తరగతి వ్యవసాయ కుటుంబంలో గురవయ్య, వెంకమ్మ దంపతులకు జన్మించాడు. క్షయ వ్యాధిగ్రస్తుడై 1932 లో మదనపల్లె వెళ్లాల్సి రాగా , ఒక పండితుని సాయంతో బెంగాలీ భాష నేర్చుకున్నాడు. అలా బెంగాలీ నవలలను తెలుగు లోకి అనువదించడం మొదలు పెట్టాడు. ముఖ్యంగా వాగ్దత్త, సుభద, పల్లీయులు, చంద్రనాథ్, దేవదాస్, పరిణీత, నవ విధాన్, బడాదీది, పతివ్రత, హేమాంగిని, నిష్కృతి, మా వారు, వంటి శరత్ రచనలను తెలుగులో అనువదించాడు. రచయితగా, అనువాదకుడిగా పేరు సంపాదించడంతో సినిమా అవకాశాలు వెతుక్కుంటూ రాగా,1940 లో ముంబైలోని ఫేమస్ ఫిలింస్ వారి ధర్మపత్ని కోసం మాటలు వ్రాసాడు. 1945లో బి.ఎన్. రెడ్డి, మూలా నారాయణస్వామి కలిసి వాహినీ సంస్థ బ్యానర్ మీద ‘స్వర్గసీమ’ నిర్మించగా కోసం చక్రపాణికి సంభాషణల రచన అవకాశం కల్పించారు. 1949 లో చక్రపాణికి బి.నాగిరెడ్డి తో స్నేహం ఏర్పడడం ద్వారా వారు విజయా ప్రొడక్షన్స్ స్థాపించి, తొలి ప్రయత్నంగా ‘షావుకారు’ (1950) చిత్రాన్ని ఎల్.వి. ప్రసాద్ దర్శకత్వంలో నిర్మించగా, ఈ సినిమాకి కథ, సంభాషణలు చక్రపాణి సమకూర్చాడు. 1951 లో అఖండ విజయం సాధించిన ‘పాతాళ భైరవి’ చిత్రాన్ని నిర్మించగా, వాహినీ స్టుడియోలో తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషలలో దాదాపు 35 చలన చిత్రాలను రూపొందించారు. విజయా ప్రొడక్షన్స్ క్రింద మాయాబజార్, గుండమ్మ కథ, మిస్సమ్మ, సి.ఐ.డి. అప్పు చేసి పప్పు కూడు లాంటి గొప్ప సినిమాలు తీశారు. చక్రపాణి , నాగిరెడ్డితో కలసి1947 జూలై లో పిల్లల కోసం చందమామ కథల పుస్తకం ప్రారంభించాడు. చందమామ స్థాపించాలనే ఆలోచన పూర్తిగా చక్రపాణిదే. 1934–1935 లో కొడవటిగంటి కుటుంబరావుతో కలసి తెనాలిలో యువ మాసపత్రికను ప్రారంభించాడు.1939 లో సి.పుల్లయ్య ధర్మపత్ని, తర్వాత శ్రీరాజేశ్వరి విలాస్ కాఫీ క్లబ్ చిత్రానికి కథలు చక్రపాణి రాశారు. రచయితగా, నిర్మాతగా, దర్శకుడిగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు పొందిన చక్రపాణి సెప్టెంబరు 24, 1975 న ఈ లోకాన్ని వదిలి వెళ్లాడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ - మానవ చరిత్రలో చంద్రునిపై తొలి అడుగు వేసిన మానవుడు - ఆగస్టు 5...నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ జయంతి



నీల్ ఆల్డెన్ ఆర్మ్‌స్ట్రాంగ్ ు ఈ పేరు వినగానే మానవ శాస్త్ర విజ్ఞాన సాధనలో అత్యున్నత ఘట్టం స్మరణ లోకి వస్తుంది. ఆయన చంద్రుడిపై తొలిసారిగా అడుగు పెట్టిన వ్యక్తిగా, కేవలం అమెరికాకే కాదు, ప్రపంచ మానవ జాతి విజయ గాధలకు సజీవ చిహ్నంగా నిలిచాడు. ఒక వైపు వైమానిక శాస్త్రానికి మార్గదర్శకుడై, మరోవైపు మానవ కలలకు సాధ్యతను నిరూపించిన విశిష్ట వ్యక్తిత్వం ఆయనది. అందుకే నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ జీవితం ఓ అధ్యాయంగా, ఆధ్యాత్మికంగా కూడ మానవోన్నతికి సంకేతంగా మారింది. నీల్ ఆల్డెన్ ఆర్మ్‌స్ట్రాంగ్ ు అంతరిక్ష పరిశోధనకు, మానవ శాస్త్ర సాహసాలకు సజీవ సంకేతంగా నిలిచిన ఒక ప్రతిభాశాలి. అమెరికా దేశానికి చెందిన ఈ వ్యోమగామి, పైలట్, ఏరోనాటికల్ ఇంజనీర్, విద్యావేత్తగా అనేక రంగాలలో తన సత్తా చాటాడు. 1969 జూలై 20న చంద్రుడిపై అడుగుపె ట్టిన తొలి మానవునిగా ఆయన పేరును శాశ్వతంగా చరిత్రలో లిఖించు కున్నారు. 1930 ఆగస్టు 5న అమెరికాలోని ఒహాయో రాష్ట్రంలోని వాపాకొనెటా అనే పట్టణంలో ఆయన జన్మించారు. బాల్యము నుంచే విమానాలపై ఆకర్షణతో ఆయన ఆకాశాన్ని తాకే కలలతో పెరిగాడు. 16వ ఏట ప్రైవేట్ పైలట్ లైసెన్స్ పొందిన ఆర్మ్‌స్ట్రాంగ్, పర్డ్యూ విశ్వ విద్యాలయంలో ఏరోనాటికల్ ఇంజినీరింగ్ లో డిగ్రీ అభ్యసించాడు. కొరియన్ యుద్ధ సమయంలో అమెరికన్ నేవీలో పైలట్‌గా పనిచేసి అనేక యుద్ధ వాహనాలపై విజయవంతమైన సాహసాలను నిర్వహించాడు. యుద్ధం తర్వాత వైమానిక పరిశోధనలో తలమునక లయ్యాడు. 1955లో నేషనల్ అడ్వైజరీ కమిటీ ఫర్ ఏరోనాటిక్స్‌లో ప్రయోగాత్మక పైలట్‌గా చేరిన ఆర్మ్‌స్ట్రాంగ్, అధిక వేగం గల విమానాల పరీక్షలలో విశేషంగా పాల్గొన్నాడు. 1962లో నాసా వ్యోమగాముల బృందంలోకి చేరిన తర్వాత ఆయన ప్రయాణం మరింత పురోగతిని సంతరించుకుంది. 1966లో జెమినీ 8 మిషన్‌లో కమాండర్‌గా వ్యవహరించి అంతరిక్షంలో తొలిసారిగా డాకింగ్ అనే సాంకేతికతను విజయవంతంగా నిర్వహించాడు. ఇది చంద్ర యానానికి కీలకమైన సాంకేతిక విజయంగా పరిగణించ బడింది. 1969 జూలై 16న ప్రారంభమైన అపోలో 11 మిషన్, మానవజాతి చరిత్రలో విశిష్ట ఘట్టంగా నిలిచింది. ఈ మిషన్ ద్వారా చంద్రునిపై మానవుడి అడుగుపెట్టే యత్నానికి శ్రీకారం చుట్టారు. ఆర్మ్‌స్ట్రాంగ్‌తో పాటు బజ్ ఆల్డ్రిన్, మైఖేల్ కాలిన్స్‌లు ఈ మిషన్‌లో భాగస్వాములయ్యారు. జూలై 20న చంద్రుడిపై ఈగిల్ లూనార్ మాడ్యూల్ విజయవంతంగా ల్యాండ్ అయ్యింది. ఆర్మ్‌స్ట్రాంగ్ తొలిసారి చంద్రుడి ఉపరితలంపై అడుగుపెట్టి, మానవ చరిత్రను కొత్త దిశలో నడిపించాడు. “ఈ ఒక్క అడుగు మనిషికి చిన్నదైనా, మానవ జాతికి గొప్ప ముందడుగు” అని పలికిన ఆయన మాటలు శాశ్వతంగా చెవుల్లో మ్రోగుతూనే ఉంటాయి. ఆ సంఘటనను ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 60 కోట్ల మంది ప్రత్యక్షంగా టెలివిజన్ ద్వారా వీక్షించారు. చంద్రయానం అనంతరం ఆర్మ్‌స్ట్రాంగ్ నాసా నుండి పదవీ విరమణ చేసి, సిన్సినాటి విశ్వ విద్యాలయంలో ఏరోస్పేస్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్‌గా పని చేశాడు. ఆయన జీవితమంతా నిరాడంబరంగా, ప్రజల కీర్తికి దూరంగా, విజ్ఞాన నిష్ఠతో గడిపాడు. ప్రభుత్వాలకు సాంకేతిక సలహాలు అందిస్తూ, అంతరిక్ష పరిశోధనల భవిష్యత్తుకు దోహదం చేశాడు. యువతకు స్ఫూర్తిదాయకంగా నిలిచిన ఆయన, భౌతిక శాస్త్రం పట్ల అవగాహన పెరిగేలా చేసే కార్యక్రమాల్లో పాల్గొన్నాడు. అయినా, ఎక్కడా తన ఘనతను కొనియాడు కోలేదు. 2012 ఆగస్టు 25న ఈ మహోన్నత వ్యక్తి కన్నుమూశాడు. ఆయన మరణానికి అమెరికా మాత్రమే కాక ప్రపంచ దేశాలన్నీ శోకసంద్రంలో మునిగి పోయాయి. నాసా కేంద్రాలు, పాఠశాలలు, రహదారులు ఆయన పేరుతో స్థాపించ బడ్డాయి. ఆర్మ్‌స్ట్రాంగ్ జీవితగాథ యుగయుగాల పాటు యువతలో ఆత్మ విశ్వాసాన్ని, కలల సాధన తపనను నూరిపోస్తుంది. ఆర్మ్‌స్ట్రాంగ్ చంద్రునిపై వేసిన అడుగు కేవలం శాస్త్రీయ మైలురాయి కాదు – అది మానవోన్నతిని ప్రతిబింబించిన ఆత్మ నిష్ఠ అడుగు. శూన్యాకాశంలో భూమివాసి వేసిన ఆ అడుగు, మానవ బుద్ధికి, సంకల్పానికి, విజ్ఞానాన్వేషణకు సాక్ష్యంగా నిలిచింది. ఒక సాధారణ వ్యోమగామిగా ప్రయాణం ప్రారంభించిన ఆయన, మానవ చరిత్రలో ఒక గొప్ప ఆధ్యాత్మిక నడకను ఆవిష్కరించిన మహా పురుషుడిగా నిలిచి పోయాడు. భూమి నుంచి చంద్రుని దాకా విస్తరించిన ఆ నడక – ప్రతి మనిషిలోని కలల పక్షికి రెక్కలుగా నిలిచింది. నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ ు ఓ శక్తిమంతమైన శాస్త్ర విజ్ఞానికుడు మాత్రమే కాదు, మానవ కలల విశ్వ దీప్తి. ఆయన జీవితంలో ప్రతి అడుగు, ప్రతి విజయం మానవ జాతికి ఒక ఆశ, ఒక ఉత్తేజం. చంద్రునిపై వేసిన అడుగుతో ఆయన భూమిపై ఎన్నో తరాలకి దారి తెరిచాడు. ఆర్మ్‌స్ట్రాంగ్ చంద్రునిపై వేసిన అడుగు కేవలం ఒక శాస్త్రీయ ప్రగతికి సంకేతం మాత్రమే కాదు, అది మానవ శక్తి, కలలు, విజ్ఞానం, ప్రగతికి ప్రతీక. ఆయన జీవితం యువతకు ప్రేరణగా నిలుస్తుంది. నిరంతరం శ్రమిస్తూ, శాంతంగా విజయం సాధించిన ఆర్మ్‌స్ట్రాంగ్ చరిత్రలో అక్షరాలా వెలుగుతున్న నక్షత్రంగా నిలిచి పోతారు. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

చురకలు



# ప్రకృతి సౌందర్యం.. ఆధ్యాత్మిక నిలయం

కమాన్‌పూర్ : చారిత్రక, ఆధ్యాత్మిక, ప్రకృతి రమణీయ సుందర దృశ్యాలకు నెలవైన రామగిరి ఖిల్లా శ్రావణమాస సందడికి సిద్ధమైంది. శత్రు దుర్భేద్యమైన కోటలు, కట్టడాలు, ఔషధాలకు నెలవైన మొక్కలు, సెలయేర్లు, ప్రకృతి రమణీయ ప్రదేశాలు మంత్రముగ్ధులను చేస్తాయి. సీతారామలక్ష్మణులు నడయాడిన నేల, ఎందరో రాజవంశస్థులు కోటగా చేసుకొని పరిపాలన చేశారు. ఇలాంటి ఎన్నో అద్భుతాలకు నెలవైన ప్రాంతమే రామగిరి ఖిల్లా.

ఫిరంగి, బ్రహ్మగుండం, మల్లెవనం, శివలింగాలు, శివాలయం, సీతారామ కుటుంబసమేత దేవాలయం, సీతారామ పాదముద్రలు, సీతాదేవి స్నానమాడిన సీతమ్మకొలను, తాటికోట, జంగికోట సోలుకోట, సింహాలకోట, ప్రతాపరుద్రమ మహాదేవుని కోట, పసుపు కుంకుమరాళ్లు, గంగాగౌరి సవతుల బావులు, చింతకోట, విఠల్‌గోవింద హన్మదాలయం, నిమ్మకోట, మందుకోటలు, కుర్మగుండం, ధనధాన్యపు బావులు, సప్తమాత్రికలు, గొల్లభామలు, బృందావనం, మాదవిమండం వంటి కోటలు, ఆలయాలు ఇక్కడ వీక్షించవచ్చు. ఔషధ మూలికలు, సుగంధ గుణాలు కలిగిన మొక్కలు ఖిల్లాపై 250 రకాలు ఉన్నట్లు మూలిక వైద్యులు గుర్తించారు. ఏటా శ్రావణమాసంలో ఇక్కడికి వచ్చి వీటిని



తీసుకువెళ్తారు. రామగిఖిల్లాపై ఓరుగల్లు, గొల్గొండ తరహాలో నిర్మించిన కోటలు, బురుజులు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటాయి. శత్రువుల ఉనికి పసిగట్టేలా ఖిల్లాకు ఇరువైపులా బురుజులను నిర్మించారు. ఖిల్లాపైకి శత్రువులు రాకుండా చుట్టూ 3 నుంచి 120 అడుగుల ఎత్తువరకు రాతిగోడను నిర్మించారు. ఖిల్లాపై నుంచి చూస్తే 25 కి.మీల దూరంలోని గోదావరి కనిపిస్తుంది.

**ఇలా చేరుకోవచ్చు**

సందర్శకులు పెద్దపల్లి-మంథని ప్రధాన రహదారి బేగంపేట క్రాస్‌రోడ్డు వద్ద దిగాలి. ఇక్కడి నుంచి బస్సు లేదా ఆటోలో 4 కి.మీలు ప్రయాణిస్తే బేగంపేట గ్రామశివారుకు చేరుకోవచ్చు. ఇక్కడ నుంచి కాలినడకన మూడు కి.మీలు వెళ్తే ఖిల్లాకు చేరుకోవచ్చు. నేరుగా దైవదర్శనం చేసుకోవాలంటే రత్నాపూర్ గ్రామం నుంచి సొంత వాహనాల్లో ఖిల్లా కింది వరకు వెళ్లవచ్చు. ప్రతి శని, సోమవారాల్లో సందర్శిస్తే మంచిదని స్థానికుల భావన. పూర్తిగా అటవీప్రాంతం కావడంతో బృందంగా సందర్శించడమే మంచిది.

# చెరువు నిండలే.. చింత తీరలే

ఎల్లారెడ్డిపేట: జిల్లాలో బోర్లు, బావులే వ్యవసాయానికి ప్రధాన నీటి వనరులు. సమృద్ధిగా వర్షాలు కురిసి, నీటి వనరులు పూర్తిస్థాయిలో జలకళను సంతరించుకుంటేనే భూగర్భజల మట్టాలు పెరుగుతాయి. అయితే ఇటీవల కురిసిన వర్షాలతో పత్తి, మొక్కజొన్న, కంది, పెసర తదితర ఆరుతడి పంటకు జీవం పోసినా.. ప్రధాన వరి సాగుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న నీటి వనరుల్లో చిన్నపాటివి కొన్ని మాత్రమే నిండినప్పటికి.. పెద్దఎత్తున ఆయకట్టు కలిగిన వాటిలో వరద చేరడంలేదు.

**వరదరాక అంతంతమాత్రమే**

జిల్లాలోని మధ్య తరహా ప్రాజెక్టుల్లోనూ ఇన్‌ఫ్లో అంతంతమాత్రంగానే ఉంది. 3.50 టీఎంసీల నీటి సామర్థ్యం గల అన్నపూర్ణ జలాశయంలో 1.27 టీఎంసీలు, 2 టీఎంసీల సామర్థ్యమున్న ఎగువ మానేరులో 1.01, 3 టీఎంసీల సామర్థ్యం ఉండే మల్కపేట రిజర్వాయర్‌లో 0.70, 27.55 టీఎంసీల సామర్థ్యమున్న మధ్య మానేరులో 7.239 టీఎంసీల నీరుంది. వీటితోపాటు సిరిసిల్ల నియోజకవర్గంలో 265 చెరువులు, వేములవాడ నియోజకవర్గంలో 251 చెరువులను కలుపుకొని మొత్తం 516 వరకున్నాయి. 75-100 శాతం నీరున్న చెరువులు 6 మాత్రమే ఉండగా.. 0-25 శాతం నీరున్నవి 311, శాతం వరకు 113, 50-75 శాతం వరకు నీరున్నవి 50 ఉన్నాయి.

**ఏడు మండలాల్లో సాధారణ వర్షపాతం**

గతనెల 1 నుంచి ఈనెల 28 వరకు 335.1 మిల్లీ మీటర్ల సాధారణ వర్షపాతానికిగాను 340.8 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. కోనరావుపేట, ముస్తాబాద్, తంగళ్లపల్లి, గంభీరావుపేట, ఇల్లంతకుంట మండలాల్లో మాత్రమే సాధారణానికి కంటే ఎక్కువ వర్షాలు పడగా మిగితా ఏడు మండలాల్లో సాధారణం, రుద్రంగిలో లోటు వర్షపాతం నమోదైంది.

**సాగు ఇలా..** జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో మొత్తం 2,43,773 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని అధికారులు అంచనా వేశారు. అందులో వరి 1,84,860 ఎకరాలు, మొక్కజొన్న 1600 ఎకరాలు, పత్తి 49,760 ఎకరాలు మిగతావాటిలో ఇతరత్రా ఉంటాయని ప్రణాళిక రూపొందించారు. అయితే ఈ నెల 28 వరకు 1,43,110 ఎకరాల్లో వరి, 45,500 ఎకరాల్లో పత్తి, 3923 ఎకరాల్లో మొక్కజొన్న, 572 ఎకరాల్లో కంది ఇతర పంటలు కలుపుకొని మొత్తం 1,93,230 ఎకరాల్లో సాగు చేశారు.

# లబ్ధిదారులే ఉంటున్నారా..?

తూప్రాన్: పేద ప్రజల ఇంటి కలను నెరవేర్చడానికి గత ప్రభుత్వం రెండు పడక గదుల ఇళ్లను నిర్మించింది. చాలా చోట్ల నిర్మాణాలు పూర్తిచేసి లబ్ధిదారులకు పంపిణీ చేసింది. వాటి వినియోగం తీరుపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. ఈ మేరకు తనిఖీలు చేపట్టాలని నిర్ణయించడం గమనార్హం.

4700కు పైగా..జిల్లాలో మెదక్, రామాయంపేట, నర్సాపూర్, తూప్రాన్ పురపాలికలతో పాటు 469 గ్రామాలకు 4700కు పైగా రెండు పడక గదుల ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో 3 వేలకు పైగా నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇప్పటివరకు 2500 గృహాలను లబ్ధిదారులకు అందజేశారు. 700కు పైగా ఇళ్ల నిర్మాణాలు తుదిదశలో నిలిచిపోయాయి. మెదక్, తూప్రాన్, నర్సాపూర్, రామాయంపేట, చేగుంట, నిజాంపేటతో పాటు పలు మండలాల్లో వివిధ దశల్లో ఉన్న ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాల్సి ఉంది. చిలప్‌చెడ్ తదితర ప్రాంతాల్లో ప్రారంభించకుండానే వదిలేశారు.

తనిఖీ చేసి..జిల్లాలో పేద ప్రజలకు పంపిణీ చేసిన ఇళ్లల్లో లబ్ధిదారులే నివాసం ఉంటున్నారా, ఇతరులకు విక్రయించారా, వేరే వారికి అద్దెకు ఇచ్చారా తదితర వాటిని తెలుసుకునేందుకు ప్రభుత్వం తనిఖీ ప్రక్రియ చేపట్టింది. ప్రయోగాత్మకంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని రెండు ప్రాంతాల్లో సర్వే చేశారు. ఇది అక్కడ విజయవంతం కావడంతో అన్ని జిల్లాల్లో తనిఖీ చేసేందుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ మేరకు పరిశీలనకు అధికారులను నియమిస్తారు. వారు ఇళ్ల వద్దకు వెళ్లి అన్నింటిని తనిఖీ చేస్తారు. ఆయా వివరాలను 'హౌసింగ్ కాలనీస్ ఇన్‌స్పెక్షన్' పేరిట రూపొందించిన యాప్‌లో నమోదు చేస్తారు. తద్వారా అక్రమాలకు చెక్ పడే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.ఫిర్యాదుల నేపథ్యంలో..ఇటీవల కొందరు నిబంధనలకు విరుద్ధంగా తమకు కేటాయించిన ఇళ్లను ఇతరులకు విక్రయించడం, వేరే కుటుంబాలకు అద్దెకివ్వడం వంటి ఫిర్యాదులు అధికారులకు వచ్చాయి. దీంతో క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది

# ఆలోచన మంచిది.. ఆచరణ మరిచింది



కరీంనగర్ : కరీంనగర్ స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ పరిధిలో పారిశుధ్య పనుల నిర్వహణలో భాగంగా పారిశుద్ధ్యానికి ప్రాధాన్యమిచ్చారు. రద్దీ ప్రాంతాల్లో చెత్తా చెదారం బయటకు కనిపించకుండా ఉండేందుకు భూగర్భ చెత్త డబ్బాలు ఏర్పాటు చేశారు. రూ.1.63 కోట్లతో స్మార్ట్ చెత్తకుండీలు (బిన్స్) కొనుగోలు చేసి పలు చోట్ల బిగించారు. పోర్టబుల్ స్టాటిక్ కంపాక్టర్ స్టేషన్ కోసం రూ.1.43 కోట్లు కేటాయించారు. సెన్సార్ విధానంలో జీపీఎస్ అనుసంధానం చేయాలి. ఒక్కో దాంట్లో ఏ మేర చెత్త నిండిందనే విషయం సంబంధిత అధికారికి, వాహన డ్రైవర్ సెల్‌ఫోన్‌కు సంక్షిప్త సమాచారం రావాల్సి ఉంటుంది. ఈ సాంకేతికను అనుసంధానం చేయడంలో విఫలమయ్యారు.

**కొరవడిన ఆధునికత**

నగరంలో స్మార్ట్ డస్ట్‌బిన్స్ ఏర్పాటు చేస్తే ఎంతవరకు ఉపయోగంలో ఉంటాయనే విషయాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే ప్రణాళికలు చేశారు. స్మార్ట్ ప్రాజెక్టులో పొందుపర్చి ఆ తర్వాత అమలు చేయడం భారంగా మారింది. ఆధునికత జోడించాలనే లక్ష్యంతో తీసుకొచ్చిన ప్రాజెక్టును ఆ తర్వాత స్మార్ట్‌సిటీ ఏజెన్సీ, అధికారులు అటకెక్కించారు. మొత్తం ఆరు చోట్ల సివిల్ ఆసుపత్రి వెనుకాల, హౌసింగ్‌బోర్డుకాలనీ, బస్టాండ్ వెనుకాల, సప్తగిరికాలనీ, కశ్మీర్‌గడ్డ, చైతన్యపురి మార్కెట్ ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేశారు. ప్రభుత్వాసుపత్రి వెనుక వీధి వ్యాపారుల షెడ్లు నిర్మించడంతో అక్కడి నుంచి తొలగించి శర్మనగర్‌లో ఓ ప్రైవేటు ఆసుపత్రి పక్కన బిగించారు. వీటిని ప్రస్తుతం చెత్త డబ్బాల మాదిరిగా వదిలేశారు. అందుల్లోంచి చెత్త తీసి తరలించడం సవాల్‌గా మారింది. పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి.

**రూ.కోట్లు వెచ్చించినా..**భూగర్భ చెత్త డబ్బాల నుంచి చెత్తను తగ్గించేందుకు 12 టన్నుల సామర్థ్యంతో కంపాక్టర్ స్టేషన్ నిర్మించారు. నగర వీధుల్లోంచి వచ్చే చెత్తను ఇందుల్లోకి పంపించి తగ్గిస్తారు. ఆ తర్వాతే డంపింగ్‌యార్డుకు తీసుకెళ్లాల్సి ఉండగా వినియోగంలోకి తీసుకురావడం లేదు. మరో వైపు హుక్ లోడర్ వాహనాన్ని తీసుకురాగా దాని ఆపరేటింగ్, ఇన్‌స్టాలేషన్ చేసే వారు లేరు. రూ.కోట్లు ఖర్చు చేసినా అవి నిరుపయోగంగానే మారాయి. ఎప్పటిలోగా వీటిని ఉపయోగంలోకి తీసుకొస్తారనే విషయాన్ని మాత్రం అధికారులు చెప్పడం లేదు.**అధికారులతో సమీక్షిస్తాం**

స్మార్ట్ చెత్తకుండీల నిర్వహణపై అధికారులతో సమీక్షిస్తాం. వీటిని ఏవిధంగా ఉపయోగించుకోవాలనే విషయంపై చర్చించి నిర్ణయం తీసుకుంటాం.ప్రఫుల్‌దేశాయ్, కమిషనర్, కరీంనగర్ నగరపాలిక

# పకడ్బందీగా ఠాణాల నిర్వహణ



కరీంనగర్ : పోలీస్‌స్టేషన్ అంటే ఫిర్యాదులు, విచారణ, కేసులు, అధికారులు, సిబ్బంది, బాధితులు, నిందితులతో హడావుడిగా ఉంటుంది. కొన్ని ఠాణాల్లోని గదులన్నీ ఫిర్యాదులు, దస్త్రాలతో నిండి దుమ్ముధూళి, బూజులతో అపరిశుభ్రంగా ఉంటాయి. పట్టుబడిన వాహనాలను ఎక్కడపడితే అక్కడ ఇష్టానుసారంగా ఉంచుతారు. దీంతో పరిసరాలంతా ఠాణాకు వచ్చేవారికి అపరిశుభ్రంగా కనిపిస్తాయి. వీటన్నింటికి చెక్ పెట్టేందుకు కొన్నేళ్ల కిందట పోలీసు శాఖలో 5ఎస్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చారు. కమిషనరేట్ పరిధిలోని అన్ని ఠాణాల్లో దీనిని అమలు చేస్తున్నారు.

**ఏయే అంశాలంటే..**

ఠాణాలోని ప్రతి విషయం పోలీసులతోపాటు ఫిర్యాదుదారులకు అర్థమయ్యే విధంగా ఉంచాలనేదే దీని ఉద్దేశాల్లో ఒకటి. నమోదవుతున్న కేసులు, ఎఫ్ఐఆర్, విచారణ, దర్యాప్తులతోపాటు ఠాణాలను శుభ్రంగా ఉంచుకోవడం, వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలు, పోలీసులు వినియోగిస్తున్న వాహనాలు క్రమంగా పెట్టడం కూడా 5ఎస్ లో భాగమే. ఠాణా పరిసరాలను పరిశుభ్రంగా.. ఆహ్లాదకంగా ఉంచడం ముఖ్యమైన అంశం.

క్రమబద్ధీకరించు (సార్ట్) : అనవసర వస్తువులను తొలగించి స్టేషన్‌ను అందంగా ఉంచుకోవాలి. సిబ్బంది ఎలాంటి కేసుకు సంబంధించిన ఫైల్ అయినా వెంటనే గుర్తించే విధంగా ఉంచాలి.

వరుసగా క్రమంలో పెట్టు (సెట్ ఇన్ ఆర్డర్) : వివిధ సెక్షన్‌ల కింద నమోదవుతున్న కేసులకు సంబంధించిన ఎఫ్ఐఆర్ షీట్లను క్రమ సంఖ్యతో ఏర్పాటు చేసి వాటికి ఒక కోడ్ నంబర్‌ను ఇవ్వాలి. కేసు పూర్వపరాలు తెలుసుకోవాలనుకున్నప్పుడు విచారించే క్రమంలో గుర్తించేందుకు ఆ కోడ్ ఉపయోగపడుతుంది.

మెరుగుపరచడం (షైన్) : ఫిర్యాదుదారులు ఠాణాకు వచ్చినప్పుడు ఇబ్బంది పడకుండా ఉండేందుకు అందంగా తీర్చిదిద్దాలి. వారు వేచి ఉండేందుకు కుర్చీలు, నీటి సౌకర్యం కల్పించాలి.

ప్రామాణికం (స్టాండర్‌డైజ్): వస్తువులన్నీ ఒకే చోట క్రమబద్ధంగా ఏర్పాటు చేయాలి. వస్తువుల అమరిక ఆకర్షించే విధంగా ఉండాలి.

కొనసాగించు (సస్టయిన్) : సిబ్బంది బదిలీ అయినప్పుడు కొత్తగా వచ్చే వారు వెంటనే పాత పద్ధతులను గుర్తించే విధంగా సాంకేతికపరమైన అంశాలను మార్చకుండా స్థిరంగా ఉంచాలి.

**సిబ్బందికి ఉపయోగకరంగా..**

కమిషనరేట్ పరిధిలో 5ఎస్ విధానం అమలు చేయడంతో భవిష్యత్తులో అన్ని విభాగాల పోలీసు సిబ్బందికి ఉపయోగకరంగా ఉంటుంది. ఠాణాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే సిబ్బందికి గౌరవం లభిస్తుంది. ఒకరే పని చేయడం కాకుండా అన్ని అంశాలపై అందరికీ పట్టు రావడం కోసం ఈ ప్రయత్నం చేస్తున్నాం.

గౌష్ ఆలం, పోలీస్ కమిషనర్, కరీంనగర్

# రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఇష్టారాజ్యం!



కరీంనగర్ : కరీంనగర్ జిల్లా కొత్తపల్లి హవేలీలో సర్కారు, సీలింగ్ భూముల విషయంలో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారనే ఆరోపణలతో గంగాధర సబ్ రిజిస్ట్రార్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఈ ఏడాది జనవరి 15న మెట్‌పల్లిలో మార్టిగేజ్ పత్రాలకు రూ.5 వేలు లంచం తీసుకుంటూ సబ్ రిజిస్ట్రార్, డాక్యుమెంట్ రైటర్, సిబ్బంది అనిశాకు పట్టుబడ్డారు.ఒకే ఇంటి సంఖ్యతో 24 స్థలాల్ని రిజిస్ట్రేషన్ చేశారనే కారణంతో గతంలో తిమ్మాపూర్ సబ్ రిజిస్ట్రార్‌పై ఉన్నతాధికారులు సస్పెండ్ చర్యలు తీసుకున్నారు.ఆర్నెల్ల కిందట తప్పుడు డాక్యుమెంట్‌లతో రిజిస్ట్రేషన్ చేశారని బాధితులు పెద్దపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సిబ్బందితో వాదనకు దిగారు. కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలోని భూదందాల్లో నేరాలపై కేసులు నమోదైన ఘటనల్లో రిజిస్ట్రేషన్ సిబ్బంది సహకారాలున్నట్లు విచారణల్లో తేలింది.సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది దన్నుతో దళారుల ఇష్టారాజ్యం నడుస్తోంది. భూములకు సంబంధించిన వ్యవహారంలో ప్రతి కార్యాలయం వద్ద దళారులు ఈ పనిని చక్కబెడుతున్నారు. పైసలివ్వనిది ఏ పని కావడం లేదని.. అడిగింది ఇవ్వకుంటే గంటలో కావాల్సిన పనిని రోజుల తరబడి వాయిదా వేస్తారని క్రయవిక్రయదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఎల్ఆర్ఎస్ (లే అవుట్ రెగ్యులరైజేషన్) దరఖాస్తు సమయంలో స్థిరాస్తి విలువ నిర్ధారణ పత్రం తప్పనిసరి అవడంతో చాలామంది సిబ్బంది వీటి జారీ విషయంలో డిమాండ్‌గా డబ్బులు తీసుకున్నారనే ఆరోపణలున్నాయి. దళారులు పంపే దస్త్రాలపై వేసే కోడ్ ఆధారంగానే పని అవుతుండటంతో ప్రజలు వారినే ఆశ్రయిస్తున్నారు. మార్కెట్ విలువ ధ్రువపత్రం, ఈసీ ఇలా రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ఏ ధ్రువపత్రం అయినా ఎంతోకొంత ముట్టజెప్పాల్సి వస్తోందని జనం వాపోతున్నారు. దస్త్రాన్ని బట్టి రూ.వేయి నుంచి రూ.15 వేల వరకు డిమాండ్ చేస్తున్నారని చెబుతున్నారు.

**అన్నింటా 'చేతివాటమే'!**


ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 14 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. ఏడాదికి సగటున 36 వేలకు పైగా రిజిస్ట్రేషన్ దస్తావేజులుంటున్నాయి. రిజిస్ట్రేషన్‌ల ద్వారా సర్కారుకు స్టాంప్ డ్యూటీ ఇతర ఛార్జీల రూపంలో రూ.120 కోట్ల వరకు ఆదాయం సమకూరుతుంది. కానీ ఏ ఒక్క డాక్యుమెంట్ కూడా సిబ్బంది చేతివాటం లేనిదే రిజిస్ట్రేషన్ ప్రక్రియ దాకా తీసుకెళ్లడం లేదు. పేరు మార్పిడి, పత్రాల్లో తప్పిదాలు, కొంచెం ఇబ్బంది ఉన్నవాటి విషయంలో లక్షలాది రూపాయలు డిమాండ్ చేస్తారనే ఆరోపణలున్నాయి. ముఖ్యంగా నిషేధిత భూములు, ప్రభుత్వ భూముల రిజిస్ట్రేషన్‌ల కోసం లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నాయి. సగటున ఒక డాక్యుమెంట్‌కు రూ.500 లంచంగా లెక్కేసినా రూ.1.80 కోట్లు అవినీతి రూపంలో చేతులు మారుతున్నట్లు ఆరోపణలున్నాయి.

# నీటిని ఇంకించి.. భూగర్భ జలాలు పెంచి

పెద్దపల్లి : సాగు, తాగు నీటిని విచ్చలవిడిగా తోడేయడంతో భూగర్భజలాలు పతాక స్థాయిలో పడిపోతున్నాయి. బోర్లు వట్టిపోతున్నాయి. ఈ క్రమంలో ప్రకృతి వరప్రసాదమైన నీటిని సంరక్షించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రపంచ బ్యాంకు నిధులతో ప్రధాన మంత్రి కృషీ సంచాయి యోజన(పీఎంకేఎస్‌వై)లో వర్షాభావ ప్రాంతమైన జిల్లాలోని మంథని డివిజన్‌లోని ఆరు సమస్యాత్మక గ్రామాలను ఎంపిక చేశారు.

**అక్కడ ప్రమాదకర స్థాయిలో..**

జిల్లాలో గోదావరి, మానేరు పరీవాహక ప్రాంతమైన మంథని డివిజన్‌లోని స్వర్ణపల్లి, నాగేపల్లి, వెంకటాపూర్, మల్లారం, వెక్లాస్‌పూర్, ఖాన్‌సాయిపేటలో భూగర్భ జలాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇక్కడ 22 మీటర్ల లోతులోకి నీటిమట్టాలు పడిపోతున్నాయి. తలాపునే గోదావరి ప్రవహించినప్పటికీ సాగు కోసం రైతుల భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. 400 మీటర్లు బోర్లు నిర్మించినా చుక్క నీరు కనిపించడం లేదు. బోర్ల తవ్వకాలకు రూ.లక్షల్లో ఆర్థికంగా నష్టపోతున్నారు. భూగర్భ జలాలు తక్కువగా ఉండటం, కోతకు గురైన భూములు, మెట్ట ప్రాంతాలున్న గ్రామాల ఎంపికలో ప్రామాణికం పాటించారు.



**అయిదేళ్లు సంరక్షణ ఇలా..**

ఎంపికైన ప్రాంతాల్లో అయిదేళ్లపాటు జల సంరక్షణ పనులు చేస్తారు. ప్రతి ఊరిలో 2,500 హెక్టార్లలో భూగర్భ జలాలు వృద్ధిలోకి తీసుకొస్తారు. వాగులకు చెక్‌డ్యాం, నీటి కుంటలు, రాతి కట్టడాలు నిర్మిస్తారు. ఏటవాలు ప్రాంతాల్లో వర్షం నీరు నిలిచేందుకు కాంటూరు, సమత కందకాలు తవ్విస్తారు.

**పెరగనున్న భూగర్భ జలాలు**అయిదేళ్లలో ప్రజల జీవనోపాధులు మెరుగుపరిచి వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ఆయా గ్రామాల్లో వర్షపాతం, భూగర్భ జలాలు, అటవీ విస్తీర్ణం, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఎక్కడ ఎలాంటి రకమైన పనులు చేయాలనే అంశంపై క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి నిధుల మంజూరు కోసం ప్రతిపాదించనున్నారు.

**భావితరాలకు కష్టాలు లేకుండా..**

మంథని డివిజన్‌లోని ఆరు గ్రామాల్లో భూగర్భ జలాలు పెంపొందించనున్నాం. భావితరాలకు నీటి కష్టాలు లేకుండా వర్షం నీటికి భూమిలోకి ఇంకించే పనులు చేస్తాం. దీంతో రైతులకు సాగు నీటి ఇబ్బందులు తొలగనున్నాయి.కాళిందిని, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

# ఖాళీలు.. కష్టాలు

జగిత్యాల: ఇబ్రహీంపట్నం మండలం మేడిపల్లిలో జేఎల్ఎం లేక ట్రాన్స్‌ఫార్మరుపై ఫ్యూజు సరి చేయడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రాత్రి వేళ సరఫరా నిలిచిపోతే తెల్లవారేదాకా జాగారం చేయాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. పగటి పూట ఫ్యూజు మార్చాల్సి వస్తే ప్రమాదమైనా స్థానికులే సరిచేసుకుంటున్నారు.

జిల్లాలో జేఎల్ఎంలకు ఇటీవల అసిస్టెంట్ లైన్‌మెన్‌గా పదోన్నతులు కల్పించారు. వీరు ఉపకేంద్రాల్లో ఆపరేటర్లుగా పని చేస్తూనే బిల్లులు వసూలు చేయాల్సి ఉంటుంది. క్షేత్ర స్థాయిలో సమస్యలు వస్తే సరి చేయాలి. ఈ క్రమంలో క్షణం తీరిక లేకుండా పని చేస్తున్నామని పదోన్నతి పొందిన ఓ ఉద్యోగి ఆవేదన వ్యక్తం చేశారు.

**రైతులే మెకానిక్‌లు** జిల్లా పరిధిలో విద్యుత్తు శాఖలో పరిస్థితికి ఈ రెండు సందర్భాలు అద్దం పడుతున్నాయి. జేఎల్ఎంలు, ఆపరేటర్ల ఖాళీలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మొత్తం 118 ఉపకేంద్రాలుండగా 92 ఆపరేటర్ పోస్టులు, 185 జేఎల్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 385 పంచాయతీల పరిధిలో ప్రతి గ్రామానికి ఒక జేఎల్ఎం ఉండాలి. చాలా చోట్ల ఖాళీలతో ప్రైవేటు విద్యుత్తు సిబ్బంది ఫ్యూజులు వేయాల్సి వస్తోంది. కొన్ని సందర్భాల్లో తామే మరమ్మతు చేసుకోవాల్సి వస్తుందని, ఈ క్రమంలో విద్యుదాఘాతానికి గురవుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు సారంగాపూర్, చిల్వకోడూరు, రాఘవపేట, మెట్‌పల్లి రూరల్ ఏఈ పోస్టులు ఖాళీగా ఉండగా ధర్మపురి, మెట్‌పల్లి రూరల్, మల్లాపూర్ ఏడీఈ పోస్టులు భర్తీకి నోచుకోవడం లేదు.

**జిల్లాలో ఖాళీలు ఇలా..**

జేఎల్ఎంలు: 185 ఉపకేంద్రాల ఆపరేటర్లు: 92

ఏఈలు: 4 ఏడీఈలు: 3

**పెరుగుతున్న ప్రమాదాలు**

వర్షాకాలంలో విద్యుత్తు సరఫరాకు తరచూ అంతరాయాలు తలెత్తుతుంటాయి. గాలి వీచినప్పుడు ఫ్యూజులు పోవడం, తీగలు తెగిపోవడంతో పాటు ఇన్సులేటర్లు దెబ్బతింటుంటాయి. క్షేత్ర స్థాయి సిబ్బంది ప్రతి రోజూ లైన్లను పరిశీలిస్తూ విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ చూసుకోవాల్సి ఉంటుంది. సిబ్బంది కొరతతో అమలుకు నోచుకోవడం లేదు. ఫలితంగా విద్యుత్తు ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. ఇక ఉన్న సిబ్బందిని సైతం లైన్ నిర్వహణకు కాకుండా బిల్లుల వసూలు, రీడింగ్ నమోదుకు వినియోగిస్తున్నారు. దీంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉంటున్నాయి.

**ప్రభుత్వానికి నివేదించాం**

జిల్లాలో ఖాళీల వివరాలపై సంస్థ ఉన్నతాధికారులకు నివేదిక పంపాం. ప్రభుత్వం ఖాళీలు భర్తీ చేస్తే పూర్తి స్థాయిలో సిబ్బంది అందుబాటులోకి వస్తారు. సమస్యలు తీవ్రంగా ఉన్న చోట ఇతర ప్రాంతాల నుంచి పంపిస్తున్నాం. సమస్యపై మరోసారి ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

సుదర్శన్, ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ

## కొత్త దవాఖానాలు.. చేరువలో వైద్య సేవలు

వికారాబాద్: జిల్లాలోని గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు మరంత చేరువ కానున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే వివిధ పథకాలు ప్రవేశపెట్టాయి. ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ కావాలన్న ఉద్దేశంతో జిల్లాలో కొత్తగా మరో 4 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో ఇప్పటికే 23 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రెండు బస్తీ దవాఖానాలు, నాలుగు పట్టణ ఆరోగ్య కేంద్రాలున్నాయి. ఇవే కాకుండా మరికొన్ని ప్రాంతాల్లో ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయాలన్న ప్రజాప్రతినిధులు, ప్రజల డిమాండ్‌కు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నారు.

**జిల్లాకు మూడు పీహెచ్‌సీలు మంజూరు..**

జిల్లాకు కొత్తగా 3 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మంజూరు చేశారు. చౌడాపూర్, దుద్యాల మండలం హకీంపేట, దౌల్తాబాద్ మండలం బాలంపేటలో ఏర్పాటు చేయనున్నారు. చౌడాపూర్‌లో స్థలం కోసం అన్వేషిస్తున్నారు. బాలంపేటలో 40 శాతం పనులు పూర్తి చేశారు. హకీంపేటలో ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. తాండూరు మండలం కరన్‌కోటలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. జిల్లా వైద్యాధికారులు ప్రతిపాదనలను



వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్‌కు పంపారు. త్వరలోనే ఇక్కడికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు కానుందని వైద్యాధికారులు తెలిపారు. ఇవే కాకుండా బొంబరాస్‌పేట మండలం రేగడిమైల్వార్, ధారూర్ మండలం తరిగోపుల, మోమిన్‌పేట మండలం మొరంగపల్లి ఉప కేంద్రాలను ఉన్నతీకరించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలుగా మార్చాలన్న ప్రతిపాదనలు ఉన్నాయి.

**సేవలు మెరుగు..: డా.లలితాదేవి, జిల్లా వైద్యాధికారిణి**

కొత్తగా ప్రారంభించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో ఆయా ప్రాంతాల ప్రజలకు మెరుగైన సేవలు అందనున్నాయి. దవాఖానాల ఏర్పాటుకు ముమ్మరంగా చర్యలు తీసుకుంటున్నారు. పనులు ప్రారంభించి త్వరలో పూర్తి చేయాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం.

## రేపుమాపంటారు.. చెల్లింపులు చేయరు

హైదరాబాద్: అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ(ఎల్ఆర్ఎస్)కు సంబంధించి హెచ్ఎండీఏ దరఖాస్తుదారులకు చుక్కలు చూపిస్తోంది. రేపు..మాపంటూ నెలలు గడుస్తున్నా ఎల్ఆర్ఎస్ ఫీజు వాపసు గురించి పట్టించుకోవడంలేదని వారు వాపోయారు. అధికారుల తీరుపై వారు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం కింద గతంలో హెచ్ఎండీఏ పరిధిలో చాలామంది దరఖాస్తు చేశారు.అందుకు ఫీజులు చెల్లించారు. కొందరు రూ.వేలల్లో.. మరికొందరు రూ.లక్షల్లో హెచ్ఎండీఏ ఖాతాలో జమ చేశారు. హెచ్ఎండీఏకు రూ.230 కోట్లకుపైగా ఆదాయం సమకూరింది. కొందరు తమ ప్లాట్లను క్రమబద్ధీకరణ చేసుకోగా...మరికొందరు నిబంధనల కారణంగా చేసుకోలేదు. జలవనరులు, వివాదాస్పద స్థలాల్లో లేఅవుట్లు ఉన్న వాటి క్రమబద్ధీకరణకు హెచ్ఎండీఏ తిరస్కరించింది. చెల్లించిన ఫీజులో 10 శాతం ప్రాసెసింగ్ ఛార్జీలుపోగా.. మిగతా డబ్బు తిరిగి ఇస్తామని హెచ్ఎండీఏ ప్రకటించింది. దరఖాస్తులు తిరస్కరించి నెలల గడుస్తున్నా డబ్బు మాత్రం వాపసు రాలేదని దరఖాస్తుదారులు వాపోయారు. అధికారులను నేరుగా కలిసినా.. ఫలితం ఉండటం లేదంటున్నారు. ఏడు జిల్లాల పరిధిలో వందలాది మంది ఫీజు రీఫండ్ కోసం ఎదురుచూస్తున్నారు.

**అసలు విషయం..**

ఎల్ఆర్ఎస్ కోసం హెచ్ఎండీఏకు 2.71 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటికే 74 వేలకుపైగా దరఖాస్తుదారులు ఫీజులు చెల్లించారు. క్షేత్రస్థాయి పరిశీలన లేకుండా ఫీజులు కట్టించుకొని.. తిరిగి చెల్లించడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. గతంలో ఈ విషయాన్ని వెలుగులోకి తెస్తే... త్వరలో వాపసు చేస్తామని హెచ్ఎండీఏ ప్రకటించింది. నెల రోజులు అవుతున్నా ఎలాంటి కదలిక లేదు.

ఎల్ఆర్ఎస్ కోసం వచ్చిన దరఖాస్తులు 2,71,352
ఫీజు కోసం నోటీసులు జారీ 2,07,501
ఫీజు చెల్లించిన వారు 74,928
చెల్లించని దరఖాస్తుదారులు: 1,32,973
ఆదాయం రూ.230.38 కోట్లు

## అద్దెకు కొన్ని.. మోక్షం కలగనివి ఇంకొన్ని!

వీణవంక: వీణవంక మండలంలో గ్రామపంచాయతీలకు పక్కా భవనాలు లేక ఉద్యోగులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో భవన నిర్మాణాలకు నిధులు మంజూరైనా పనులు ప్రారంభించడం లేదు. కొన్నిచోట్ల సగం నిర్మించి వదిలేశారు. నూతన గ్రామపంచాయతీలకైతే నిధుల దిక్కు కూడా లేదు. వీణవంక మండలంలో గతంలో 20 గ్రామ పంచాయతీలు ఉండగా.. 2016లో కొత్తగా లస్మక్కపల్లి, రామకృష్ణాపూర్, నర్సింహులపల్లి, బ్రాహ్మణపల్లి, మల్లన్నపల్లి, ఇప్పలపల్లి నూతన పంచాయతీలు ఏర్పడ్డాయి. 9 ఏళ్లవుతున్నా వీటి పంచాయతీ భవనాలకు నిధులు మంజూరు చేయలేదు. పాఠశాలలు, అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఆర్‌జీఎస్ఏ పథకంలో కనపర్తి, వల్భాపూర్ గ్రామాలకు రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరు కాగా పనులు సగం వరకు చేసి వదిలేశారు. చల్లూరు, కోర్కల్, కిష్టంపేట, ఎలబాక గ్రామాల్లో పంచాయతీ భవన నిర్మాణాలకు మూడేళ్ల క్రితం ఈజీఎస్‌లో నిధులు రాగా.. పనులు ప్రారంభించలేదు. 12 గ్రామాల్లో పంచాయతీ కార్యకాలపాలు చిన్న అద్దె, పాఠశాలల గదుల్లో అందిస్తున్నారు.

**ప్రతిపాదనలు పంపలేదు** వీణవంకలో కొత్తగా ఏర్పడ్డ పంచాయతీలకు నూతన భవనాల కోసం నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపలేదు. చల్లూరు, ఎలబాక, కిష్టంపేట, కోర్కల్ గ్రామాలకు నిధులు మంజూరైనా స్థలాలు లేక పనులు ప్రారంభించలేదు. కనపర్తి, వల్భాపూర్ గ్రామాలలో సగం పనులు కాగానే నిధులు రద్దయ్యాయి. నిర్మాణాలకు స్థలాలు గుర్తిస్తే నిధులు మంజూరుకు ప్రతిపాదనలు పంపిస్తాం.శ్రీకాంత్, డీఈఈ పంచాయతీరాజ్

## అసంపూర్ణం.. అమృత్ భాండాగారం



పరిగి : ప్రజలకు రక్షిత మంచినీటిని అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో కృషి చేస్తున్నాయి. దీనికిగాను వివిధ పథకాల కింద రూ.కోట్లు మంజూరు చేస్తున్నాయి. ఇంతవరకు బాగానే ఉన్నా.. క్షేత్రస్థాయిలో పనుల్లో వేగం మాత్రం కనిపించడం లేదు. దీనికితోడు సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సరిపడా నీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు.

**నిల్వ సామర్థ్యం లేక..**

మిషన్ భగీరథ నీరు నిల్వ చేసుకునే అవకాశం లేకపోవడంతో ఎద్దడితో అవస్థలు పడాల్సి వస్తోంది. రోజూ రెండు సార్లు ట్యాంకులు నింపుతున్నా అవి ఏ మూలకూ చాలడం లేదు. కొన్నిచోట్ల కొళాయిలకు మూతలు బిగించకపోవడంతో తాగునీరు మురుగు కాల్వల ద్వారా వృథాగా పారుతోంది. వార్డు అధికారులు పర్యవేక్షించి కట్టడి చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

**ఆదుకుంటున్న మోటార్లు..**

పురపాలిక పరిధిలో దాదాపు 70 మోటార్ల వరకు నిరంతరం పనిచేస్తున్నాయి. అవి ఏమాత్రం మొరాయించినా ఎద్దడి సమస్య అంతా ఇంతా కాదు. ఈ కారణంగా అవి మరమ్మతులకు గురైతే వెంటనే బాగు చేసి బిగించడంతో చాలా వరకు ఆదుకుంటున్నాయి. అమృత్-2 పథకం కింద చేపట్టిన పనులు త్వరగా పూర్తయితేనే సమస్యకు శాశ్వత పరిష్కారం దొరకనుంది. పనుల పూర్తికి కృషి చేస్తామని పుర కమిషనర్ వెంకటయ్య అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న సరఫరాను మరింత మెరుగు పడేలా చర్యలు తీసుకుంటామన్నారు.

**30 ఏళ్లకు సరిపడా ప్రణాళిక వేసుకున్నా..**

పట్టణ ప్రజలకు తాగునీరు అందించే క్రమంలో అధికారులు 30 ఏళ్లకు సరిపడా ప్రణాళిక తయారు చేశారు. ఈ క్రమంలోనే అమృత్ జల్-2.0 పథకం కింద కేంద్ర ప్రభుత్వం గతేడాది రూ.14.5 కోట్ల నిధులు కేటాయించింది. దీంతో టీచర్స్ కాలనీ, బస్టాండు ఏరియా, తిరుమల వెంచర్, శ్రీనివాస కాలనీల్లో నీటి ట్యాంకులను నిర్మించనున్నారు. వాటి ద్వారా సుమారు 6.5 లక్షల లీటర్ల నీటి పంపిణీకి అవకాశం కలుగుతుంది. ఆయా పనులు నేటికీ ఊపందుకోలేదు. పట్టణంలో మంచినీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది.

వార్డులు: 15
జనాభా: 30వేలు
కొళాయి కనెక్షన్లు: 5515
నివాస గృహాలు: 5,650
బోర్లు: 66

## తడి.. పొడి.. రోజుల తరబడి



హైదరాబాద్ : మహానగరానికి కేంద్ర బిందువైన కోఠి ప్రాంతం. వర్తక వాణిజ్య, విద్యా, వైద్య, ప్రభుత్వ కార్యాలయాలకు నిలయం.. అలాంటి చోట బ్యాంకు స్ట్రీట్ వెంట ముక్కు మూయకుండా నడవలేని పరిస్థితి. ఫుట్‌పాత్ కాదు కదా.. రోడ్డు సగం వరకు చెత్తకుప్పలే దర్శనమిస్తాయి. రోజుల తరబడి తరలించకపోవడంతో కుళ్లిపోయి దుర్గంధం వెదజల్లుతుంటుంది. ఇక్కడ ఒక్క డంపర్ బిన్ కనిపించదు. సైబరాబాద్, ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్‌లో కొన్ని ప్రాంతాలు మినహా ఏ వీధిచివర చూసినా చెత్త కుప్పలే. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఏడు నక్షత్రాలు సాధించిన మహానగరం పరిస్థితిదీ. 150 డివిజన్లలోనూ చెత్తతో ప్రజలు బేజారెత్తుతున్నారు. సిటీబస్టాండుల్లో సైతం బస్సుల కోసం నిరీక్షించలేని పరిస్థితి నెలకొంది.

**బల్దియా పర్యవేక్షణ లేమి..:** నగరంలో చెత్త నిర్వహణపై జీహెచ్ఎంసీ పర్యవేక్షణ లోపించింది. సర్వే సమయాల్లో హడావుడి చేయడం.. తర్వాత మరుగున పడేయడం సాధారణంగా మారింది. జనంలోనూ పౌరస్పృహ లోపించింది. 2012లో తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలని నిర్ణయించారు. ఇంటింటికి రెండు బుట్టలు పంపిణీ చేశారు. చెత్త సేకరణ బండికి అందించాలి. సేకరించిన చెత్తను వేర్వేరుగా కేంద్రాలకు తరలించాల్సి ఉంటుంది. కానీ తడి పొడి కలగాపులగం అయింది. ఇంటింటికి చెత్త సేకరించే విధానానికి స్వస్తి పలికారు. వీధి చివరన ఉండే డంపర్ బిన్‌లలో చెత్త వేస్తున్నారు.

**రవాణా వారిదే..**

చెత్త నిర్వహణ జీహెచ్ఎంసీతో పాటు రాంకీ సంస్థకు అప్పగించారు. రవాణా మొత్తం రాంకీదే బాధ్యత. డంపర్‌బిన్లు నిండిన వెంటనే అక్కడి నుంచి తరలించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ పగలు రాత్రి జరగాలి. కానీ సక్రమంగా జరగడంలేదు. వీధుల్లో చెత్త ఎక్కడకక్కడ నిలిచిపోతోంది. పర్యవేక్షణ లోపించింది.

**ఎన్నో లోపాలు..**

నగరంలో రోజుకు 8వేల టన్నుల చెత్త వెలువడుతున్నట్లు అంచనా. కొన్ని ప్రాంతాల్లో రెండు, మూడు రోజులకోసారి తరలిస్తున్నారు. చెత్తను రోడ్లపై వేయొద్దు. అలా వేస్తే జరిమానా విధించాలి.కానీ ఇది అమలు కావడం లేదు.

హోటళ్లలో పోగైన వ్యర్థాలను రోడ్లపైనే వేస్తున్నారు. వీరిపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

రోడ్లమీద కాకుండా నాలాలన్నీ చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు, సంచులతోనే నిండిపోతున్నాయి.

చెత్త నిర్వహణపై పౌరుల్లోనూ అవగాహన కల్పించి చైతన్యం తేవాలని పలువురు కోరుతున్నారు.

జీహెచ్ఎంసీ విస్తీర్ణం 650 చ.కి.మీ
జనాభా: 1.20 కోట్లు (అంచనా)
రోజుకు వెలువడే చెత్త 8,000 టన్నులు
ఇంటింటికి తిరిగి సేకరించే ఆటోలు 5,450
పారిశుద్ధ్య కార్మికులు 18,500

## గుడ్డి నమ్మకమే 'సృష్టి' పెట్టుబడి

హైదరాబాద్ : మీకు పిల్లల్లేరా! సంతానలేమితో ఇబ్బంది పడుతున్నారా! పండంటిబిడ్డను అందిస్తామంటూ సామాజిక మాధ్యమాల్లో ఆర్భాటపు ప్రకటనలతో ఆకట్టుకుంటారు. తెలుగు రాష్ట్రాల్లోని జిల్లా కేంద్రాల్లో ఉచిత కన్సల్టెన్సీలు ఏర్పాటు చేస్తారు. అక్కడకు వచ్చిన దంపతుల బలహీనతను ఆసరా చేసుకొని సొమ్ము చేసుకుంటారు. సరోగసీ ముసుగులో యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ నిర్వాహకురాలు డాక్టర్ నమ్రత సాగించిన పాపాల చిట్టా. పోలీసుల దర్యాప్తుతోఒక్కొక్కటిగా వెలుగు చూస్తోంది. ఆసుపత్రిలో చికిత్స కోసం వెళ్లి డబ్బులు పోగొట్టుకొని అనారోగ్యం పాలైన ఎంతోమంది బాధితులు ఫిర్యాదుకు ముందుకు వస్తున్నారు. నగర శివారుకు చెందిన ఒక బాధితురాలు నాలుగేళ్ల క్రితం సికింద్రాబాద్‌లోని సృష్టి ఫెర్టిలిటీ కేంద్రానికి వెళ్లారు.

వైద్యపరీక్షలు చేసి ఆమె నుంచి అండాలు తీసుకున్నారు. తరువాత పిల్లలు పుట్టరంటూ ఆమెను మనోవేదనకు గురిచేశారు. అండాలు ఏంచేశారని ప్రశ్నిస్తే బెదిరించారని బాధితురాలు కన్నీరు పెట్టుకున్నారు. విదేశాల నుంచి వచ్చిన దంపతులనుంచి రూ.15లక్షలు వసూలుచేసి సరోగసీ బిడ్డను చేతికిచ్చారు. డీఎన్ఏ పరీక్షతో తమ బిడ్డ కాదని నిలదీస్తే మరో పిల్లాడ్ని తీసుకోమంటూ చెప్పడం వారిని నివ్వెరపాటుకు గురిచేసింది. చాలా మందికి సరోగసీతో బిడ్డను చేతికిస్తామని ఆశచూపి రూ.10-40లక్షలు వసూలు చేస్తారు. మొదట్లో డాక్టర్ నమ్రత, ఆసుపత్రి సిబ్బంది వ్యవహరించిన తీరుతో వారిని గుడ్డిగా నమ్ముతారు. నెలలు గడిచే కొద్దీ చికిత్సతో ప్రయోజనం లేదని గ్రహించిన కొందరు నిలదీసినపుడు అసలు స్వరూపం బయటపడుతుందని ఒక బాధితురాలు వాపోయారు.



**శిశువిక్రయాలపై పోలీసుల గురి**

సరోగసీ ముసుగులో శిశువిక్రయాలపై పోలీసులు దృష్టిసారించారు. స్వాధీనం చేసుకున్న రికార్డులను పరిశీలిస్తున్నారు. ఏపీ, తెలంగాణల్లో సుమారు 30మంది చిన్నారులు చేతులుమారినట్టు భావిస్తున్నారు. గాంధీ ఆసుపత్రిలో పనిచేస్తున్న అనస్తీషియా నిపుణుడు కూడా ముఠాతో చేతులు కలపడం సంచలనంగా మారింది. ప్రభుత్వ వైద్యులు, వైద్యాధికారులతో సృష్టి నిర్వాహకులకు సంబంధాలపై పోలీసులు గురిపెట్టారు. ఈ కేసులో 8మంది నిందితుల కస్టడీ కోరుతూ కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు.

## 'శుద్ధి' అబద్ధం

హైదరాబాద్ : పరిశుభ్రమైన నీరు ఆరోగ్యానికి కీలకం. నగరంలో చాలా మంది శుద్ధి జలాల పేరుతో ఆర్వో ప్లాంట్లను నుంచి కొనుగోలు చేసి తాగుతున్నారు. నిబంధనలు పాటించకుండా పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న శుద్ధి జల కేంద్రాల నుంచి సరఫరా అవుతున్న నీరు ఎంత సురక్షితం అనేది చర్చనీయాంశగా మారింది. పర్యవేక్షణ లేకుండా ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేసి నీటిని డబ్బాల్లో నింపేసి అమ్మేస్తున్నారు. ఆ జలాలను లక్షలమంది వినియోగిస్తున్నారు. చాలా కేంద్రాల్లో నిబంధనలు పాటించడం లేదు. బోరు నీటిని ఆర్వో ప్లాంట్లలో నుంచి క్యాన్లలో నింపేసి అమ్మేస్తున్నారు. నగరంలో ఇలాంటివి వేలల్లో ఉన్నాయి. మురుగు కాలువల పక్కనే బోర్లు వేసి సొమ్ము చేసుకుంటున్నారు. 20 లీటర్ల డబ్బా రూ.10 నుంచి రూ.20 దాకా విక్రయిస్తున్నారు. .

**శుభ్రత, నాణ్యత, ప్రమాణాలేవీ?**

ప్రతి డబ్బా(క్యాన్)పై లేబుల్ విధిగా ఉండాలి. నీటిశుద్ధి ప్రమాణాలు,



సంస్థ వివరాలు కచ్చితంగా కనిపించాలి. ఇవి ఏ క్యాన్‌పైనా ఉండవు. ప్లాస్టిక్ క్యాన్లను కూడా ప్రమాణాల మేరకు ఉన్నవాటినే వినియోగించాలి. సరఫరా చేసే వాటిలో తాజా నీరే ఉండాలి. ఎక్కువ రోజులు నిల్వ ఉంచకూడదు.దాన్ని ప్రత్యేక యంత్రాల సాయంతో అల్ట్రావైలెట్ కిరణాలతో పరీక్షించి బ్యాక్టీరియా లేకుండా శుద్ధి చేసిన తర్వాతే నీటితో నింపాలి. విధిగా సీలు ఉండాలి. సహజంగా నీటిలో శరీరానికి, ఆరోగ్యానికి ఉపయోగపడే ఖనిజాలు ఉంటాయి. ఆర్వో ప్లాంట్లలో శుద్ధి ప్రక్రియలో పూర్తిగా ఖనిజాలు తొలగిపోతాయి.

**ఈ నిబంధనలుండాల్సిందే**

బోరు నీరు కోసం భూగర్భ జలవనరుల శాఖ అనుమతి, చిన్నతరహా పరిశ్రమ కోసం పరిశ్రమలశాఖ నుంచి అనుమతి తీసుకోవాలి.
నీటి నాణ్యతను పరీక్షించేందుకు ఏర్పాట్లు ఉండాలి.
ప్రతి ప్లాంట్‌లో మైక్రోబయాలజిస్ట్, కెమిస్ట్ ఉండాలి.
పనిచేసే సిబ్బంది కూడా ఆరోగ్యవంతులై ఉండాలి.నిర్దేశించిన పరిమాణంలో ఖనిజాలను కలిపేందుకు ప్రత్యేక ఏర్పాటు ఉండాలి.

## ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణకు ఈపీఆర్

హైదరాబాద్ : ప్లాస్టిక్ వ్యర్థాల ఏరివేత, భూమిలో కరిగే ప్లాస్టిక్ వినియోగాన్ని పెంచేందుకు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి(సీపీసీబీ) ఎక్స్‌టెండెడ్ ప్రొడ్యూసర్స్ రెస్పాన్సిబులిటీ(ఈపీఆర్) లో నమోదు తప్పనిసరి చేసింది. నగరంలోని అనేక సంస్థలు మార్గదర్శకాలకు అనుగుణంగా వెబ్‌సైట్‌లో ఇప్పటికే రిజిస్టర్ చేసుకున్నాయి. జీడిమెట్ల, రంగారెడ్డి జిల్లాల్లోని అనేక సంస్థలకు రీసైక్లింగ్ లక్ష్యాలను నిర్దేశించినట్టు పీసీబీ అధికారులు వెల్లడించారు.

**ఈపీఆర్ అంటే..?**

ఇది ఒక పర్యావరణ విధానం, దీని ప్రకారం తయారీదారులు, దిగుమతి దారులు, బ్రాండ్ యజమానులు తమ ఉత్పత్తుల వ్యర్థ నిర్వహణకు పూర్తి బాధ్యత వహించాలి. పునర్వినియోగం, రీసైక్లింగ్, సురక్షితంగా పారేయడాన్ని పర్యవేక్షించాలి. ఇవి సాధారణంగా ప్లాస్టిక్, ఎలక్ట్రానిక్, బ్యాటరీ ఉత్పత్తులకు వర్తిస్తుంది. ఉదాహరణకు ఒక కంపెనీ తయారు



చేసిన ప్లాస్టిక్ బాటిల్‌ను రీసైక్లింగ్ చేయడం లేదా సరిగా పారేయడంపై పూర్తి బాధ్యత వారిపైనే ఉంటుంది.

**ప్లాస్టిక్ వేస్ట్ ప్రాసెసర్స్..:** జీడిమెట్ల, కాచిగూడ, మెహిదీపట్నం, మల్లాపూర్, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి రంగారెడ్డి జిల్లా కొత్తూరు, అబ్దుల్లాపూర్‌మెట్, ఇప్పలపల్లె, షాద్‌నగర్, బూర్గుల, కీసర, చౌపల్లె, చేగూరులో ప్లాస్టిక్ వేస్ట్ ప్రాసెసర్ యూనిట్లు ఉన్నాయి.

భూమిలో కరిగే ప్లాస్టిక్ (కంపోస్టబుల్) ఉత్పత్తుల యూనిట్లు..: చర్లపల్లి, జీడిమెట్ల, తుక్కుగూడ, బాచుపల్లి, కూకట్‌పల్లి, బషీరాబాద్, నాచారం, మహేంద్రహిల్స్, అమీన్‌పూర్, హయత్‌నగర్, బాలాపూర్.

**పౌరుల భాగస్వామ్యం అవసరం..**

ఈపీఆర్ లక్ష్యాలు చేరుకోవడంలో పౌరుల భాగస్వామ్యం అవసరమని పర్యావరణ నిపుణులు సూచిస్తున్నారు. తమ ఇళ్లలో లేదా కార్యాలయాల్లో పునర్వినియోగించే వ్యర్థాలను గుర్తించి వేరు చేసి రీసైక్లింగ్ యూనిట్లకు తరలించాలి. ఇందుకోసం స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవచ్చు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ (ఎస్‌యూపీ)కు బదులుగా బయోడీగ్రేడబుల్ లేదా పునర్వినియోగ సామగ్రిని ఎంచుకోవాలి.

## మూసీ నదిలో ఆక్రమణలు నేలమట్టం

హైదరాబాద్: చాదర్‌ఘాట్ నుంచి ఉస్మానియా జనరల్ ఆసుపత్రి వరకు మూసీలో అక్రమ నిర్మాణాలను హైడ్రా నేలమట్టం చేసింది. నదిని ఆక్రమిస్తున్నారంటూ వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేపట్టి, నిజమని తేల్చుకున్నాక చర్యలు తీసుకున్నామని కమిషనర్ రంగనాథ్ తెలిపారు. కొన్నేళ్లుగా ఆక్రమణదారులు నదిలో మట్టి పోసి పార్కింగ్ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. హైడ్రా బృందాలు ఉదయం 6గంటలకు కూల్చివేతలు ప్రారంభించాయి. మొత్తం 9.62 ఎకరాల నదీ పరీవాహక ప్రాంతాన్ని ఆక్రమణల నుంచి రక్షించినట్టు హైడ్రా వెల్లడించింది.

కోర్టు ధిక్కరణ కేసులున్నా.. 'మూసీ ఆక్రమణలతో ముగ్గురు వ్యక్తులకు సంబంధం ఉంది. తికారం సింగ్ ఆధీనంలో 3.10 ఎకరాలు, పూనమ్ చాంద్ యాదవ్ 1.3 ఎకరాలు, జయకృష్ణ చేతిలో 5.22 ఎకరాల భూమి ఉంది. వారిపై కోర్టు ధిక్కరణ కేసులూ ఉన్నాయి. కబ్జాలపై హైకోర్టు గతంలోనే ఆగ్రహం వ్యక్తంచేసింది. ఆక్రమణలను తొలగించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించింది. కోర్టు ఉత్తర్వుల మేరకు అప్పటి హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ఆక్రమణదారులపై కేసులు పెట్టారు. పోలీసులు వెళ్లినా కబ్జాదారులు వెనక్కి తగ్గలేదు.

చరకలు



# ప్లాస్టిక్‌పై స్టీల్ పంజా

మంథని : కూరగాయలు, కిరాణం, పాలు, పండ్లు, భోజనాలు, వివాహాలు, ఉత్సవాలు, సభలు జరిగినా ప్లాస్టిక్ వస్తువులు వినియోగిస్తున్నారు. ప్లాస్టిక్ విచ్చలవిడి వినియోగంతో మానవాళికి ముప్పు వాటిల్లనుంది. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలనే ఉద్దేశంతో అధికారులు చర్యలు చేపడుతున్నారు. గ్రామాల్లో స్టీల్ బ్యాంకులను ఏర్పాటు చేస్తున్నారు. మంథని నియోజకవర్గంలోని 76 గ్రామపంచాయతీలలో స్టీల్ బ్యాంకుల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. కమాన్‌పూర్ మండలంలో 9, మంథని మండలంలో 35 పంచాయతీలకు 34, ముత్తారం మండలంలో 15 గ్రామపంచాయతీలకు 14, రామగిరి మండలంలో 17 పంచాయతీలలో స్టీలు బ్యాంక్‌లను ఏర్పాటు చేశారు. నూతనంగా గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసిన మంథని మండలంలోని తోటగోపయ్యపల్లి, ముత్తారం మండలంలోని జిల్లెలపల్లిలో స్టీలు బ్యాంక్‌లు ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రభుత్వ కార్యాలయాల్లో స్టీలు



బ్యాంక్‌లు ఏర్పాటుతో ప్రజల్లో ప్లాస్టిక్ నివారణపై మరింత అవగాహన కల్పిస్తున్నారు. జిల్లా పాలనాధికారి కోయ శ్రీహర్ష, అదనపు పాలనాధికారి వేణు, డీపీవో వీర బుచ్చయ్య, డీఎల్‌పీవో కొమ్మెర సతీష్ అదేశాలతో గ్రామ పంచాయతీ అధికారులు గ్రామాల్లో ప్లాస్టిక్ నిషేధానికి కృషిచేస్తున్నారు. గ్రామ సభలు, పంచాయతీ సమావేశాలలో స్టీలు వస్తువులను వాడుతున్నారు.

**నిరంతర పర్యవేక్షణ**

మంథని నియోజకవర్గ వ్యాప్తంగా 76 గ్రామ పంచాయతీలలో నిరంతరం పర్యవేక్షణ చేస్తూ అధికారులకు సూచనలిస్తున్నాం. ప్లాస్టిక్ రహిత గ్రామ పంచాయతీలను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. గ్రామ పంచాయతీ కార్యాలయాల నుంచే స్టీలు బ్యాంక్ కార్యక్రమం ప్రారంభించాం. ప్రజలను ప్లాస్టిక్ భూతంపై చైతన్య పరిచేందుకు గ్రామాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాం.

కొమ్మెర సతీశ్, డీఎల్‌పీవో

# ఆ బడుల్లో అఆఇఈ

భువనగిరి : ఉమ్మడి జిల్లాలో గతేడాది విద్యార్థులు లేరనే కారణంతో 461 పాఠశాలలను మూసివేశారు. ఈ విద్యాసంవత్సరంలో బడిబాట కార్యక్రమం చేపట్టి సర్కారు బడుల్లో సౌకర్యాలపై విస్తృత ప్రచారం నిర్వహించారు. దీంతో నూతన ప్రవేశాలు గణనీయంగా పెరిగాయి. మూతబడిన 24 పాఠశాలలను తెరిపించారు. వాటినీ కాపాడుకోవాల్సిన అవసరముంది.

యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా 735 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా గతేడాది విద్యార్థులు లేక 60 పాఠశాలలు మూతపడ్డాయి. గత విద్యాసంవత్సరం జిల్లా వ్యాప్తంగా పదో తరగతి ఉత్తమ ఫలితాలు, అమ్మ ఆదర్శ కమిటీల పేరిట పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణతో పాటు ముందస్తుగా బడిబాట కార్యక్రమం చేపట్టడంతో ప్రస్తుత విద్యాసంవత్సరంలో విద్యార్థుల ప్రవేశాల సంఖ్య పెరిగింది.

పాఠశాలల పునఃప్రారంభంతో జిల్లా వ్యాప్తంగా మూతపడిన ఏడు పాఠశాలలు తిరిగి ప్రారంభించారు. తదుపరి విద్యార్థులు పాఠశాలల్లో చేరేందుకు విముఖత చూపడంతో నాలుగు బడులను తిరిగి మూసివేయాల్సి వచ్చింది. ప్రస్తుతం బొమ్మలరామారం మండలం యావాపురం, బీబీనగర్ మండలం పెద్ద పలుగుతండా, గుండాల మండలంలోని నూనెగూడెంలలో తిరిగి ప్రారంభించిన పాఠశాలల్లో 27 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తుండటం గమనార్హం.

**నమ్మకాన్ని పెంపొందిస్తాం**

సత్యనారాయణ, యాదాద్రి జిల్లా విద్యాశాఖాధికారి

ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో నమ్మకాన్ని పెంపొందిస్తాం. విద్యార్థులకు సదుపాయాల కల్పనతోపాటు నాణ్యమైన విద్యను అందిస్తాం. ఖాన్ అకాడమీ ద్వారా ఎనిమిది నుంచి తొమ్మిది తరగతుల విద్యార్థులకు ఆన్‌లైన్‌లో సైన్స్, గణితం పాఠ్యాంశాలను బోధిస్తాం. అవసరం ఉన్న పాఠశాలల్లో ఉన్నతాధికారుల అనుమతితో ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తాం. జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్‌లను ఏర్పాటు చేసి విద్యను అందిస్తాం.

# రైతుకు కులాసా!

ఖమ్మం : అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాల్లో చాలావరకు వానాకాలం పెట్టుబడి సాయం నిధులు జమయ్యాయి. ఎన్ని ఎకరాలు ఉన్నప్పటికీ అందరికీ రైతు భరోసా పథకాన్ని ప్రభుత్వం వర్తింపజేసింది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని లబ్ధిదారులకు ఎనిమిది రోజుల వ్యవధిలోనే సాయమందించింది. వానాకాలం పంటల సాగు సమయంలో పెట్టుబడి సాయమందటం వల్ల ఆర్థికంగా వెసులుబాటు కలిగిందని అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**ఈ కొద్దిమందికీ దక్కాలి సాయం**

డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ఫెయిలైన వారి బ్యాంకు ఖాతాలకు నిధులు జమకాలేదు. కొంతమంది బ్యాంకు ఖాతాలు సరిగ్గా ఉండకపోవటం, మరికొందరి ఖాతాలు మనుగడలో లేకపోవటం, ఇంకొంతమంది స్థానికంగా ఉండకపోవటం, మిగిలిన వారి చిరునామాల్లో తప్పులు దొర్లటం వంటి కారణాల వల్ల పెట్టుబడి సాయం అందలేదు. మొత్తమ్మీద ఖమ్మం జిల్లాలో 15,891 (4.50 శాతం)



మంది, భద్రాద్రి జిల్లాలో 10,302 (5.48 శాతం) మందికి 'రైతు భరోసా' దక్కాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. వీరిలో డీబీటీ ఫెయిలైన రైతులు ఖమ్మం జిల్లాలో 814 (0.23 శాతం) మంది, భద్రాద్రి జిల్లాలో 604 (0.32 శాతం) మంది ఉన్నారని వెల్లడించారు. 'రైతు భరోసా' అందని వారి వివరాలను సరిచేసి పంపించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇదే పనిలో వ్యవసాయశాఖ అధికారులు నిమగ్నమయ్యారు. 'సాంకేతిక సమస్యలను పరిష్కరించిన తర్వాత అర్హులైన మిగతా రైతుల బ్యాంకు ఖాతాల్లోనూ పెట్టుబడి సాయం నిధులు జమవుతాయి' అని ఖమ్మం డీఏఓ పుల్లయ్యకు తెలిపారు.

# గిరి భూముల్లో జల సవ్వడి!



వికారాబాద్ : గిరిపుత్రులు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం ఎన్నో రకాల పథకాలను రూపొందించి అమలు పరుస్తోంది. ఆర్‌వోఎఫ్‌ఆర్ చట్టం కింద పట్టాలుండి పోడు భూముల్లో పంటలు పండిస్తున్న గిరిజన రైతుల అభివృద్ధే లక్ష్యంగా తీసుకొచ్చిన 'ఇందిరా సౌర గిరి జల వికాసం' పథకానికి ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. వారి భూముల్లో సోలార్ పంపుసెట్ల ఏర్పాటుకు నిర్ణయించింది. దీని ద్వారా ఆదాయం పెంచాలని భావిస్తోంది. ఈ పథకాన్ని గిరిజన సంక్షేమ శాఖ అమలు చేయనుంది.

**విడతల వారీగా..** జల వికాస పథకం అయిదేళ్లపాటు కొనసాగుతుంది. 2024–25లో 50 మంది రైతులకు చెందిన 138 ఎకరాల్లో సాగునీటి సౌకర్యం కల్పించనున్నారు. 2026–27 నుంచి 2029–30 వరకు నాలుగేళ్లపాటు 251 రైతులకు చెందిన 351 ఎకరాల్లో నీటి సదుపాయం కల్పించనున్నారు.

**హెక్టారు భూమికి ఒక యూనిట్..**

ఈ పథకానికి ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలున్న రైతులంతా అర్హులే. ఒక హెక్టారు భూమి ఉన్న రైతులకు ఒక యూనిట్ మంజూరు చేస్తారు. అంతకన్నా తక్కువ భూమి ఉంటే మరికొందరు రైతులతో కలిపి మంజూరు చేస్తారు. అటవీ ప్రాంతాల్లో విద్యుత్తు లైన్లు, అది కష్టమైన ప్రాంతాల్లో సోలార్‌ను ఏర్పాటు చేయనున్నారు.

**బోర్లు, బావుల తవ్వకాలు..**

ఈ పథకం ద్వారా జిల్లాలోని 1,054 గిరిజన కుటుంబాలు లబ్ధి పొందనున్నాయి. ఇందుకుగాను త్వరలో అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నారు. 200 ఫీట్ల లోతులో బోరుబావులను తీయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ లోతులో అన్ని జిల్లాల్లో నీటి లభ్యత లేదని అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచించే అవకాశముంది. బోర్లు సాధ్యం కాని ప్రాంతాల్లో బావులు తవ్వాలని నిర్ణయించింది.

**దరఖాస్తుల స్వీకరణ...**– పి.కమలాకర్‌రెడ్డి, జిల్లా గిరిజన సంక్షేమాధికారి, వికారాబాద్ అర్హులైన గిరిజనుల నుంచి ఈ పథకానికి దరఖాస్తులు త్వరలో స్వీకరి స్తాం. ఈ పథకం అమల్లో ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నడుచుకుం టాం. వికారాబాద్, మెదక్, సంగారెడ్డి జిల్లాలను కలిపి ఒక యూనిట్‌గా చేశారు.

# యూరియా మరింత కావాలయా!



కరీంనగర్ : జిల్లాలో ప్రస్తుతానికి యూరియా ఇబ్బందులు లేకున్నా.. వరినాట్లు పడ్డాక వినియోగం పెరిగి కొరత ఏర్పడే అవకాశముంది. జిల్లాలో గతేడాది వానాకాలంలో దాని వినియోగాన్ని దృష్టిలో ఉంచుకొని వ్యవసాయాధికారులు ఈ వానాకాలానికి 43,254 మెట్రిక్ టన్నులు అవసరమని అంచనా వేసి ప్రతిపాదనలు పంపించారు. అయితే ఇప్పటి వరకు 24,493 మెట్రిక్ టన్నులు మాత్రమే జిల్లాకు వచ్చింది. అధికారుల అంచనా ప్రకారం భవిష్యత్తు అవసరాలకు ఈ మొత్తం ఎంత మాత్రం సరిపోదని భావన వ్యక్తమవుతోంది.

**ప్రత్యేక నిఘా..** జిల్లా వ్యవసాయ శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, యూరియా కొనుగోళ్లపై నియంత్రణ పెడుతోంది. వర్షాలు సమృద్ధిగా కురిసి వరి నాట్లు పెద్ద ఎత్తున పడితే మాత్రం ఆగస్టులో యూరియా తిప్పలు తప్పేలా లేవు. గతేడాది కూడా కొన్ని ప్రాంతాల్లో ఈ సమస్య వచ్చింది. ప్రత్యామ్నాయంగా నానో యూరియా వినియోగించుకోవచ్చని వ్యవసా య శాస్త్రవేత్తలు సూచిస్తున్నా.. రైతులు ఆసక్తి చూపడంలేదు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మంత్రి తుమ్మల మరింత యూరియా తెప్పిస్తే ఇలాంటి ఇబ్బంది ఉండదంటున్నారు.

**సరిపోవడం కష్టమే..**

గతేడాది వానాకాలం సాగులో యూరియా వినియోగాన్ని బట్టి వ్యవసాయ శాఖ ఈ సంవత్సరం వానాకాలంలో ఏ నెలలో ఎంత వినియోగంపై అంచనా రూపొందించారు. జూన్–5,190, జులై–12,976, ఆగస్టు–15,139, సెప్టెంబరు–8,651 మెట్రిక్ టన్నులు అవసరమని ప్రణాళికలు తయారు చేశారు.

ప్రస్తుతం 24,493 మె.ట.గాను ఇప్పటి వరకు 5,682 మె.ట విక్రయించారు. ఇంకా 18,128 మె.ట. నిల్వ ఉన్నా.. అందులో ఆరు వేల టన్నులు రాష్ట్ర వ్యవసాయ కమిషన్ ఆదేశాలుంటే తప్పా వినియోగించుకులేని పరిస్థితి. అంటే ఇంకా 12 వేల మె.ట. మాత్రమే జిల్లాకు వినియోగించుకునే అవకాశముంది.

జులైలో ఉన్న నిల్వలు సరిపోయినా.. ఆగస్టులో వినియోగం పెరుగుతుంది. నాట్లు వేశాక రెండు సార్లు ఎదుగుదలకు చల్లుతారు. మొక్కజొన్న, పత్తి పంటలకూ అవసరముంటుంది.

**అవసరం లేని రైతులు నిల్వ చేయొద్దు**

జిల్లా అవసరాలకు మరింత యూరియా రావాల్సిన అవసరముంది. అవసరం లేని రైతులు ఎట్టి పరిస్థితుల్లో నిల్వ చేయొద్దు. ఇతర ఎరువులకు ఎలాంటి ఇబ్బంది లేదు.

భాగ్యలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారిణి

# నేలపై నిద్ర.. అర్ధరాత్రి స్నానాలు



గంగాధర: జమ్మికుంటకు చెందిన ఓ విద్యార్థిని ఇటీవల గంగాధరలోని ఓ గురుకుల పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరింది. కానీ ఇక్కడ నీటి వసతి లేక రాత్రి 3.30 గంటలకు స్నానాలు చేయడం.. మరుగుదొడ్లు, మూత్రశాలలు శుభ్రంగా లేక.. మంచాలు లేక నేలపైనే నిద్రించడం ఇబ్బందిగా ఉందని చెప్పి మూడు రోజులకే వెళ్లిపోయింది. ఈ ఉదంతం ఉమ్మడి జిల్లాలోని గురుకుల పాఠశాలల్లోని సమస్యలను వేలెత్తి చూపుతోంది. ఎక్కువ గురుకులాల్లో సమస్యలే ఉంటున్నాయి.

**అద్దె భవనాలు.. అరకొర వసతులు**

గంగాధర ప్రధాన కూడలిలోని మహాత్మా జ్యోతిబా పులే బీసీ బాలికల గురుకుల పాఠశాల అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. నెలకు రూ.లక్షల్లో అద్దె చెల్లిస్తుండగా కనీస వసతులు లేక విద్యార్థులు తల్లడిల్లుతున్నారు. 5వ తరగతి నుంచి పదో తరగతి వరకు 500 మంది బాలికలు చదువుకుంటున్నారు. ఇది చాలదన్నట్లుగా ఇంటర్‌లో గంగాధరతోపాటు మెట్‌పల్లి జూనియర్ కళాశాలను ఇక్కడే కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం వంద మంది విద్యార్థులు ఉన్నారు. పడక మంచాలు లేక బాలికలు నేలపైనే నిద్రిస్తున్నారు.

మండల కేంద్రంలోని బీసీ బాలుర గురుకులానికి సొంత భవనం లేకపోవడంతో నెలకు రూ.2 లక్షలకు పైగా అద్దె చెల్లిస్తూ ప్రైవేటు భవనంలో పాఠశాల నిర్వహిస్తున్నారు. 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 400 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. మంచాలు వేస్తే ఫ్యాన్లకు తగులుతుందనే కారణంతో రాత్రిపూట వాటిని వేయకపోవడంతో నేలపైనే నిద్రిస్తున్నారు.

ఎల్ఎండీలోని బాలికల గురుకుల పాఠశాలకు మాత్రమే సొంత భవనం ఉండగా మిగతా అన్ని పాఠశాలలు అద్దె భవనాల్లోనే అరకొర వసతుల మధ్య నిర్వహిస్తున్నారు.

**అంతటా అదే పరిస్థితి..**

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 13 బీసీ బాలురు, 13 బాలికల గురుకులాలు నిర్వహిస్తున్నారు. రెండేళ్ల కిందట అదనంగా మరో 33 గురుకులాను ఏర్పాటు చేసింది. 5వ తరగతి నుంచి పదో తరగతి వరకు ఒక తరగతికి 40 మంది విద్యార్థులు ఉండగా రెండు సెక్షన్లు కొనసాగుతున్నాయి. ఇలా ఆరు తరగతులకు 12 గదులు అవసరం. ల్యాబ్‌ల నిర్వహణ, స్టాఫ్ రూం, కార్యాలయ గది, వంటశాల, డైనింగు హాల్ వీటన్నింటికీ 6 గదులు అవసరం. స్నానాల గదులు, మరుగుదొడ్లు, ఇతర వసతుల్లేక విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. 2019లో ఏర్పాటు చేసిన పాఠశాలలకు ఫర్నీచర్ ఇవ్వకపోవడంతో నేల చదువులు, రాత్రి నిద్రకు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

# జల కల.. సాకారం దిశగా

ఖమ్మం : మధిర, ఎర్రుపాలెం మండలాల రైతులకు మంచిరోజులు రానున్నాయి. ఎన్నెస్పీ కింద చివరి ఆయకట్టు (మూడో స్టేజీ)లోని ఈ మండలాలకు ఏపీ మీదుగా కాల్వల్లో ప్రవహించే సాగర్ నీరు రావాల్సి ఉంది. జిల్లా నుంచి సాగర్ జలాలు ఏపీలోకి వెళ్లాక.. అక్కడ సకాలంలో గేట్లు ఎత్తకపోవటం, ఆ రాష్ట్ర రైతుల అవసరాలు తీరాక నీటిని విడుదల చేస్తుండటంతో మధిర, ఎర్రుపాలెం మండలాల్లో సుమారు 50వేల ఎకరాల్లో పంటలు సరిగ్గా పండక అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య పరిష్కారంపై దృష్టిసారించిన తెలంగాణ ప్రభుత్వం జవహర్ ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టింది. తద్వారా 33,025 ఎకరాలకు సాగునీరందించనుంది. 'జవహర్ ఎత్తిపోతలకు నిధులు మంజూరయ్యాయి. గుత్తేదారుతో ఒప్పందం కుదుర్చుకున్నాం. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం' అని జలవనరుల శాఖ ఎస్ఈ వాసంతి తెలిపారు.

**ఎత్తిపోతల ఎక్కడంటే..**

సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగంగా ఏన్కూరు మండలంలోని రాజీవ్ ఫీడర్ కాల్వను వైరా నదితో అధికారులు అనుసంధానిస్తున్నారు. ఇక్కడి నుంచి దిగువకు 33 కిలోమీటర్ల దూరం పారే గోదావరి జలాలు మధిర మండలం వంగవీడులో నిల్వ ఉండటానికి రూ.630.30 కోట్లతో చెక్‌డ్యాం, దీని ఆధారంగా జవహర్ ఎత్తిపోతల పథకం నిర్మించనున్నారు. పంపుహౌజ్‌కు నిరంతర విద్యుత్తు సరఫరా కోసం



రూ.25కోట్లతో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తారు. పంప్‌హౌజ్(ఎత్తిపోతల)లో మూడు మోటార్లు ఉంటాయి. వీటి ద్వారా నిదానపురం, జమలాపురం, మైలవరం మేజర్లకు నీటిని ఎత్తిపోసి వాటి పరిధిలోని ఆయకట్టును సస్యశ్యామలం చేయనున్నారు.

ఎత్తిపోతల పథకం ద్వారా చిన్న, పెద్దచెరువులను నింపుతారు. కట్లేరు ప్రాజెక్టు రెండు కాల్వలకు ఎత్తిపోతల ప్రెషర్ మెయిన్లను అనుసంధానించి ఆయకట్టును స్థిరీకరిస్తారు. తాగునీటి అవసరాలూ తీర్చనున్నారు. ఈ పథకం ద్వారా మధిర, ఎర్రుపాలెం మండలాల రైతులు గోదావరి, కృష్ణాజలాలను వినియోగించుకునే వెసులుబాటు దొరుకుతుంది.

**మేజర్ల పరిస్థితి ఇలా..**

మధిర బ్రాంచి కెనాల్‌పైన గల నిదానపురం మేజర్‌కు 17,309 ఎకరాల ఆయకట్టు ఉంది. 11.125 కి.మీ. దూరం నుంచి నీటిని పైపుల ద్వారా తీసుకొచ్చి నాగలవరపాడు(కెనాల్‌కు 38 కి.మీ.)లో విడిచిపెడతారు. అక్కడి నుంచి మధిర, ఎర్రుపాలెం మండలాల పరిధిలోని పొలాలకు సరఫరా చేస్తారు.

నూజివీడు బ్రాంచికెనాల్‌పై గల ఈ మేజర్‌కు ఎర్రుపాలెం మండలంలో 10,623 ఎకరాల ఆయకట్టు ఉంది. 33.380 కి.మీ. వద్ద గుంటుపల్లి గోపవరంలో నీటిని పంప్ చేస్తారు.

నూజివీడు బ్రాంచ్ కెనాల్‌పై ఈ మేజర్‌కు ఎర్రుపాలెం మండలంలో 5,093 ఎకరాల ఆయకట్టు ఉంది. దీనికి 27.30 కి.మీ. వద్దగల రాజుపాలెం సమీపంలో నీటిని విడుదల చేస్తారు.

# ముంపు ముప్పు తప్పేలా..!

కొత్తగూడెం : గోదావరి వరదలను సమర్థంగా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. భారీ వర్షాలకు భద్రాచలం పట్టణంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఏటా వరద ముంపును ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా లోతట్టు ప్రాంతాల్లో సమస్యలు తీవ్రరూపం దాల్చుతున్నాయి. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఈసారి పటిష్ఠ వ్యూహంతో ముందుకు సాగాలని అధికారులు నిర్ణయించారు.

**ముంచేది మురుగే..!**

ఏటా గోదావరికి వరదలు రావటం.. రామాలయ పరిసర ప్రాంతాలు, విస్తా కాంప్లెక్స్, శిల్పానగర్, కొత్తకాలనీ, అయ్యప్పకాలనీ ముంపునకు గురవటం సర్వసాధారణం. వర్షం నీటికి పట్టణం నుంచి వెలువడే వ్యర్థజలాలు తోడవటంతో లోతట్టు ప్రాంతాలు మురుగునీటితో నిండిపోతున్నాయి. గత అనుభవాల దృష్ట్యా నీటిని ఎత్తిపోసేందుకు కరకట్టకు ఉన్న ఏడు స్లూయిస్‌ల వద్ద మోటార్లను బిగిస్తున్నారు. ఎక్కువ నీరు నిలిచే విస్తా క్లాంప్లెక్స్ వద్ద 150 హెచ్‌పీ సామర్థ్యం గల మూడు మోటార్లను సిద్ధం చేస్తున్నారు.

**వీటిపైనా దృష్టి సారించాలి..**

వరద నీరు భద్రాచలం పట్టణంలోని రోడ్లపైకి చేరకుండా స్లూయిస్‌లు, మురుగుకాల్వల్లో చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించాలి.

ఓపెన్ నాళాల వద్ద హెచ్చరిక బోర్డులు అమర్చాలి.

వరదల వల్ల రాకపోకలు నిలిచిపోయే ప్రాంతాలను గుర్తించి ముందస్తు సౌకర్యాలు కల్పించాలి.

**పునరావాసం కల్పించేందుకు సిద్ధమేనా?**



గోదావరి వరదల తీవ్రత ఎక్కువగా ఉంటే భద్రాచలం, బూర్గంపాడు తదితర లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలి. వీటిలో ముందుగానే తాగునీరు, విద్యుత్తు, ఇతర సదుపాయాలు సమకూర్చాలి. బ్లీచింగ్, శానిటైజర్లు సిద్ధంగా ఉంచాలి. మహిళలు, పిల్లల కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. వృద్ధులు, గర్భిణులకు వైద్యసౌకర్యాలను అందుబాటులో ఉంచాలి. బఫర్ స్టాక్‌పై స్పష్టత రావాల్సి ఉంది.

**కరకట్టతోనే కష్టాలకు అడ్డుకట్ట**

గోదావరి వరదలను నియంత్రించేందుకు చేపట్టిన కరకట్ట విస్తరణ పనుల్లో జాప్యం నెలకొంది. వర్షాల కారణంగా పనులు ముందుకు సాగటం లేదు. 70 అడుగుల వరదొచ్చినా.. ప్రజలకు ఇబ్బంది కలగకుండా కట్ట కిందిభాగంలో అధికారులు రాతితో రివిటింగ్ చేయిస్తున్నారు. వరదనీరు పట్టణంలోకి రాకుండా కరకట్టకు స్లూయిస్ బిగించారు. విజయవాడ–జగదల్‌పూర్ జాతీయ రహదారి మధ్యలోంచి కరకట్ట ఏర్పాటు చేయాల్సి రావటంతో రోడ్డు ఎత్తు పెంచేందుకు 1.5కి.మీ పొడవైన కాజ్‌వే నిర్మించాలి. అయినా ఇంకా అడుగులు పడటం లేదు. గోదావరి వరదలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని, వర్షాల వల్ల కరకట్ట నిర్మాణానికి అంతరాయం కలిగినా ఎలాంటి ఇబ్బంది లేదని భద్రాచలం జలవనరులశాఖ ఈఈ జానీకు తెలిపారు.

# కుందూలో కృష్ణమ్మ

నంద్యాల : కుందూలో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది.. సోమశిల వైపు పరుగులు పెడుతోంది.. గతంలోనే ఎన్నడూలేనివిధంగా కుందూ నదికి జులైలోనే మళ్లించారు. ఈసారి శ్రీశైలం జలాశయానికి వరద ముందస్తుగా వచ్చింది. జూన్‌లోనే నిండు కుండలా మారింది. ఎగువ నుంచి వరద ప్రవాహం ఎక్కువగా ఉండటంతో 20 రోజుల క్రితమే అన్ని ప్రాజెక్టులకు నీటి విడుదల ప్రారంభమైంది. గత 20 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా జులైలోనే కుందూలో కృష్ణమ్మ సందడి చేస్తోంది.

**నిత్యం 18 వేల క్యూసెక్కులు**

శ్రీశైల జలాశయానికి ప్రస్తుతం రెండు లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం ఉంటోంది.. దీంతో బనకచెర్ల నుంచి నిత్యం 31 వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. అక్కడి నుంచి వెలుగోడు రిజర్వాయర్ ద్వారా కుందూకు నిత్యం సగటున 18 వేల క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. ప్రస్తుతం కుందూ నదిలో 1.5 టీఎంసీల నీటితో నిండుగా ప్రవహిస్తోంది. అంతే వేగంతో సోమశిల రిజర్వాయర్‌కు చేరుతోంది. వరద ఇదే స్థాయిలో ఉంటే 2 టీఎంసీలకు పెంచే అవకాశం ఉంది.

**తీరనున్న 24 గ్రామాల దాహార్తి**

కుందూ పరివాహకంలో కోవెలకుంట్ల, దొర్నిపాడు, లింగాల,



సంజామల, టంగుటూరు నీటి పథకాలు(సీపీడబ్ల్యూ స్కీం) ఉన్నాయి. వీటి ద్వారా 24 గ్రామాలకు మంచినీరు అందుతోంది. ఒక్క టంగుటూరు పథకం పరిధిలోని తొమ్మిది గ్రామాల్లో 32 వేల జనాభా ఉంది. కోవెలకుంట్ల పథకానికి సంబంధించి ఆరు గ్రామాల పరిధిలో 26 వేల జనాభా ఉంది. లింగాల, సంజామల, టంగుటూరు గ్రామాల పరిధిలో మరో 20 వేల జనాభా ఉంది. సుమారు 80 వేల జనాభా దాహార్తిని ఈ ఐదు పథకాలు తీరుస్తున్నాయి. ఆయా పథకాలు ప్రారంభమైన నాటి నుంచి ఎన్నడూ లేని విధంగా జులైలోనే నీటిని విడుదల చేస్తున్నారు.

**20 వేల ఆయకట్టుకు వెన్నుదన్ను**

కుందూ పరివాహకంలో గతంలో ఎన్నడూ లేని విధంగా 15 రోజుల క్రితమే నాట్లు పడ్డాయి. వెలుగోడు, బండిఆత్మకూరు, నంద్యాల, బనగానపల్లి, కోవెలకుంట్ల, దొర్నిపాడు, ఉయ్యాలవాడ, సంజామల మండలాల పరిధిలో 20 వేల అనధికార ఆయకట్టు కుందూ పరివాహకంలో ఉంది.

**ఆధునీకీకరణ చేసి ఉంటే..** బనకచెర్ల నుంచి వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు సమీపంలోని పెన్నానది వరకు 187 కి.మీ. పొడవునా కుందూ నదిని విస్తరించడ ంతో పాటు.. కుందూ వరద నీటిని కేసీ ఆయకట్టుకు మళ్లించి 91 వేల ఎకరాలను స్థిరీకరించడమే లక్ష్యంగా రాజోలి, జొలదరాశి జలాశయాలను నిర్మిస్తామని గత వైకాపా ప్రభుత్వం చెప్పింది. వరద సమయంలో కుందూ ద్వారా రోజుకు సగటున 3 టీఎంసీల నీటిని సోమశిలకు తరలించాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. రూ.1725 కోట్ల వ్యయంతో పనులు ప్రారంభించి 20 శాతం పనులు చేసిన తర్వాత వదిలేశారు. చేసిన పనులకు నిధులు విడుదల చేయకపోవ డంతో గుత్తేదారు సంస్థ పనులు వదిలేసి వెళ్లిపోయింది. దీంతో కుందూ ఆధునీకరణ పనులు ఆగిపోగా రాజోలి, జొలదరాశి రిజర్వాయర్లు అటకెక్కాయి.

# కడుపు రగిలిపోతోంది!

ఒంగోలు : ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి మంగళవారం ఉదయం ఒంగోలు నగర శివారు త్రోవగుంటకు చెందిన ఓ నిండు గర్భిణి వచ్చారు. పది గంటలకు వైద్యురాలికి చూపించుకున్న అనంతరం స్కానింగ్ చేయించుకునేందుకు సంబంధిత విభాగానికి వెళ్లారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఆమెకు స్కానింగ్ చేయించుకునే అవకాశం వచ్చింది. గంటలతరబడి వరుసలో నిలబడాల్సి రావడంతో ఆమె పడిన ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఈమె ఒక్కరే కాదు.. నిండు గర్భిణులు స్కానింగ్‌కు నరకయాతన అనుభవిస్తున్నారు. ఆసుపత్రికి జిల్లా మారుమూల ప్రాంతాల నుంచి ప్రతిరోజు సరాసరి 800 మంది వరకు రోగులు వస్తుంటారు. వీరితో పాటు మరో 100 మంది వరకు గర్భిణులు వైద్య సేవలు నిమిత్తం తరలివస్తుంటారు. చికిత్సలో భాగంగా పరీక్షలు చేయించుకోవడం తప్పనిసరి. వైద్యసిబ్బంది కొరత, విధుల్లో ఉన్నవారు వేరే వ్యాపకాల్లో ఉండడం తదితర కారణాలతో పరీక్షలో ఎడతెగని జాప్యం జరుగుతోంది. ఫలితంగా రోగులకు అవస్థలు తప్పడం లేదు. ప్రధానంగా గర్భిణులు గంటల తరబడి నిలబడాల్సి రావడం కంటతడి పెట్టిస్తోంది. స్కానింగ్ విభాగం తెరవక ముందే కాచుకుని కూర్చోవాల్సి వస్తోంది. ఇక్కడ ప్రస్తుతం రెండు యంత్రాలు పనిచేస్తున్నా సిబ్బంది అందుబాటులో లేకపోవడం ఆలస్యంగా జరుగుతున్నాయి. ఎనిమిది నెలల గర్భిణి స్కానింగ్ తీసే గది వద్ద సుమారు గంటపాటు వేచి ఉన్నారు. ఇక నిలబడలేక అక్కడ ఉన్న పీటపై కూర్చుండిపోయారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో పరిశీలిస్తే పాతిక మంది వరకు ఇంకా వేచి ఉన్నారు. వీరంతా ఉదయమే వచ్చి వరుసలో వేచి ఉండడం గమనార్హం. **సామాన్యులు నిలబడాల్సిందే..**

ఆసుపత్రిలో మిగతా విభాగాల్లో రోగులకు ఎవరైనా స్కానింగ్ అవసరమైతే వాళ్లకి ఇక్కడే చేస్తున్నారు. అదే సమయంలో గర్భిణులు వరుసలో ఉంటున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులకు చేసిన పరవాలేదు. అందరికి కలగలిపి చేయడంతో గర్భిణులు నానా అవస్థలు పడుతున్నారు. మరోవైపు సిఫార్సులు బలంగా పని చేస్తున్నాయి. ఆసుపత్రి సిబ్బంది కొంతమందిని నేరుగా తీసుకొచ్చి స్కానింగ్ చేయిస్తున్నారు. వరుసలో ఉన్నవారు చూస్తూ నిట్టూరుస్తున్నారు. రోజుకు ఆసుపత్రిలో వంద వరకు స్కానింగ్‌లు జరుగుతాయి. తమకు ప్రత్యేక సమయం కేటాయించి తొందరగా చేసేవిధంగా చూడాలని గర్భిణులు కోరుతున్నారు. **మరో యంత్రం ఏర్పాటు చేస్తాం**

స్కానింగ్‌కు ఎక్కువ సమయం పట్టడంపై దృష్టిసారించాం. మరో యంత్రం ఏర్పాటు చేసి వెనువెంటనే జరిగేవిధంగా చూస్తాం. గర్భిణులకు ప్రత్యేకంగా గదిని సిద్ధం చేసి వారం రోజుల్లో అందుబాటు లోకి తీసుకొస్తాం. తిరుపతిరెడ్డి, ఆసుపత్రి పర్యవేక్షకులు

# బడిబాటలో వెనుకబాటు



అనకాపల్లి : జిల్లాలో బడిబయట ఉన్న విద్యార్థుల సంఖ్య పెరగనుంది. పేద విద్యార్థులు చదువుకోవడానికి ప్రభుత్వం ఎన్ని అవకాశాలు కల్పిస్తున్నా.. బడిలో చేరని విద్యార్థుల సంఖ్య పెరుగుతూనే ఉంది. ఈ విద్యా సంవత్సరంలో ఒకటి నుంచి పదో తరగతి వరకు బడిలో చేరని 4,075 మంది విద్యార్థులను గుర్తించారు. వీరిపై ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఒకటి నుంచి పదోతరగతి వరకు 2,19,715 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో అర్హులైన వారికి తల్లికి వందనం కింద కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంత మందికి రూ. 13 వేల చొప్పున ప్రభుత్వం నగదు సాయం అందిస్తోంది. అయినా జిల్లాలో కొంతమంది పిల్లలు బడిలో చేరడం లేదు. వీరిని పాఠశాలలకు తీసుకొచ్చేలా ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నారు.

**వలసలు పోవడంతో ఇబ్బందులు...** జిల్లాలో ఇటుకల బట్టీలు, క్వారీల్లో పనిచేయడానికి వస్తున్న కూలీలు తమ పిల్లలను పాఠశాలల్లో చేర్పించడం లేదని అధికారుల తనిఖీల్లో తెలుస్తోంది. దీంతో ఆయా ప్రాంతాల్లో ప్రచారం చేసి పిల్లలను పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకుంటున్నారు. అనకాపల్లి, నర్సీపట్నం, చోడవరం, ఎలమంచిలి ప్రాంతాల్లో చిన్నారులతో భిక్షం ఎత్తిస్తున్న సంఘటనలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇలా కొందరు తల్లులు తమతోపాటు పిల్లల భవిష్యత్తు నాశనం చేస్తున్నారు. ఇదివరకు పోలీస్ అధికారులు దృష్టి పెట్టి వీరిని సంరక్షణ గృహాలకు తరలించేవారు. ఇటీవల కాలంలో దీనిపై నిఘా కొరవడింది. నెలరోజుల ప్రచారం.. ఒకరి గుర్తింపు: బాలకార్మికులను గుర్తించి వారిని బడిలో చేర్పించేలా జూన్1 నుంచి నెలరోజుల పాటు జిల్లాలో ప్రచారం చేశారు. కార్మిక, విద్యా, సమగ్ర శిక్షా అధికారులు పరిశీలించి ఒక బాలకార్మికుడిని గుర్తించి బడిలో చేర్చారు. బాలకార్మిక వ్యవస్థను అరికట్టాల్సిన కార్మిక శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

**బడిలో చేర్పించేలా చర్యలు...** బడిమానేసిన పిల్లలను చేర్పించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యాకమిటీ సభ్యులు, క్లస్టర్ల రిసోర్సు పర్సన్లతో ప్రత్యేక పరిశీలన చేస్తున్నాం. వలస వచ్చే విద్యార్థులను విద్యా సంవత్సరంలో ఎప్పుడైనా పాఠశాలలో చేర్చుకునే వెసులుబాటు ప్రభుత్వం కల్పించింది. ఇదివరకు బడిలో చేరని విద్యార్థులు తొమ్మిది వేలమందికి పైగా ఉండేవారు. వీరిలో అయిదువేల మందిని పాఠశాలల్లో చేర్పించాం. మిగిలిన వారిని కూడా పాఠశాలల్లో చేర్చడానికి చర్యలు తీసుకుంటాం.
– గిడ్డి అప్పారావు నాయుడు, డీఈఓ

# పరిశ్రమలు పెట్టరు.. స్థలాలు వదలరు!



రాయదుర్గం : పట్టణ సరిహద్దున 74 ఉడేగోళం గ్రామం వద్ద రూ.4 కోట్లు కేటాయించి టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు స్థలాలు కేటాయించినా.. నేటికీ పరిశ్రమలను ఏర్పాటు చేయకపోవడంతో పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. పార్కులో వేలాది మందికి ఉపాధి కల్పించి రాయదుర్గం గార్మెంట్స్ పరిశ్రమకు పూర్వవైభవం తీసుకురావాలన్న ప్రభుత్వ లక్ష్యం మాత్రం నెరవేరడం లేదు. 2007–08లో పార్కుకు కేటాయించిన 15 ఎకరాల్లో 55 మంది వ్యాపారులు స్థలాలు కొనుగోలు చేశారు. 18 ఏళ్లు గడిచినా వ్యాపారులు పరిశ్రమలు ఏర్పాటు చేయకపోగా.. ఆ స్థలాల్లో ఇతరులకు వదలకపోవడం గమనార్హం. ఇప్పటివరకు కేవలం 8 మంది మాత్రమే యూనిట్లు ఏర్పాటు చేశారు. 47 యూనిట్ల స్థలాలు ఖాళీగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వంలోనైనా టెక్స్‌టైల్ పార్కుకు మహర్దశ పట్టేనా అని ఈ ప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్నారు.

**స్పందన కరవు..** టెక్స్‌టైల్ పార్కులో పరిశ్రమలు ఏర్పాటు చేయకపోతే యూనిట్లు రద్దు చేస్తామని చేనేత, జౌళిశాఖ అధికారులు పలుమార్లు విజ్ఞప్తులు, హెచ్చరికలు, తాఖీదులు ఇచ్చినా.. ప్రయోజనం కరవైంది. ఇటీవల కలెక్టర్ ఆధ్వర్యంలో ఆర్డీవో, ఏపీఐఐసీ జోనల్ మేనేజరు, ఇద్దరు పారిశ్రామికవేత్తలతో కమిటీని ఏర్పాటు చేశారు. యూనిట్ల రద్దుకు అనుమతి కోరతూ రెండు నెలల కిందట ప్రతిపాదనలు చేనేత, జౌళిశాఖ కమిషనర్‌కు పంపారు. కమిషనర్ రేఖారాణి వర్చువల్‌గా వ్యాపారులతో సమావేశమయ్యారు. పరిశ్రమల ఏర్పాటుకు మూడు నెలల గడువు కావాలని వ్యాపారులు కోరినప్పటికీ.. నేటికీ ఒక్క యూనిట్ ఏర్పాటుకు మాత్రమే పునాదులు తవ్వడం గమనార్హం.

**తగు చర్యలు తీసుకుంటాం**

టెక్స్‌టైల్ పార్కులో పరిశ్రమల ఏర్పాటుకు వ్యాపారులతో సామూహిక భూమి పూజకు చర్యలు తీసుకుంటాం. పార్కులో యూనిట్లు ఏర్పాటైతే రాయదుర్గం గార్మెంట్స్ పరిశ్రమ అభివృద్ధి చెందుతుంది. సుమారు 20 వేల మందికిపైగా అదనపు ఉపాధి లభిస్తుంది. తద్వారా పట్టణాభివృద్ధికి బాటలు పడతాయి. వరప్రసాద్, జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి

# అంగన్‌వాడీలకు పురుగు పట్టిన కందిపప్పు



అనంతపురం : జిల్లాకు ప్రతినెలా 628 మెట్రిక్ టన్నుల కందిపప్పు అవసరమవుతుంది. రేషన్ కార్డుదారులతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలకు పౌర సరఫరాల సంస్థ సరఫరా చేయాల్సి ఉంది. కొంతకాలంగా కార్డుదారులకు కందిపప్పు పంపిణీ చేయకున్నా అంగన్‌వాడీ కేంద్రాలకు అందిస్తున్నారు. ప్రతి నెలా 28 మెట్రిక్ టన్నులు సరఫరా చేయాల్సి ఉంది. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ దుకాణాలకు రవాణా చేసి... డీలర్లు ద్వారా అంగన్‌వాడీలకు ప్యాకెట్లు (కిలో చొప్పున) ఇస్తున్నారు. ఏప్రిల్ నెలకు 28 మెట్రిక్ టన్నులు కేటాయింపు జరిగింది. ప్యాకెట్లు విప్పి చూడగా చాలావరకు పురుగు పట్టిన పప్పు పిండైపోయింది. డీలర్లు ఫిర్యాదు చేయగా నాసిరకం బయటపడింది. శింగనమల ఎంఎల్ఎస్ పాయింట్లో 8.5 మెట్రిక్ టన్నులు, తాడిపత్రిలో 6 మెట్రిక్ టన్నులు, రాప్తాడు ఎంఎల్ఎస్ పాయింట్లో 5.4 మెట్రిక్ టన్నుల నాసిరకం కందిపప్పు గుర్తించారు. దీంతో సుమారు 20 మెట్రిక్ టన్నులను గత నెలలో గుత్తేదారుకు వెనక్కి పంపారు. ఈనెలలో అదే సరకును మళ్లీ గుత్తేదారు రీప్యాకింగ్ చేసి అంగన్‌వాడీలకు సరఫరా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

**నాణ్యత పరిశీలించమని చెప్పాం** కొన్నిచోట్ల కందిపప్పు బాగా లేదని, పిండైందని మా దృష్టికి వచ్చింది. జిల్లాలోని 12 ఎంఎల్ఎస్ పాయింట్లలో కందిపప్పు నాణ్యతను పరిశీలించాం. నాసిరకంగా ఉండటంతో అంగన్‌వాడీలకు సరఫరా నిలిపేశాం. గుత్తేదారుకు సరకును వెనక్కి పంపుతాం రమేశ్‌రెడ్డి, జిల్లా మేనేజర్, పౌర సరఫరాల సంస్థ

# యువత.. మేలిమి భవిత..!

పెదవాల్తేరు: యువతలో దేశభక్తి, నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి కృషి చేస్తోంది నెహ్రూ యువ కేంద్రం. బీచ్‌రోడ్డులో ఈ కేంద్రాన్ని 1972లో ప్రారంభించారు. యువజనోత్సవంలో భాగంగా ఏటా యువతలోని ప్రతిభను వెలికితీయడం, గ్రామీణస్థాయిలో ఆటల పోటీలు నిర్వహించడం, సాంస్కృతిక సమ్మేళనాలు ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

యువజనోత్సవాలు ప్రతి సంవత్సరం ఆగస్టు 3వ వారం నుంచి నిర్వహిస్తున్నారు. యువత తమలోని ప్రతిభను చాటుకోవడానికి ఇది చక్కటి వేదికగా మారుతోంది. జిల్లా స్థాయిలో ఎంపికైనవారు రాష్ట్ర, రాష్ట్ర స్థాయిలో ఎంపికైన వారు జాతీయ స్థాయికి అర్హత సాధిస్తారు. వివిధ రాష్ట్రాల యువతను కలవడం ద్వారా ఆలోచన పరిధి విస్తృతమవుతుంది. నాయకత్వ, నిర్వహణ సామర్థ్యాలు మెరుగవుతాయి. దేశభాషలపై అవగాహన పెరుగుతుంది.

యూత్ పార్లమెంట్ పోటీలు జనవరి, ఫిబ్రవరి నెలల్లో నిర్వహిస్తారు. ఈ ఏడాది వికసిత భారత్–2047 అంశానికి సంబంధించి వక్తృత్వ పోటీలు జరిగాయి. జిల్లా స్థాయిలో 300 మంది పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర, జాతీయ స్థాయికి పంపించి ప్రోత్సహిస్తారు. యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమం వినూత్నమైంది. ఇక్కడి యువతను ఇతర రాష్ట్రాలకు పంపిస్తారు. అక్కడి ప్రజల జీవన శైలి, ఆచార, వ్యవహారాలు, సంప్రదాయాలు, ఆహారపు అలవాట్లపై అధ్యయనం చేయవచ్చు.

ఫిట్ ఇండియా ఫిట్‌నెస్ క్లబ్‌ల స్థాపనను ప్రోత్సహించడానికి వాకింగ్, సైక్లింగ్, ఉమెన్స్ ఫిట్ ఇండియా క్లబ్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. గ్రామీణ యువతకు జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తున్నారు. తద్వారా ప్రాంతీయ, సంప్రదాయ క్రీడలను సంరక్షించడంతో పాటు వాటికి ప్రాచుర్యం కల్పిస్తున్నామని నెహ్రూ యువకేంద్రం డిప్యూటీ డైరెక్టర్ జి.మహేశ్వరరావు తెలిపారు. ఆసక్తి ఉన్న యువత 80746 05109 ఫోన్ నెంబరులో సంప్రదించాలని కోరారు.

# భావితరం.. గొంతులో గరళం

ఆలూరు: ఆలూరులోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల–1లో 596 మంది విద్యార్థులు చదువుకొంటున్నారు. ఇక్కడున్న ట్యాంకులు పాచిపట్టి ఉన్నాయి. మొత్తం ఐదు ట్యాంకులు ఉండగా ఇటీవల ఒకటి శుభ్రం చేసి నాలుగు వదిలేశారు. వాటిపై మూతలు కూడా లేవు.

**రూ.కోట్లు ఖర్చు చేసి తూట్లు**

ఉమ్మడి జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో గంటకు 1000 లీటర్లు శుద్ధి చేసే విధంగా ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేశారు. నాడు–నేడు పనుల్లో భాగంగా ఉన్నత పాఠశాలల్లో ప్లాంట్లకు రూ.2.50 లక్షలు ఖర్చు చేశారు. ఇలా హైస్కూళ్లలోని ప్లాంట్లకే రూ.2 కోట్ల వరకు వ్యయం చేశారు. ప్రాథమిక పాఠశాలల్లో ప్లాంట్లకు రూ.80 వేల వరకు వ్యయమైంది. నిర్వహణ లోపాలతో ఉమ్మడి జిల్లాలోని 10 శాతం పాఠశాలల్లో ప్లాంట్లు పనిచేయడం లేదు.

సర్కారు బడుల్లో ‘మంచి’నీరు కరవైంది. శుచి, శుభ్రత లేకపోవడంతో భావితరం గొంతులో గరళం చేరుతోంది. ఉమ్మడి జిల్లాలో 638 పాఠశాలల్లో సింథటిక్, 20 సిమెంట్ ట్యాంకులు ఉన్నాయి. వీటిని ఎప్పుడు శుభ్రం చేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. పాఠశాలల నిర్వహణకు వచ్చే నిధులతో బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు చేసి శుభ్రం చేసుకునే అవకాశం ఉన్నా చాలా చోట్ల చేయడం లేదు. పలు పాఠశాలల్లో నాడు–నేడు కింద గత ప్రభుత్వం నీటి శుద్ధి యంత్రాలను బిగించింది. నాణ్యత లేకపోవడంతో చాలా చోట్ల పక్కన పడేశారు.



మరికొన్ని చోట్ల సిమెంట్, సింథటిక్ ట్యాంకులను ఏర్పాటు చేశారు. ఇంకొన్ని బడుల్లో బోరు, చేతి పంపులనే ఆశ్రయిస్తున్నారు. బడుల్లో ‘మంచి’నీరు లేకపోవడంతో విద్యార్థులు ఇళ్ల వద్ద నుంచే సీసాలో తెచ్చుకొని దాహం తీర్చుకుంటున్నారు.

సిమెంట్ మినీ, సింథటిక్ ట్యాంకులను ప్రతి 15 రోజులకోసారి కచ్చితంగా శుభ్రం చేయాలి. అదేవిధంగా వారానికోసారి క్లోరినేషన్ లేదా బ్లీచింగ్ పౌడర్ కలపాలి. అవశేష క్లోరిన్(రెసిడ్యుయల్) సాధారణంగా 1 ఎంజీ/ఎల్ ఉండాలి. అప్పుడే మంచినీరుగా మారి తాగడానికి వీలుంటుంది.

**ట్యాంకులు శుభ్రంగా లేకుంటే..**

ట్యాంకులు శుభ్రంగా లేకుంటే ఈకొలై, క్లెప్సెల్లా, పీడాల్ కోలిఫాం తదితర సూక్ష్మజీవులు వృద్ధి చెంది డయేరియా, టైఫాయిడ్, కామెర్లు వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది.

**నీటిలో లవణాలు..వచ్చే వ్యాధులు**

జల కాఠిన్యత: నీటిలో కాల్షియం, మెగ్నీషియం, సల్ఫేట్, ఫ్లోరైడ్ కలిపి ఉంటాయి. ఇవి ఒక లీటరు నీటిలో 200 నుంచి 800 మి.గ్రా. ఉండాలి. ఎక్కువైతే ఎముకలు పెలుసుబారి పోతాయి. కీళ్లు, మోకాళ్ల నొప్పులు వస్తాయి. తక్కువైతే పళ్లు పుచ్చిపోతాయి. ఎముకల పెరుగుదల ఉండదు.


క్షార స్వభావం: 200 నుంచి 800 ఎంజీ/ఎల్ వరకు ఉండాలి. దాటితే గ్యాస్ట్రిక్ ట్రబుల్, తక్కువైతే జీర్ణ సంబంధమైన ప్రక్రియలో వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది.

ఫ్లోరైడ్: సాధారణంగా 0.5 నుంచి 1.5 ఎంజీ/ఎల్ వరకు ఉండాలి. 0.5 కంటే తక్కువైతే పళ్లు పుచ్చుపట్టి బొర్రలు పడి విరిగిపోయే ప్రమాదం ఉంది. 1.5 కంటే ఎక్కువైతే పళ్లు గారపట్టడం, 3 ఎంజీ/ఎల్ కంటే ఎక్కువైతే మరింత ప్రమాదకరం.

ఐఎస్ఐ మార్కు ఉన్న సింథటిక్ ట్యాంకులనే వాడాలి. చాలా పాఠశాలల్లో నాణ్యతలేనివి(తక్కువ ధరకు లభించే) పెట్టారు. ఎండవేడిమికి ప్లాస్టిక్ కరిగి కర్బన సమ్మేళన పదార్థాలు నీటిలోకి విడుదలవుతాయి. తద్వారా క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది.

# దయచేసి వినండి.. సిద్ధంగా ఉండండి!

దర్శి : నడికుడి–శ్రీకాళహస్తి రైల్వేలైన్ పనుల్లో భాగంగా దర్శి రైల్వే స్టేషన్ పనులు వేగంగా సాగుతున్నాయి. ప్రధాన ట్రాక్ పనులు పూర్తికాగా లూప్‌లైన్ మూడు ట్రాక్ పనులు చివరి దశలో ఉన్నాయి. అధికారుల అతిథి గృహం, టికెట్ కౌంటర్, సిగ్నల్ కార్యాలయం, ప్రయాణికులు కూర్చోవటానికి బల్లలు, తాగునీటి ట్యాంకు పనులు పూర్తయ్యాయి. కుళాయిలు ఏర్పాటు చేయాల్సి ఉంది. స్టేషన్ లోపల, వెలుపల విద్యుత్తు దీపాల ఏర్పాటుతో పాటు పచ్చదనం ఉట్టిపడేలా అలంకరణ మొక్కలు నాటారు. దాదాపు 95 పనులు పూర్తయ్యాయని, మిగిలినవి త్వరితగతిన పూర్తి చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే ప్రయాణికుల రైలు ట్రయల్ రన్ నిర్వహించగా ఈ ఏడాదిలోనే రైలులో ప్రయాణించాలనే దర్శి ప్రాంత




ప్రజల కోరిక నెరవేరే అవకాశం కనిపిస్తోంది.

పూర్తయిన రైల్వే స్టేషన్ల నిర్మాణాలు.. : నడికుడి నుంచి శ్రీకాళహస్తి వరకు 309 కిలోమీటర్ల పరిధిలో చేపడుతున్న రైల్వే పనులు అయిదు దశల్లో చేయటానికి ప్రణాళికలు తయారు చేశారు. మూడు, నాలుగో దశలో చేపడుతున్న పనులు జిల్లాలో ప్రస్తుతం వేగంగా సాగుతున్నాయి. పొదిలి సమీపంలో 200 మీటర్ల పరిధిలో మినహా ట్రాక్ నిర్మాణం గార్లపేట వరకు (145 కి.మీ) వరకు దాదాపు పూర్తయినట్లు అధికారులు వివరించారు. ట్రాక్‌తో పాటు పొదిలి, కనిగిరి, గౌతువారిపల్లి, గార్లపేట స్టేషన్ల పనులు దాదాపు పూర్తయ్యాయి. పేరంగుడిపల్లి వద్ద జాతీయ రహదారి పనులు పూర్తయిన అనంతరం రైల్వే వంతెన నిర్మాణం చేపట్టనున్నట్లు అధికారులు చెప్పారు. కనిగిరి–పామూరు మధ్యలో పనుల కోసం టెండర్ల ప్రక్రియ పూర్తవగా పనులు ప్రారంభం కావాల్సి ఉంది.

# తుంగలో మా'రీచ్'లు

కర్నూలు : గత వైకాపా ప్రభుత్వ హయాంలో మా'రీచు'లు తుంగభద్రను దోచేశారు. ఆ పార్టీ పెద్దలు నేరుగా రంగప్రవేశం చేసి.. జిల్లాల వారీగా సిండికేట్లు పెట్టుకొని నదులను ఊడ్చేశారు. ప్రతినెలా రూ.కోట్లు దోచేశారు. ఇసుక దోపిడీపై విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు.. ఎంతమేర తవ్వకాలు జరిగాయో తేల్చాలని ఆదేశించింది. అక్రమాల లెక్క తేల్చేందుకు గనులశాఖ అధికారులు ఏపీ స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ (ఏపీ శాక్) సాయం తీసుకున్నారు. గత మూడేళ్లలో లక్షల టన్నుల ఇసుకను అనుమతుల్లేకుండా రీచ్‌ల నుంచి తవ్వేసి తరలించినట్లు గుర్తించారు.

**అధికారులూ వంత పాడారు**

అప్పటి గనులశాఖ డైరక్టర్ వెంకటరెడ్డి కలెక్టర్లతో రీచ్‌లో మొక్కుబడి తనిఖీలు చేయించారు. అక్రమ తవ్వకాలపై దండా నాగేంద్రకుమార్ అనే వ్యక్తి వరుస ఫిర్యాదులతో జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్‌జీటీ), సుప్రీం కోర్టుల్లో కేసులు నమోదయ్యాయి.

అక్రమ తవ్వకాలే లేవంటూ అప్పటి జిల్లా కలెక్టర్ సృజన, జేసీ మౌర్య ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. మిగతా జిల్లాల్లోనూ ఇదే తరహా నివేదికలు తయారు చేయించి ఎన్జీటీ, సుప్రీం కోర్టులకు సమర్పించారు. నాటి ఇసుక దోపిడీపై తాజాగా విచారణ చేపట్టడంతో వాస్తవాలు వెలుగు చూస్తున్నాయి.

**ఇక్కడా కొల్లగొట్టారు**

సి.బెళగల్ మండలంలోని ఈర్లదిన్నె, ముడుమాల, పల్దొడ్డి, జి.సింగవరం, కొత్తకోట ప్రాంతాల్లోని డీసిల్టింగ్ పాయింట్లలో పెద్దఎత్తున ఇసుక అక్రమాలు జరిగాయి. జలాశయం లోపల, డీసిల్టింగ్ పాయింట్లలో ఎంత మేర తవ్వారన్నది తేల్చేందుకు ఏపీ స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ (ఏపీ శాక్) సాయం తీసుకున్నా అక్రమాలు వెల్లడికాలేదు. వాస్తవంగా అప్పట్లో సీసీ కెమెరాలు సరిగా కనిపించకపోడంతో డీసిల్టింగ్ పాయింట్లలో దోపిడీని గుర్తించలేకపోయారు. వీటి నుంచి రోజుకు 5- 6 వేల టన్నుల మేర ఇసుకను నది నుంచి తోడేశారు. మూడేళ్లలో సుమారు 35 లక్షల టన్నుల మేర అక్రమంగా తరలించారు.



నాటి ప్రభుత్వ లెక్కల ప్రకారం టన్నుకు రూ.475 లెక్కగట్టినా రూ.166.25 కోట్లు దోచుకున్నట్లే.

**2.78 లక్షల టన్నులు తోడేశారు**

నందవరం, కౌతాళం మండలాల్లోని మూడు ఇసుక రీచ్‌ల నుంచి 2021 నుంచి 2024 మే వరకు భారీ ఎత్తున అక్రమ తవ్వకాలు జరిగాయని ఏపీశాక్ గుర్తించింది. ఆయా సంవత్సరాల్లో నెలల వారీగా శాటిలైట్ ఇమేజెస్ తీసి, జీడీ స్టీరియో డేటా, 2డీ గూగుల్ ఎర్త్‌ప్రో ఇమేజ్‌లన్నీ పరిశీలించింది. ఆ ప్రాంతాల్లో గతంలో ఎలా ఉంది? తవ్వకాలు జరిపిన మూడేళ్ల తర్వాత చోటుచేసుకున్న మార్పులను పోల్చి చూసింది. దీంతో పెద్దఎత్తున ఇసుక తవ్వినట్లు బయటపడింది. ఆ వివరాలను గనుల శాఖకు అందించింది.

నందవరం, కౌతాళం మండలాల్లోని మూడు ప్రాంతాల్లో 2,78,243 టన్నుల మేర ఇసుక దోపిడీ సాగిందని తేల్చారు. గత ప్రభుత్వంలో టన్ను రూ.475 చొప్పున రూ.13.21 కోట్ల విలువైన ఇసుకను ఊడ్చేశారని అధికారులు చెబుతున్నారు. అనుతుల్లేకుండా తవ్వకాలు జరిపినందుకు మైనింగ్ అధికారులు టన్ను ఇసుకకు రూ.2 వేల చొప్పున జరిమానా విధించారు. ఈ లెక్కన రూ.55.63 అక్రమాలు జరిగినట్లు లెక్క తేల్చి ఆ మొత్తం చెల్లించాలని గుత్తేదారు సంస్థలకు నోటీసులు ఇచ్చారు.

# ఇక్కడ 'పని' చేసేందుకు 'కాసు'క్కూర్చుంటారు!

మార్కాపురం : ఇటీవల జలవనరులశాఖ మార్కాపురం డివిజనల్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (అనిశా) దాడి జరిగింది. లంచం తీసుకుంటూ సీనియర్ సహాయకుడు అధికారులకు పట్టుబడ్డారు. గత నెలలో గిద్దలూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ లంచం తీసుకుంటూ అనిశాకు చిక్కారు.

గతేడాది యర్రగొండపాలెం తహసీల్దారు కార్యాలయంలో ఓ గ్రామ సహాయ రెవెన్యూ సహాయకుడు అనిశా అధికారులకు ఏసీబీ అధికారుల వలలో పడ్డారు.

పశ్చిమ ప్రకాశంలో అవినీతి జలగలు నలుదిశలా పాకుతున్నాయి. అడిగేవారు లేకపోవడం, ఏళ్లుగా మామూళ్ల మత్తుకు అలవాటు పడడం తదితర కారణాలతో ఏదైనా జరిగితేగానీ అవినీతి వెలుగు చూడడంలేదు. జలవనరులశాఖ మార్కాపురం డివిజన్ కార్యాలయం అవినీతికి అడ్డాగా మారిపోయిందని బహిరంగంగానే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చెరువుల్లో పూడికతీత, చెరువు కట్ట, లైనింగ్, కుంటలు, కాలువల పనులకు టెండర్‌ను బట్టి డబ్బులు డిమాండు చేస్తున్నారు. మార్కాపురం డివిజన్‌లోని అన్ని శాఖల్లో లంచం ఇవ్వందే పని కావడం లేదని ప్రజలు బహిరంగంగా ఆరోపిస్తున్నారు.

మార్కాపురంలో డివిజన్ పరిధిలోని 15 మండలాల్లోని ప్రభుత్వ శాఖల్లో ఎక్కువగా అవినీతి జరుగుతోందని, ప్రధానంగా పశ్చిమంలోనే ఎక్కువగా ప్రజల నుంచి అనిశాకు ఫిర్యాదులు వస్తున్నట్లు అధికారులు గుర్తించారు. విద్యుత్తుశాఖలో రైతులకు పరివర్తకాలు నూతనంగా ఏర్పాటు చేయాలంటే రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు లంచం ఇవ్వందే పని కాని పరిస్థితులు నెలకొన్నాయి.

రెవెన్యూశాఖలో వీఆర్వోలు వెబ్‌ల్యాండ్‌లో నమోదు, పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేయాలంటే రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ప్రజలకు అవసరమైన జనన, మరణ ధ్రువపత్రాలు, కుటుంబ సభ్యుల పత్రంతో పాటు ఇతర పత్రాలకు వీఆర్వోలు, గుమస్తాలు దరఖాస్తుదారుల నుంచి ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారు. పురపాలక సంఘం కార్యాలయంలో ప్రతి పనికి ధర నిర్ణయించి మరీ వసూలు చేస్తున్నారు. పంచాయతీరాజ్, రహదారులు, భవనాలశాఖల్లో పనులు చేసిన గుత్తేదారుల నుంచి ముందుగానే 10 నుంచి 16 శాతం కమీషన్ తీసుకున్న తర్వాతనే బిల్లులు చేస్తారనే ఆరోపణలున్నాయి. కీలకమైన పోలీసుశాఖలోనూ కేసును బట్టి రూ.1000 అంతకు పైగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు విమర్శలున్నాయి. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో ఏపీవోల దగ్గర నుంచి సాంకేతిక సహాయకుల వరకు రూ.లక్ష పనికి బిల్లు చేయాలంటే రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు కమీషన్ తీసుకుంటున్నారు.

# నిర్లక్ష్యంతో నిధులు పోయె!



అనంతపురం : రాష్ట్ర ఖజానా పరిస్థితి దయనీయంగా ఉన్నా పేద పిల్లలు విద్యాబుద్ధులు నేర్చుకునే అంగన్‌వాడీ కేంద్రాలు బాగుండాలన్న సంకల్పంతో కూటమి ప్రభుత్వం నిధులు ఇచ్చినా సకాలంలో వినియోగించని అధికారుల నిర్వాకమిది. యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా నిధులు వెనక్కి వెళ్లిపోవడం గమనార్హం. అనంత జిల్లాలో పక్కా భవనాలు కలిగిన అంగన్‌వాడీ కేంద్రాలకు దశల వారీగా తాగునీరు, మరుగుదొడ్డి సౌకర్యాలను కల్పించేందుకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా గతేడాది సెప్టెంబరులో జిల్లాలోని 1200 పైగా కేంద్రాల్లో వసతులు కల్పించడానికి రూ.3.25 కోట్లు మంజూరు అయ్యాయి. నిర్మాణ బాధ్యతను ఆర్‌డబ్ల్యూఎస్‌కు అప్పగించారు. గత మార్చి ఆఖరు నాటికి నిర్మాణాలు పూర్తి చేయాలని లక్ష్యం నిర్దేశించారు. తర్వాత రెండు మాసాలు గడువు పొడిగించారు. అయినా సౌకర్యాల కల్పనలో సదరు శాఖ నిర్లక్ష్యం ప్రదర్శించింది.

**దేనికి ఎంతెంత?**

జిల్లాలో మొత్తం 2302 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. పక్కా భవనాలు కలిగిన 609 కేంద్రాలకు మరుగుదొడ్లు, 623 కేంద్రాలకు తాగునీటి వసతి కల్పనకు నిధులు వచ్చాయి. మరుగుదొడ్డికి రూ.36వేలు, తాగునీటికి రూ.17వేల చొప్పున మంజూరు అయ్యాయి. మొత్తం 852 కేంద్రాల్లో అరకొరగా పనులు చేశారు. ఉరవకొండ, గుత్తి, కంబదూరు ప్రాజెక్టుల పరిధిలో నిర్దేశిత పనులు సగానికి సగం పూర్తి కాలేదు. కళ్యాణదుర్గం, నార్పల ప్రాజెక్టుల్లోనూ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈక్రమంలో సుమారు రూ.కోటికిపైగా నిధులు వెనక్కి వెళ్లాయి.

**మళ్లీ ప్రతిపాదనలు పంపాం**

సకాలంలో నిర్మాణ పనులు పూర్తి చేయకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లిన మాట నిజమే. తాజా అంచనాల ప్రకారం ఎన్ని నిధులు అవసరమోనన్న ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించాం. రాగానే పనులు చేయిస్తాం.

వనజాక్షి, నోడల్ అధికారిణి, ఐసీడీఎస్

# జాతీయరహదారి.. రక్షణ చర్యలు కొరవడి



పామిడి : 44వ జాతీయ రహదారిపై పలు ప్రాంతాల్లో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆయా ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించారు. ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. జాతీయ రహదారిపై కొన్నేళ్ల కిందట నాలుగు వరసల రహదారి నిర్మాణం చేపట్టారు. పలు ప్రాంతాల్లోని కూడళ్లలో రెండు వరుసలను వేరు చేస్తూ మధ్యలో ఇనుప కంచెతో కూడిన విభాగిని ఏర్పాటు చేసి మొక్కలు నాటారు. పామిడి పెన్నా బ్రిడ్జి సమీపంలోని అంబేద్కర్ కాలనీ కూడలి వద్ద దాదాపు వంద మీటర్ల మేర ఇనుప కంచె ఏర్పాటు చేశారు. కొన్నేళ్లుగా జరుగుతున్న వివిధ ప్రమాదాల వల్ల ఇనుప కంచె దెబ్బతినింది. మరికొన్ని చోట్ల ఇనుప కంచె లేకుండా పోయింది.

**అంతులేని నిర్లక్ష్యం**

గతంలో 50 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు అదుపు తప్పిన ఘటనలో పెనుప్రమాదం జరగకుండా రోడ్డు విభాగిని మధ్యలో ఉన్న ఇనుప కంచె అడ్డుకుందని స్థానికులు చెబుతున్నారు. ఆ మధ్య భారీ లోడ్లతో వెళ్లే వాహనాలు ఢీకొనడంతో కంచె దెబ్బతినింది. కాకపోతే పలు ప్రమాదాల్లో దెబ్బ తిన్న ఇనుప కంచెపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. దెబ్బతిన్న కంచెను తొలగించిన ప్రాంతంలో ఎదురుగా వచ్చే వాహనాలతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇది వరకు జరిగిన ప్రమాదాల సమయంలో కిందపడిపోయిన విద్యుత్తు స్తంభాలను తొలగించలేదు. వీటి వల్ల కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

**పని చేయని నిఘా నేత్రాలు**

జాతీయ రహదారి కూడళ్ల వద్ద జరిగిన ప్రమాదాల్లో చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. పామిడి మండలంలోని అంబేద్కర్ కాలనీ సమీపంలో కూడలి, నీలూరు వంతెన, గజరాంపల్లి, రామరాజుపల్లి, గుత్తి మండలంలోని ఊబిచెర్ల, కరిడికొండ, వన్నెదొడ్డి, కొత్తపేట ప్రాంతాలను బ్లాక్‌స్పాట్‌గా గుర్తించినప్పటికీ రక్షణ చర్యలు లేవు. కనీసం రాత్రివేళల్లో విద్యుద్దీపాలు వెలగడం లేదు. జాతీయ రహదారిపై ఉన్న వేగనిరోధకాల వద్ద ఎటువంటి సూచికలు, సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయలేదు. కొన్ని సౌర విద్యుత్తు దీపాలు, నిఘానేత్రాలు ఏర్పాటు చేసినా అవి పని చేయడం లేదు.

**వంతెన నిర్మాణం చేపడితేనే ప్రజలకు ప్రయోజనం**

జాతీయరహదారి పక్కన ఉన్న వెంగమనాయుడు, చైతన్యకాలనీ, వీకే ఆదినారాయణ రెడ్డి, టిడ్కో ఇళ్లు, జగనన్న కాలనీ, అంబేద్కర్ కాలనీల్లోకి వెళ్లాలంటే కాలనీవాసులు జాతీయ రహదారిని దాటి వెళ్లాలి. రోజూ రాకపోకలు సాగించడానికి ఆయా కాలనీల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. జాతీయ రహదారిపై మిడుతూరు వద్ద రాకపోకలకు అనుగుణంగా నిర్మించిన విధంగా రానున్న ఆరు వరుసల జాతీయ రహదారి నిర్మాణంలో మిడుతూరు వద్ద ఫ్లైఓవర్ వంతెన నిర్మాణం చేపట్టాలని కోరుతున్నాం. షఫీ, పామిడి

# 'ఉక్కు' సంకల్పం.. చుట్టూ స్వచ్ఛ పవనం



అగనంపూడి: అగనంపూడిలో 'మియావాకీ' వనంతో ఆ ప్రాంతంలో పచ్చదనం కళకళలాడుతోంది. ఏడాది కిందట ఉక్కు యాజమాన్యం చేపట్టిన ఈ ప్రాజెక్టు ఇప్పుడు సత్ఫలితాలనిస్తోంది. 'మియావాకీ' విధానంలో తక్కువ స్థలంలో ఎక్కువ మొక్కల్ని పెంచుతూ పచ్చదనాన్ని అభివృద్ధి చేస్తున్నారు.

**ఉక్కు ఖాళీ భూముల్లో..**

జాతీయ రహదారి పక్కనే ఉక్కు కర్మాగారానికున్న వందల ఎకరాలు.. ఏళ్ల తరబడి ఖాళీగా ఉండి బీడుగా మారాయి. ఇక్కడ మొక్కలు నాటడానికి స్టీల్‌ప్లాంట్ ఆగ్రోఫారెస్టీ విభాగం ముందుకొచ్చింది. 'మియావాకీ' విధానం అమలు చేసేందుకు తొలివిడతగా 3 ఎకరాలను ఎంపిక చేశారు. ముందుగా ఆ స్థలాన్ని శుభ్రం చేసి, చదును చేశారు. ప్రాజెక్టులో పేర్కొన్న విధంగా ఎరువులు వేసి నేలను సారవంతం చేశారు. మూడు ఎకరాల విస్తీర్ణంలో సుమారు 14,500 మొక్కల్ని నాటారు. దేశవ్యాప్తంగా లభించే వేప, జామ, టేకు, సపోటా, మామిడి, నేరేడు వంటి వాటితో పాటు మొత్తం 54 రకాల మొక్కల్ని పెంచుతున్నారు. ఎంపిక చేసిన స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించారు. ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి సంరక్షణ చర్యలు చేపడుతున్నారు. ఏడాది వ్యవధిలోనే మొక్కలన్నీ ఏపుగా పెరిగాయి.

జీవవైవిధ్యానికి దోహదం: మియావాకీ విధానంలో అభివృద్ధి చేసిన వనాలు నూరు శాతం సేంద్రియ పద్ధతుల్లో పెంచడం ద్వారా సహజ జీవ వైవిధ్యానికి దోహదం చేస్తాయి. సాధారణ పద్ధతితో పోల్చితే ఈ విధానంలో మొక్కల ఎదుగుదల అధికంగా ఉంటుంది. గాలిలో ధ్వని, ధూళి కాలుష్యాన్ని 30 రెట్లు వరకు తగ్గిస్తాయి. ఈ విధానంలో పెరిగిన చెట్లు అధిక మొత్తంలో ఆక్సిజన్‌ను విడుదల చేస్తుంటాయి. ఈ వనంలో తొలి మూడేళ్ల వరకు మొక్కల నిర్వహణ చూడాలి. అనంతరం వాటంతటవే పెరుగుతాయి.

మరో ప్రణాళిక సిద్ధం: అగనంపూడిలో తొలి ప్రాజెక్టు మంచి ఫలితాలు ఇవ్వడంతో, ఆ చెంతనే మరో వనం అభివృద్ధి చేసేందుకు ఉక్కు యాజమాన్యం శ్రీకారం చుట్టింది. ఇంకో మూడు ఎకరాలను ఎంపిక చేసి నేలను చదును చేశారు. వీటితో ఇక్కడ కాలుష్యం స్థాయి పూర్తిగా తగ్గి ఆహ్లాదకర వాతావరణం ఏర్పడుతుందని ఉక్కు అగ్రోఫారెస్టీ విభాగం అధికారులు చెబుతున్నారు.

# మీరే 'చేప'ట్టండి.. ఆదాయం రాబట్టండి!

ఏలూరు: డ్వాక్రా మహిళలు తమకున్న కొద్దిపాటి స్థలంలో కొరమీను చేపలను పెంచుకుని నికర ఆదాయాన్ని పొందేలా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఏలూరులోని జిల్లా సమాఖ్య ప్రాంగణంలో ఓ ప్రాజెక్టుకు ప్రయోగాత్మకంగా శ్రీకారం చుట్టింది. అది విజయవంతం కావటంతో 50 యూనిట్ల స్థాపనకు డీఆర్‌డీఏ జీవనోపాధుల విభాగం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. వీటి స్థాపనకు కేంద్ర ప్రభుత్వమే ఆర్థిక సాయం చేస్తోంది. యూనిట్ ధర రూ.4.41 లక్షలు కాగా 35 శాతం రాయితీ. డ్వాక్రా మహిళలు గతంలో తీసుకున్న రుణాల చెల్లింపులు.. వారి ఆదాయ, వ్యయాలను పరిగణనలోకి తీసుకుని బ్యాంకులు రుణాలు మంజూరు చేస్తాయి.

**ఏడాదిలో మూడు పంటలు..** తొలుత పిల్లలు వేసిన 8 నెలలకు ఒక పంట వస్తుంది. తర్వాత నుంచి ప్రతి నాలుగు నెలలకు ఒకసారి చొప్పున వస్తుందని డీఆర్‌డీఏ జీవనోపాధుల విభాగం పేర్కొంది. జిల్లా సమాఖ్య ప్రాంగణంలో మార్చిలో 50 గ్రాముల చేపల పిల్లలను



వదిలారు. అవి ఇప్పుడు కేజీ బరువు పెరిగాయి. ఈ ప్రయోగాత్మక సాగును పరిశీలించేందుకు ఆగస్టు ఒకటిన కేంద్ర బృందం ఏలూరుకు రానుంది. ఆ రోజు జిల్లాలో మరో 50 యూనిట్ల స్థాపనకు ఎంపిక చేసిన లబ్ధిదారులను ఇక్కడకు పిలిపించి ఈ ప్రాజెక్టు విశేషాలు తెలియజేసేలా షెడ్యూల్ రూపొందించారు. 15 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న నీటి చెరువులో వీటిని పెంచుతామని అందుకు అవసరమైన సహాయ సహకారాలను ఒక ఏడాది పాటు ఒక సంస్థ లబ్ధిదారులకు అందిస్తుందని డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, జీవనోపాధుల విభాగం అధికారి వేణుగోపాల్ తెలిపారు.

**ఆరు మండలాలకు లబ్ధి..** ఐటీడీఏ పరిధిలోని ఆరు గిరిజన మండలాల్లోని డ్వాక్రా మహిళలను లబ్ధిదారులుగా గుర్తించారు. సొంతభూమి, బోరు వసతి కలిగి ఉండాలి. ఎకరా భూమి ఉంటే అందులో చేపలపెంపకానికి 10 సెంట్లు మాత్రమే తీసుకుంటారు. అందులో 5 సెంట్లలో చేపల పెంపకానికి సంబంధించి 6 అడుగుల లోతుతో చెరువు తవ్వుతారు. పక్కనే మరో 5 సెంట్లలో తవ్వి నిత్యం చేపలు పెరిగే చెరువులోని నీటిని ఖాళీ చెరువులోకి వదులుతారు. ఈ నీళ్లతో సభ్యులు ఆకుకూరలు పెంచుకునేలా మరో పథకం ఉంది. లబ్ధిదారుల గుర్తింపు పూర్తయిందని వారికి రుణాలివ్వాలని జిల్లా ఖాదీ విలేజ్ ఇండస్ట్రీ బోర్డు నుంచి బ్యాంకులకు సిఫార్సులు వెళ్లాయి. వారికి త్వరలోనే రుణాలొస్తాయని అధికారులు చెబుతున్నారు.

# నిఘా నీడలో కడలి తీరం!

మొగల్తూరు : భవనాల పరిశీలన.. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా నెల కిందట ఇక్కడి బీచ్‌లో యోగా సాధనకు కలెక్టర్ సీహెచ్ నాగరాణి, ఎస్పీ అద్నాన్ నయీంఅస్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మెరైన్ పోలీస్‌స్టేషన్ ఆవశ్యకతను వారికి వివరించారు. దీనిపై కలెక్టర్, ఎస్పీ స్పందిస్తూ బీచ్‌లో ఉన్న రెండు ప్రభుత్వ అతిథిగృహాల్లో అనువైన భవనాన్ని ఎంపిక చేస్తే మెరైన్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇటీవల సంబంధిత అధికారులు బీచ్‌లోని అతిథిగృహాలను పరిశీలించారు. ఇక్కడ త్వరలోనే మెరైన్ స్టేషన్ ప్రారంభం కానుందని పోలీసు అధికారులు చెబుతున్నారు.

పశ్చిమలో మొగల్తూరు, నరసాపురం మండలాల్లో సుమారు 38



కిలోమీటర్ల మేర సముద్ర తీరం విస్తరించి ఉంది. గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో ఇక్కడ మెరైన్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు స్థలాలు, ప్రభుత్వ భవనాలను పరిశీలించారు. తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం ఈ అంశాన్ని పూర్తిగా విస్మరించింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక స్థానిక ప్రజాప్రతినిధుల కృషితో మెరైన్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయి.

**ప్రయోజనాలు ఇవీ..** తీర ప్రాంతంలో నిరంతరం నిఘా ఉంటుంది. ఇక్కడి బీచ్‌కు వేలాది మంది పర్యాటకులు తరలివస్తుంటారు. వీరిలో కొందరు సముద్ర అలల్లో స్నానాలు చేస్తూ ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. ఏటా పది నుంచి 15 మంది ఇలా మృతి చెందుతున్నారు. ఈ క్రమంలో బీచ్‌ను పూర్తిగా మూసివేయాలని ప్రజల నుంచి అప్రభుత్వానికి వినతులు అందుతున్నాయి. మెరైన్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుతో తీరంలో రక్షణ ఏర్పాట్లు, గస్తీ మెరుగుపడి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టే వెసులుబాటు ఉంటుంది.

# ఏరు.. హోరు

కౌతాళం : తుంగభద్ర ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ఆంధ్ర సరిహద్దు ప్రాంతమైన మేలిగనూరు వద్ద 1,30,000 క్యూసెక్కుల నీరు వస్తోంది. వాగులో తుంగభద్ర వరద జలాలు చేరడంతో ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వాగులో సుమారు 10 అడుగుల ఎత్తులో నీరు నిలిచింది. దీంతో ప్రజలు అదనంగా 25 కిలోమీటర్లు ప్రయాణించి మరో మార్గం ద్వారా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కౌతాళం సీఐ అశోక్‌కుమార్, తహసీల్దారు రజనీకాంత్ రెడ్డి, ఇరిగేషన్ ఏఇ ఈశ్వర్ తదితరులు నదీతీర గ్రామాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు.

**సుంకేసులకు భారీగా వరద**

సుంకేసుల జలాశయానికి ఎగువ నుంచి భారీగా వరద వస్తోంది. నాటికి 1,25,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు జలాశయ ఇంజినీరు మహేంద్రరెడ్డి తెలిపారు. 11 గేట్లు 2 మీటర్లు, 10 గేట్లు 1 మీటర్లు ఎత్తు తెరచి దిగువకు 1,24,173 క్యూసెక్కులు విడుదల చేస్తున్నామన్నారు. మిగిలిన గేట్లు మొరాయించడంతో మరమ్మతులు చేయాలని ఉన్నతాధికారులకు తెలియజేయగా నిపుణులను పంపిస్తామన్నారని ఆయన వివరించారు. ప్రస్తుతం 21 గేట్ల ద్వారా 3.5 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల చేసే అవకాశం ఉందన్నారు.

# నాడి తప్పిన వైద్యం..!

రాజమహేంద్రవరం : కాలానుగుణ వ్యాధులు విజృంభిస్తున్నాయి.. మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి విషజ్వరాలతోపాటు దగ్గు, జలుబు, గొంతునొప్పి, డయేరియా లక్షణాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులన్నీ కిటకిటలాడుతున్నాయి. ఈ నేపథ్యంలో యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమవ్వాల్సిన అవసరం ఉంది. **ఇదీ పరిస్థితి..**

జిల్లాలో జీజీహెచ్, 31 పీహెచ్‌సీలు, 15 యూపీహెచ్‌సీలు, అయిదు సీహెచ్‌సీలు, ఒక ప్రాంతీయ ఆసుపత్రి ఉన్నాయి. పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల్లో కొందరు వైద్యులు ఒక పూట మాత్రమే సేవలందిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. పీహెచ్‌సీల్లో ఇద్దరేసి వైద్యులుండాల్సి ఉండగా మూడు రోజులు ఒకరు.. మరో మూడు రోజులు ఇంకొకరు అనే రీతిలో విధులు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

**సిబ్బంది కొరతతో..**

రాజమహేంద్రవరం నగరంలో 11 యూపీహెచ్‌సీలున్నాయి. కంబాలపేటలో ఫార్మాసిస్టుల కొరత ఉంది. స్టాఫ్ నర్సే రోగులకు మందులిస్తున్నారు. బృహన్నలపేట ఆసుపత్రిలో సాధారణ పరీక్షలు మినహా ఇతర రక్త పరీక్షలు జరగడం లేదు. సిబ్బందే మందులిస్తున్నారు. వీఎల్‌పురంలో డిప్యుటేషన్‌పై వైద్యుడు ఉన్నారు.



రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో శ్వాసకోశ వైద్యనిపుణుడు అందుబాటులో లేరు. రెండు నెలల కిందట వైద్యురాలు, ఇప్పుడు ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ బదిలీపై కాకినాడకు వెళ్లారు. ఫార్మసీ విద్యార్థులే ఓపీ చూస్తున్నారు. కొన్ని యూసీహెచ్‌సీల్లో ఓపీ 50-60 ఉంటున్నా సగం మందికి కూడా నిర్ధారణ పరీక్షలకు వైద్యులు సిఫార్సు చేయలేని పరిస్థితి ఉంది. కొవ్వూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో సివిల్ సర్జన్, సివిల్ అసిస్టెంట్ సర్జన్ లేరు. గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలో దంత వైద్యుడు లేరు. ఎక్కువగా రిఫర్ చేయడంపై పలుమార్లు రోగి తరఫు బంధువులు వైద్యులతో గొడవ పడిన సందర్భాలు ఉన్నాయి.

# ఆటలకు 'మట్టి'కొట్టారు

నంద్యాల : ఎమ్మిగనూరు బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.3.50 లక్షలు వెచ్చించి క్రీడా మైదానం నిర్మించారు.. గుంతలు తవ్వి కంకర, ఇసుక, 40 ఎంఎం కంకర వేశారు. సరిగా రోలింగ్ చేపట్టలేదు. ఎగుడుదిగుడుగా ఉంది. క్రీడాకారులు ఆడేందుకు సరిగా లేదు. ఇటీవల కురిసిన వర్షాలకు మడుగులా మారింది.

సర్కారు బడులను బలోపేతం చేయడం.. అక్కడ చదువుతున్న విద్యార్థులను తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో కేంద్రం పీఎంశ్రీ పథకాన్ని తీసుకొచ్చింది. చదువుతోపాటు ఆటలకు ప్రాధాన్యం ఇచ్చేలా నిధులు విడుదల చేసింది. ఎంపిక చేసిన పాఠశాలల్లో మైదానాలు, ప్రయోగశాలలు అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. బ్యాడ్మింటన్, వాలీబాల్, ఖోఖో, లాంగ్‌జంప్, కబడ్డీ, షటిల్, ఫుట్‌బాల్, పరుగు వంటి ఆటల కోసం మైదానాలను తీర్చిదిద్దాల్సి ఉంది. పాఠశాల యాజమాన్య కమిటీల ఆధ్వర్యంలో పనులు చేపట్టారు.. చాలా చోట్ల 'స్థానిక' గుత్తేదారులకు అప్పగించారు. 'మట్టి' పనులు కావడంతో మొక్కుబడిగా చేశారు. ప్రస్తుతం వర్షాలకు 'మట్టి'కొట్టుకుపోయి మడుగులా మారాయి.

**54 పాఠశాలలు.. రూ.97 లక్షలు**

ఉమ్మడి జిల్లాలో పీఎంశ్రీ పథకానికి 54 పాఠశాలలను ఎంపిక చేశారు. ఒక్కో పాఠశాలలో రూ.5 లక్షల వరకు పనులు చేపట్టారు.. కర్నూలు జిల్లా వ్యాప్తంగా రూ.60 లక్షలు, నంద్యాలలో రూ.37 లక్షలు వెచ్చించారు. నేమకల్, గుడేకల్లు, పోలకల్, ఎర్రిగేరి, పెద్దపాడు, పెరవలి,. హెచ్‌కైరవాడి, దొర్నిపాడు, ఇల్లూరు, కొత్తపేట, కొణిదెల, కొత్తపల్లి, ఎన్.కొత్తపల్లి, పేరుసోముల గ్రామాల్లోని జిల్లా పరిషత్ పాఠశాలల్లో ప్రయోగశాలలు నిర్మించారు. దైవందిన్నె, నందవరం, పెద్దకడబూరు, తుగ్గలి, వెల్దుర్తి, ఆత్మకూరు, హాలహర్వి, కర్నూలు మిలటరీ, హొళగుంద, గూడూరు, హాలహర్వి, కల్లూరు, ఆదోని, చిప్పగిరి(ఆదర్శ) పాఠశాలల్లో మైదానాలు నిర్మించారు.

# జల మార్గం సుగమం

కర్నూలు : కృష్ణమ్మ బిరబిరా పరుగులు పెడుతోంది.. శ్రీశైల జలాశయం నిండుకుండలా మారింది.. వరద జలాలు సీమ ప్రాంతానికి విడుదల చేసేందుకు అధికారులు సన్నద్ధం అవుతున్నారు. నీటి విడుదలకు కేంద్ర బిందువైన పోతిరెడ్డిపాడు నియంత్రణ వ్యవస్థ, బనకచర్ల వద్ద గేట్ల మరమ్మతు పనులు వేగంగా చేపడుతున్నారు. ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన వెంటనే వరదనీటిని విడుదల చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. కేఆర్ఎంబీ, ప్రభుత్వ అనుమతి తీసుకొని పోతిరెడ్డిపాడు నుంచి జులై 10లోగా నీటి విడుదల చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

శ్రీశైలం వెనకజలాల నుంచి పోతిరెడ్డిపాడు చేరుకుని, అక్కడి నుంచి బనకచర్ల క్రాస్‌రెగ్యులేటర్ మీదుగా వెలుగోడు (తెలుగు గంగ), గోరకల్, అవుకు (ఎస్ఆర్‌బీసీ) జలాశయాలకు కృష్ణాజలాలు చేరుతాయి. వెలుగోడు నుంచి వైఎస్సార్ కడప జిల్లా బ్రహ్మంసాగర్, అవుకు నుంచి గండికోట జలాశయానికి చేరుతాయి.

శ్రీశైలం జలాశయానికి వరదనీటి ప్రవాహం 854 అడుగులు, పోతిరెడ్డిపాడు వద్ద 834 అడుగులకు చేరితే హంద్రీనీవా సుజల స్రవంతి (మల్యాల) నుంచి నీటిని విడుదల చేయడానికి వీలుంది.

బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ (బీసీఆర్) నుంచి తెలుగు గంగ కాల్వకు వరద నీటిని (వెలుగోడు జలాశయానికి) విడుదల చేసేందుకు మూడు గేట్లు ఉన్నాయి. ఒక్కోగేటు నుంచి ఐదువేల చొప్పున 15 వేల క్యూసెక్కుల వరకు ప్రవహిస్తాయి. బీసీఆర్ వద్ద ఎస్ఆర్‌బీసీ కాల్వకు నీటివిడుదల కోసం ఆరు గేట్ల ద్వారా 22,700 క్యూసెక్కులు విడుదలవుతుంది. రూ.12.50 లక్షలతో గేట్ల మరమ్మతులు చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు 10 గేట్ల నిర్వహణ, మరమ్మతులకు ఈ ఏడాది ప్రభుత్వం రూ.15 లక్షల నిధులు విడుదల చేసింది. రబ్బర్‌సీల్స్ మార్చుతున్నారు.. ఆయిలింగ్ చేస్తున్నారు. ప్రధానంగా లీకేజీలు లేకుండా మరమ్మతులు చేస్తున్నారు. శ్రీశైలం వెనుక జలాలు పోతిరెడ్డిపాడు నుంచి బనకచర్ల క్రాస్‌రెగ్యులేటర్‌కు చేరి, అక్కడి నుంచి తెలుగు గంగ, ఎస్ఆర్‌బీసీ, ఎస్కేప్ ఛానల్ ద్వారా వరద పారుతోంది. పోతిరెడ్డిపాడు వద్ద 10 గేట్ల నుంచి 44 వేల క్యూసెక్కుల నీటిప్రవాహం కొనసాగుతోంది. గతేడాది 210 టీఎంసీల వరద నీటిని పోతిరెడ్డిపాడు ద్వారా విడుదల చేశారు.

# 70 వసంతాల విద్యాధామం



తిరుపతి : శ్రీవారి పాదాల చెంత.. 1954 సెప్టెంబర్ 2వ తేదీన ఏర్పాటైన తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం అంచెలంచెలుగా ఎదిగి 70 వసంతాలు పూర్తి చేసుకుంది. 73 విభాగాలతో దేశంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలతో పోటీపడుతూ అరుదైన విద్యాధామంగా వెలుగొందుతోంది. ఇక్కడ చదివిన ఎందరో విద్యార్థులు దేశవిదేశాల్లో పలు రంగాల్లో ఉన్నతంగా స్థిరపడటంలో ఓ దిక్సూచిగా నిలిచిందనడంలో సందేహం లేదు. వర్సిటీలోని పలు కీలక కోర్సులు నేటికీ యువతను ఆకట్టుకుంటూ వారి ఉపాధికి బాటలు వేస్తున్నాయి.

**త్వరలో పీజీ ప్రవేశాలకు కౌన్సెలింగ్**

ఏపీ పీజీసెట్ 2025 ఫలితాలు ఇటీవల వెలువడగా అర్హత సాధించిన వారికి త్వరలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. డిగ్రీ తర్వాత అధ్యాపక వృత్తి, పరిశోధనా రంగం, వివిధ సంస్థల పరిపాలనా రంగంలోనూ రాణించాలంటే కచ్చితంగా మాస్టర్స్ డిగ్రీ అవసరం. వృత్తివిద్య కోర్సులైన ఎంబీఏ, ఎంసీఏ.. ఇంజినీరింగ్‌లో ఎంటెక్, బీటెక్ తదితర కోర్సుల ప్రవేశానికి రాష్ట్రస్థాయిలో ఆయా సెట్‌లలో అర్హత సాధించిన వారికి ప్రవేశం ఉంటుంది. పీజీలో ముఖ్యమైనవి బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్, మ్యాథమెటిక్స్, కామర్స్, ఎకనామిక్స్. ఇవి సమాజ అభివృద్ధిలో మూలాలు. వీటినుంచే అనేక కొత్త కోర్సులు ఉద్భవిస్తున్నాయి. అప్లైడ్ కోర్సులైన అనిమల్ బయోటెక్నాలజీ, బయోటెక్నాలజీ, బయోకెమిస్ట్రీ, వైరాలజీ, మైక్రోబయాలజీ, ఆక్వాకల్చర్, జియాలజీ తదితర కోర్సులు కీలకం.

**సమాజ అధ్యయనంలో కీలకం**

సైకాలజీ సబ్జెక్టు మానవ ప్రవర్తనను అధ్యయనం చేసేందుకు ఉపయుక్తంగా ఉంటుంది. సమాజంలో మానసిక రుగ్మతలను పారదోలేందుకు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, విద్యాసంస్థల్లో వీరికి ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం ఆయా రంగాల్లో సైకాలజిస్టులను నియమించుకుంటోంది. సోషియాలజీ, సోషల్ వర్క్ పూర్తిచేసిన వారు సమాజ అధ్యయనం, సమాజసేవ, వివిధ సంస్థల నిర్వహణలో కీలకం.

**నిత్యజీవితంతో ముడిపడి..**

కామర్స్, ఎకనామిక్స్, ఎంబీఏ తదితర కోర్సులు మానవుడి నిత్యజీవితంలో ముడిపడి ఉన్నాయి. వీటిలో పీజీ, పీహెచ్‌డీ చేసిన వారికి మంచి ఉపాధి దొరుకుతోంది. వర్తక వాణిజ్య రంగాల్లో యువతకు పెద్దఎత్తున అవకాశాలు ఉన్నాయి. అలాగే విద్యాభివృద్ధి, బోధనలో బీఈడీ తప్పనిసరి. భాషా శాస్త్రాలు అయిన తెలుగు, ఇంగ్లిష్, హిందీలో పీజీ చేసినవారికి బోధనారంగం ఆహ్వానం పలుకుతోంది.

**మెరుగైన ఉపాధి అవకాశాల కల్పనకు కృషి**

వర్సిటీ ప్రగతి, విద్యార్థుల భవిష్యత్తుకు నిరంతరం కృషి చేస్తున్నాం. పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఏపీ పీజీ సెట్‌ను దిగ్విజయంగా నిర్వహించాం. విద్యార్థుల సంఖ్య పెంచేందుకు, వర్సిటీలోని ఏడు కళాశాలల్లో విద్యా ప్రగతిని సాధించేందుకు ప్రత్యేక అకడమిక్ ప్లానింగ్‌తో ముందుకెళ్తున్నాం. పలు విదేశీ విశ్వవిద్యాలయాలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుని ఇక్కడి విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నాం. సీహెచ్ అప్పారావు, ఎస్వీయూ ఇన్‌ఛార్జి ఉపకులపతి

# పడకలు పడగొట్టి.. పనులు నిలబెట్టి



కర్నూలు : కర్నూలు సర్వజన ఆసుపత్రి భవన నిర్మాణ పనులు నత్తను తలపిస్తున్నాయి. కర్నూలు వైద్యాలయాన్ని 72 ఏళ్ల కిందట నిర్మించారు. ఏటా ఉమ్మడి కర్నూలు జిల్లాతోపాటు రాయలసీమ, తెలంగాణ ప్రాంతానికి చెందిన సుమారు తొమ్మిది లక్షల మంది రోగులు వస్తుంటారు. మెరుగైన వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతో ఆస్పత్రి ప్రాంగణంలో ఆసుపత్రి భవన (ఐపీడీ బ్లాక్) నిర్మాణానికి పునాది వేశారు. 2023లో రూ.500 కోట్లతో పనులు ప్రారంభించారు. ఈ నెలాఖరుకు పనులు పూర్తి చేయాల్సి ఉంది. బిల్లుల అందకపోవడంతో గుత్తేదారు చేతులెత్తేశారు. వార్డులు తొలగించి పనులు చేపట్టారు. అటు కొత్త భవనాలు అందుబాటులోకి రాక.. వార్డులు లేక రోగులు అల్లాడుతున్నారు.

**బిల్లులు చెల్లించని గత ప్రభుత్వం**

వైకాపా ప్రభుత్వ హయాంలో బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం జరిగింది. ఫలితంగా ఆ సంస్థ పనులను నత్తనడకన సాగించింది. ఐపీడీ భవనం నిర్మాణానికి సుమారు రూ.72 కోట్ల విలువైన పనులు చేశారు. రూ.62 కోట్ల విలువైన బిల్లులు ప్రభుత్వానికి పంపగా.. రూ.50 కోట్లు చెల్లించారు. ఇంకనూ రూ.22 కోట్ల మేర రావాల్సి ఉండటంతో గతేడాదిగా సదరు సంస్థ పనులను ఆపేసింది. నిర్మాణ సామగ్రిని తరలిస్తోంది.

**ఈ భవనమే కీలకం**

సుమారు రూ.185 కోట్ల వ్యయంతో ఐపీడీ భవన నిర్మాణం చేపట్టారు. సెల్లార్‌తో సహా ఆరు అంతస్తులు, 668 పడకల సామర్థ్యంతో ప్రారంభించారు. జనరల్ సర్జరీ, డీవీఎల్, జనరల్ మెడిసిన్, పోస్ట్ ఆపరేటివ్, పోస్ట్ ఆపరేటివ్ రికవరీ, ఐసీయూ, ఐసీసీయూ, ఎంఐసీయూ, శస్త్రచికిత్సల విభాగాలన్నీ ఇందులో ఉండేలా 4,27,923 చదరపు అడుగుల విస్తీర్ణంతో నమూనా రూపొందించారు. భవనం సెల్లారులో 120 కార్లు, 460 ద్విచక్రవాహనాలు నిలిపేందుకు సౌకర్యంగా ఉండేలా డిజైన్ చేశారు.

కొత్త భవనం పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావాలంటే రూ.140 కోట్లు అవసరమవుతుందని అంచనా.

**రోగులకు అవస్థలు**

ఐపీడీ భవన నిర్మాణంలో జాప్యం కారణంగా రెండేళ్లుగా ఆసుపత్రికి వచ్చే రోగులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.

ఆపరేషన్ థియేటర్లు ఒకచోట ఉండగా.. వారిని ఉంచాల్సిన వార్డులు మరోచోట ఉండడంతో శస్త్రచికిత్స అనంతరం వారిని ఇతర భవనాల్లోకి తరలిస్తున్న సమయంలో రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

ట్రామాకేర్ విభాగానికి సంబంధించి వరండాలోనే వైద్యం అందిస్తున్నారు. కొన్ని విభాగాల భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో పైకప్పు పెచ్చులూడి రోగులపై పడుతున్నాయి.

పాత భవనాల్లో విద్యుత్తు సౌకర్యం సరిగా లేకపోవడం, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తడంతో రోగులతోపాటు సిబ్బంది, వైద్యులు ఇబ్బందులు పడుతున్నారు. **ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లా: టీజీ భరత్, పరిశ్రమలశాఖ మంత్రి** నిత్యం వేలాది మంది రోగులు వచ్చే జీజీహెచ్‌కు గుండెకాయలాంటి ఐపీడీ భవన నిర్మాణం ఆగిపోయిన విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లా. పూర్తిచేసేందుకు తగిన చర్యలు తీసుకుంటానని చెప్పారు. త్వరలోనే ఆ భవనాల పనులు ప్రారంభించేలా చర్యలు చర్యలు తీసుకుంటాం.

# తాగిస్తాం.. తూలిస్తాం

నంద్యాల : నంద్యాల పట్టణంలో మద్యం దుకాణాలు మినీ బార్లను తలపిస్తున్నాయి. నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా దుకాణాలు నిర్వహిస్తున్నారు. బార్లలాగే ఏర్పాటు చేసి దుకాణంలోనే మద్యం తాగేలా ఏర్పాటు చేశారు. కొందరు బార్ల నిర్వాహకులు ఇష్టానుసారంగా ఉదయం 5నుంచి రాత్రి 12గంటల వరకు విక్రయాలు నిర్వహిస్తుండటం గమనార్హం.

నంద్యాల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 24 మద్యం దుకాణాలు, 15 బార్లు ఉన్నాయి. వాటిల్లో కొన్ని గ్రామీణ ప్రాంతాల్లో, మరికొన్ని పట్టణంలో ఉన్నాయి. మద్యం దుకాణాల నిర్వాహకులు నీళ్లు అమ్ముకోవడానికి ఇతర వ్యక్తులకు నెలకు రూ.లక్షల్లో అద్దెకి ఇచ్చి అక్కడే తినుబండరాలు విక్రయించేలా ఏర్పాటు చేశారు. దీంతో మందుబాబులు అక్కడే మద్యం తాగి తూలుతూ ఇంటికి వెళ్తున్నారు. రాత్రిళ్లు పద్మావతినగర్, టెక్కె, సాయిబాబానగర్, నందమూరినగర్‌కు వెళ్లే దారిలో, శ్రీనివాససెంటర్‌లో మద్యం దుకాణాల దగ్గర దారిలోనే పార్కింగ్ చేస్తుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

**ప్రతినెలా ముడుపులు!**

మద్యం దుకాణాల నుంచి పలువురికి ప్రతినెలా మామూళ్లు అందుతున్నట్లు ఆరోపణలున్నాయి. దీంతో ఆయా దుకాణాల వైపు కనీసం అధికారులు తొంగిచూడటం లేదు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై చర్యలు తీసుకోవడం లేదు. రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు వచ్చిన సమయంలో హడావుడి చేస్తున్నారు. మిగిలిన రోజుల్లో చర్యలు శూన్యమే. ఇకనైనా మద్య నిషేధ, ఆబ్కారీ శాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



**సమయపాలన లేని బార్లు**

పట్టణంలోని కొన్ని బార్లలో సమయపాలన లేకుండా మద్యం విక్రయిస్తున్నారు. స్థానిక శ్రీనివాససెంటర్, ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో విచ్చలవిడిగా మద్యం లభ్యమవుతుంది. కొన్ని బార్లలో ఉదయం 5 గంటల నుంచే మద్యం విక్రయాలు చేస్తుండటంతోపాటు అక్కడే తాపిస్తున్నారు.

**గ్రామాల్లో దారుణం**

నంద్యాల పట్టణంలోనే మద్యం దుకాణాలు బార్లను తలపిస్తుంటే ఇక గ్రామాల్లో పరిస్థితి దారుణంగా ఉంది. మందుబాబులు రాత్రి అయితే పొలాల్లోనే మద్యం తాగేస్తున్నారు. కొన్ని మద్యం దుకాణాల్లో సీసాపై రూ.10 ఎక్కువగా విక్రయిస్తున్నారు. సీసాలు, వాటర్ ప్యాకెట్లతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సంతజూటూరు, బుక్కాపురం, అయ్యలూరు మెట్ల, పాణ్యం మండలాల్లో మద్యం తాగి పొలాల్లో పడేస్తున్నారని రైతులు వాపోతున్నారు.

# మెరవాలి.. మురవాలి

అమలాపురం : గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛతపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయి. అందులో భాగంగా ఉత్తమ గ్రామ పంచాయతీల ఎంపికకు స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ పేరిట కేంద్ర బృందాలు ప్రత్యేక సర్వే నిర్వహించనున్నాయి. 2014-19 మధ్య అప్పటి తెదేపా ప్రభుత్వం ప్రతి గ్రామంలో స్వచ్ఛభారత్ మిషన్ అమలు చేసింది. ఆ తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం పూర్తిగా వదిలేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ ప్రక్రియను తిరిగి పునరుద్ధరించింది. జిల్లాలో 385 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అందులో సుమారు 30 పంచాయతీలను బృందం పరిశీలించనుంది. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించేందుకు కేంద్రం నుంచి అయిదుగురు సభ్యులతో కూడిన బృందం రానుంది.

**11 అంశాల పరిశీలన..**

ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పంచాయతీ కార్యాలయాలకు వెళ్తారు. చెత్తసంపద కేంద్రాల నిర్వహణ ఎలా ఉంది, బహిరంగ మలవిసర్జన, వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగం, రహదారి వెంబడి చెత్త వేస్తున్నారా, తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరిస్తున్నారా, పంచాయతీ రిక్షాలు, ఫాగింగ్ యంత్రాల నిర్వహణ తదితర 11



అంశాలు పరిశీలిస్తారు.

**ఇదీ ఉపయోగం..**

ఘన వ్యర్థాల నిర్వహణ, బహిరంగ మలవిసర్జన లేని గ్రామాలను గుర్తించడమే స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ ప్రధాన లక్ష్యం. అలాంటి పంచాయతీలకు ర్యాంకులు ప్రకటించి ఉత్తమంగా నిలిచిన వాటికి గాంధీ జయంతి(అక్టోబరు 2) రోజున కేంద్ర, రాష్ట్ర స్థాయిలో పురస్కారాలు అందజేస్తారు. ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు వస్తాయి. ఆ సొమ్ముతో మరిన్ని అభివృద్ధి పనులు చేసేందుకు వీలుంది.

**వచ్చే వారం మొదలు..**

కేంద్రం బృందం జిల్లాలోని పంచాయతీల్లో పర్యటిస్తారు. వారు గుర్తించిన అంశాల ఆధారంగా వివరాలు నమోదు చేసి, ఉన్నతాధికారులకు నివేదిస్తారు. వివిధ స్థాయిలో తనిఖీలు చేసి, పురస్కారాలు ప్రకటిస్తారు. ఇప్పటికే ఈ ప్రక్రియ ప్రారంభం అవ్వాల్సి ఉండగా సాంకేతిక కారణాలతో ఆలస్యమైంది. వచ్చే వారంలో మొదలయ్యే అవకాశం ఉంది. -శాంత లక్ష్మి, డీపీవో

**జిల్లాలో ఇలా..**

మండలాలు: 22
గ్రామ పంచాయతీలు: 385
చెత్త సంపద కేంద్రాలు: 272
నిర్వహణలో ఉన్నవి: 198
నిర్మించాల్సినవి: 79

# అక్రమాలపై త్రి'నేత్రం'

శ్రీశైలం : శ్రీశైల మహాక్షేత్రంలో రూ.కోట్ల నిధులతో జరిగే అభివృద్ధి పనులు పక్కదారి పట్టకుండా తరచూ విజిలెన్స్ అధికారులు నిఘా పెట్టారు. ముఖ్యంగా దేవస్థానం ఇంజినీరింగ్ విభాగంపై ప్రత్యేక దృష్టి పెట్టి విచారణ చేస్తున్నారు. విచారణ ఏళ్ల తరబడి జరగడం.. ఆ తర్వాత అభియోగాలన్నీ వీగిపోతుండడంతో విజిలెన్స్ అధికారుల పర్యటనలకు ఫలితం లేకుండా పోతోంది. ప్రస్తుతం మరోసారి అధికారులు వివిధ పనులపై దృష్టి పెట్టారు.

**కేసులు నెగ్గేనా?** విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శ్రీశైల మహాక్షేత్రంలో 2014 నుంచి ఇప్పటివరకు పలుమార్లు పర్యటించి తనిఖీలు జరిపారు. శ్రీశైల దేవస్థానం ఇంజినీరింగ్ విభాగం, అన్నదానం స్టోర్, పరిపాలన విభాగంలో తనిఖీలు చేసి నివేదికలు రూపొందించి కొందరు ఈవోలపై అభియోగాలు మోపారు. కర్నూలు నుంచి విచారణ నివేదికలు పంపితే విజిలెన్స్ ప్రధాన కార్యాలయం నుంచి అభియోగాలన్నీ వీగిపోతున్నాయి. జీవోలు సైతం జారీ అవుతున్నాయి. దీంతో విజిలెన్స్ అధికారుల పర్యటనలు బూడిదలో పోసిన పన్నీరుగా మారుతున్నాయి. ప్రస్తుతం గత వైకాపా ప్రభుత్వ హయాంలో జరిగిన పనులపై తిరిగి విజిలెన్స్ విచారణలు కొనసాగుతుండడం ఆసక్తికరంగా మారింది.

**ఆర్థిక నష్టంపై ఫిర్యాదులు**

శ్రీశైల మహాక్షేత్రంలో 2021 నుంచి 2024 వరకు జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించిన టెండర్లలో నిర్లక్ష్యం, అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు వచ్చాయి. ఆర్థిక నష్టం జరిగిందని.. విజిలెన్స్ విచారణ అవసరమంటూ ఫిర్యాదులు వెళ్లాయి. కర్నూలు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రాంతీయ అధికారి కె.చౌడేశ్వరి విచారణ చేపట్టారు. గణేష్ సదన్, శ్రీశైల క్షేత్ర సరిహద్దులకు బౌండరీ నిర్మాణం, నక్షత్ర



వనంతోపాటు మరోపనిపై విచారణ జరిపారు. విజిలెన్స్ డీఈ ఆధ్వర్యంలో గణేష్ సదన్ వద్ద సీసీ రహదారుల నాణ్యతను పరిశీలించి నమూనాలు తీసుకెళ్లారు. శ్రీశైల క్షేత్రంలో సరిహద్దుల నిర్మాణం కోసం రూ.5 కోట్లతో టెండర్లు పిలిచారు. క్షేత్రం చుట్టూ ఇనుప కంచెతో బౌండరీ ఏర్పాటుచేస్తే పులులు, వన్యప్రాణులకు ముప్పు వాటిల్లే అవకాశముందని అటవీశాఖ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో పనులు ఆగిపోయాయి. తర్వాత ఈ టెండరును పక్కన పెట్టి రుద్రాక్ష మఠం వద్దనున్న మహిషాసురమర్దిని ఆలయం పక్కన రిటైనింగ్ వాల్‌తోపాటు రహదారి పనులు చేపట్టారు. విజిలెన్స్ అధికారుల అభ్యంతరంతో ఈ పనులూ నిలిచిపోయాయి. **శ్రీశైల క్షేత్ర సరిహద్దుల పనులు ఆపేసి..** ఆ టెండరుతోనే మహిషాసురమర్దిని ఆలయం వద్ద రిటైనింగ్ గోడ, రహదారి నిర్మించారు. గత ఈవో బి.పెద్దిరాజు తీసుకున్న నిర్ణయంపై విజిలెన్స్ విచారణ చేపట్టారు. గతనెల 29వ తేదీలోపు వివరణ ఇవ్వాలని విజిలెన్స్ ఆర్‌ఈవో కె.చౌడేశ్వరి ఆయనకు నోటీసు జారీ చేశారు. ఎలాంటి వివరణ ఇస్తారోనన్నది వేచి చూడాల్సి ఉంది.

# ఇంకెప్పుడు?

చెన్నేకొత్తపల్లి : పేదల సొంతింటి కల నెరవేర్చాలన్న లక్ష్యంతో 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వ హయాంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం ప్రారంభించింది. ఒక్కో ఇంటికి రూ.1.5 లక్షలు వివిధ దశల్లో మంజూరు చేసేలా ఆదేశాలు జారీ చేసింది. తదనుగుణంగానే కొంతమేర చెల్లింపులు జరిగాయి. ఇలా రెండు, మూడు దఫాలు బిల్లులు పడిన తరవాత తదుపరి బిల్లులు ఆగిపోయాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం మంజూరుపై దృష్టి సారించలేదు. 70, 80 శాతం నిర్మాణాలు పూర్తయినా లబ్ధిదారులు బాడుగ ఇళ్లల్లో ఉండాల్సిన దుస్థితి నెలకొంది. అప్పులు చేసి ఇంటి నిర్మాణం మొదలు పెట్టి బిల్లులు మంజూరు కాక తీవ్ర అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక బకాయిలు చెల్లిస్తామని, లబ్ధిదారుల వివరాలు సైతం సేకరించడంతో హర్షించారు. ఏడాది గడచినా బిల్లులు మంజూరు చేయక నైరాశ్యంలో ఉన్నారు.

శ్రీసత్యసాయి జిల్లాలో 2014-19 మధ్య కాలంలో 27,589 పక్కా గృహ నిర్మాణాలు చేపట్టారు. అందులో 10,785 పూర్తి కాగా, పునాది దశలో 3,469, గోడల వరకు పూర్తయినవి 1,642 ఉన్నాయి. మొదలు కానివి 7,559 ఉండగా అందులో 5,628 మంది లబ్ధిదారులను పీఎమ్ఏవై-2కి కన్వర్షన్ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. అప్పులు



చేసి నిర్మించామని, బిల్లులు త్వరగా మంజూరు చేసి సాంత్వన చేకూర్చాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

**ప్రభుత్వానికి నివేదించాం – వెంకటనారాయణ, జిల్లా గృహనిర్మాణ సంస్థ అధికారి**

వివిధ దశల్లో ఆగిపోయిన నిర్మాణాలను దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ పథకం ద్వారా ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారుల వివరాలు సేకరించాలని ఆదేశించింది. వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదించాం.

**ఐడీ ఎలా క్లోజ్ అవుతుంది?**

రాజన్న, లబ్ధిదారుడు, చెన్నేకొత్తపల్లి

2018లో ఇళ్లు మంజూరైంది. బిల్లులు ఆలస్యమైనా అప్పు చేసి ఇల్లు నిర్మించాను. ఇప్పటివరకు రూ.1.08 లక్షలు అందింది. అధికారులను సంప్రదిస్తే ఐడీ క్లోజ్ అయిందని చెబుతున్నారు. బిల్లులు బకాయిలు ఉండగా ఎలా క్లోజ్ చేస్తారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలి.

**రూ.80 వేలు మంజూరు కావాలి**

చీమల లక్ష్మీ, లబ్ధిదారురాలు

2018లో ఇల్లు మంజూరవ్వడంతో నిర్మాణం చేపట్టాను. రూఫ్ టాప్ వరకు పూర్తయింది. ఇప్పటివరకు రూ.60 వేల నగదు, 25 బస్తాల సిమెంట్ మాత్రమే ప్రభుత్వం నుంచి అందింది. ఉన్నతాధికారులు చొరవ చూపి బిల్లులు సకాలంలో మంజూరయ్యేలా కృషి చేయాలి.

# పనులన్నీ... 'నిధి'తోనే..!

విశాఖ : మహా విశాఖ నగర పాలక సంస్థ చేపట్టే ప్రతి పని ఇకపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన 'నిధి' పోర్టల్‌లో నమోదు చేయాల్సిందే. టెండర్ నుంచి పని పూర్తయ్యేంత వరకు అన్ని వివరాలు అప్‌లోడ్ చేయడంతో పాటు, బిల్లులు 'నిధి' నుంచే పొందాల్సి ఉంటుంది. అమల్లో జాప్యం..!: కొత్త విధానంతో బిల్లుల చెల్లింపులో పారదర్శకత ఉంటుందని ప్రభుత్వం భావిస్తుంది. అయితే కొన్ని లోటుపాట్లతో ఇబ్బందులు తప్పవని, ఇప్పటికే పూర్తి చేసిన పనుల వివరాల నమోదుకు, బిల్లులు పొందేందుకు అవసరమైన ఏర్పాట్లు లేవని గుత్తేదారులు చెబుతున్నారు. గత నెలలోనే ప్రభుత్వం నిధి పోర్టల్‌కు సంబంధించి విధి విధానాలు రూపొందించి జీవీఎంసీ



అధికారులకు పంపినా... నేటికీ అమల్లోకి తీసుకురాలేదు.

**ఏటా చెల్లింపులు ఇలా..:**

మహా విశాఖ నగర పాలక సంస్థ ఏటా రూ.450 కోట్ల విలువైన సాధారణ, ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తుంటుంది. ఏటా రూ.350 కోట్ల నుంచి రూ.400 కోట్లు వరకు గుత్తేదారులకు బిల్లులు చెల్లిస్తుంటుంది. ఎనిమిదేళ్ల క్రితం వరకు జీవీఎంసీ సొంత నిధులు కమిషనర్ ఖాతాలోకి వస్తే, అక్కడ నుంచి వాటిని వివిధ అవసరాలకు, గుత్తేదారుల బిల్లులు చెల్లింపునకు వినియోగించారు.

ఆ తర్వాత సీఎఫ్ఎంఎస్ (కాంప్రహెన్సివ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట సిస్టం) అమల్లోకి తీసుకొచ్చారు. అయితే నగర ప్రజలు ఆన్‌లైన్‌లో చెల్లించే వివిధ రకాల పన్నుల సొమ్ము రాష్ట్ర ప్రభుత్వానికి వెళ్తుంది. జీవీఎంసీ సౌకర్యం, మీ-సేవ, బ్యాంకుల్లో చెల్లించే పన్నుల సొమ్మంతా కమిషనర్ ఖాతాలోకి జమ అవుతాయి. దీంతో సీఎఫ్ఎంఎస్‌తో పాటు, జీవీఎంసీ కమిషనర్ ఖాతా నుంచి బిల్లుల చెల్లింపులు జరుగుతున్నాయి.

**నూతన విధానంలో..:**

నిధి పోర్టల్ వినియోగంలోకి తీసుకొస్తే రాష్ట్ర ప్రభుత్వమే పూర్తిగా గుత్తేదారులకు బిల్లులు ఇవ్వాల్సి ఉంటుంది. జీవీఎంసీ కమిషనర్ ఖాతాకు చేరే ఆస్తి పన్ను సొమ్ము మొత్తం రాష్ట్ర ప్రభుత్వానికి జమ చేస్తే... అక్కడ నుంచే ఉద్యోగుల వేతనాలు, గుత్తేదారుల బిల్లుల చెల్లింపు ఉంటుంది. ఒకవేళ ఆయా నిధులను ఇతర పనులకు మళ్లిస్తే నగర అభివృద్ధికి గండి పడినట్టే.రాష్ట్రంలో చిన్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు ఇప్పటికే నిధి పోర్టల్ పరిధిలోకి వెళ్లాయి. మహా విశాఖ నగర పాలక సంస్థకు బలమైన ఆర్థిక వ్యవస్థ ఉండటంతో, జీవీఎంసీని మినహాయిస్తే బాగుంటుందనే వాదన వినిపిస్తుంది.

ప్రస్తుతం అమలవుతున్నట్టు 010 పద్దు ద్వారా ఉద్యోగుల వేతనాలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసి, అభివృద్ధి పనులకు సంబంధించి జీవీఎంసీ నిధులు వినియోగించుకునేలా వెసులుబాటు కల్పిస్తే బాగుంటుందని అధికారులు చెబుతున్నారు.

# గట్టుకు మట్టి సంచులే దిక్కు



ఉరవకొండ : పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్) కుడి కాలువ.. ఉమ్మడి అనంత జిల్లాలోని పలు ప్రాంతాల ప్రజలకు ఎంతో ఉపయుక్తమైంది. ప్రస్తుతం ఎక్కడికక్కడ శిథిలమయ్యి.. లీకేజీలతో నీరు వృథా అవుతోంది. ఏళ్లు గడుస్తున్నా ఆధునికీకరణకు నోచుకోక నీటి ప్రవాహం ప్రశ్నార్థకంగా మారుతోంది. కుడి కాలువ 110 కిలోమీటర్ల మేర ఉరవకొండ, శింగనమల, రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాలను కలుపుతూ వెళ్తుంది. అక్విడెక్టులు, అండర్ టన్నెల్స్, వంతెనలు కలిపి 200 వరకు ఉన్నాయి. దీని ద్వారా 42 చెరువులకు నీరందిస్తారు. కాలువ ప్రధాన షట్టర్‌తో పాటు చాలా చోట్ల దెబ్బతినింది. అక్విడెక్టులు, అండర్ టన్నెల్స్‌ది ఇదే పరిస్థితి. గండ్లు పడి నీరంతా నేలపాలవుతోంది. దెబ్బతిన్న కాలువ గట్టుకు మట్టి సంచులను ఏర్పాటు చేసిన దయనీయ స్థితి నెలకొంది. పీఏబీఆర్ ద్వారా కాలువకు 2 టీఎంసీల నీరు విడుదల చేయగా అందులో అర టీఎంసీకిపైగా లీకేజీల రూపంలో వృథా అయిన దాఖలాలు ఉన్నాయి.

**గత సర్కారు గాలికి వదిలేసి..**

కాలువ ఆధునికీకరణతో పాటు దాని పరిధిలో 50 వేల ఎకరాల ఆయకట్టును అందుబాటులోకి తేవాలన్న ఉద్దేశంతో ఉప కాలువల ఏర్పాటుకు తెదేపా ప్రభుత్వం (2014-19) రూ.191.7 కోట్లతో ప్రతిపాదనలను సిద్ధం చేసింది. తరువాత అధికారం చేపట్టిన వైకాపా సర్కారు ఐదేళ్ల పాలనలో నిర్వహణను గాలికొదిలేసింది. కనీసం మరమ్మతులకు సైతం నిధులు ఇవ్వకపోవడం గమనార్హం. చేసేదేమిలేక ఇంజినీరింగ్ అధికారులే సొంత నిధులతో మరమ్మతు చేయించిన సందర్భాలూ ఉన్నాయి. ఈఏడాది నీటిని విడుదల చేయాల్సి వస్తే మరిన్ని కష్టాలు ఎదుర్కోక తప్పదు.

**కూటమి ప్రభుత్వంపై ఆశలు**

తాజాగా కూటమి ప్రభుత్వం కంపను తొలగించడంతో పాటు ఇతరత్రా నిర్వహణ పనులకు రూ.2 కోట్లు కేటాయించింది.ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి కాలువ ఆధునికీకరణ పనులు చేపట్టాల్సి ఉంది. ఇప్పటివరకు చెరువులకు మాత్రమే నీరందేది. ఉప కాలువలు అందుబాటులోకి వస్తే ప్రతిపాదిత 50 వేల ఎకరాల ఆయకట్టు సాగులోకి వస్తుందని.. ఆ దిశగా సర్కారు చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం..**

వెంకటేశ్వర్లు, ఈఈ, ధర్మవరం డివిజన్

కాలువ ఆధునికీకరణ పనులు చేపట్టాల్సి ఉంది. ఈ విషయాన్ని జిల్లా ఎస్ఈతో పాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం. వారి ఆదేశాలకు అనుగుణంగా ముందుకు సాగుతాం. నిర్వహణ పనులు చేపట్టేలా తగిన చర్యలు తీసుకుంటాం.

# రైళ్లల్లో నేరాలకు కళ్లెం పడేనా?




గుత్తి : గుత్తి రైల్వేపోలీస్ స్టేషన్‌కు పరిధికి తగ్గట్టుగా సిబ్బంది లేరు. ఈకారణంగానే రైళ్లల్లో నేరాల నియంత్రణ లోపిస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏప్రిల్ 29న రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో దోపిడీ జరిగింది. గత నెలలో తాడిపత్రి మండలంలోని కోమలి రైల్వేస్టేషన్ వద్ద సిగ్నల్ కేబుల్‌ను దుండగులు కత్తిరించి రైలు ఆపి దోపిడీకి పాల్పడ్డారు. రైళ్లల్లో దోపిడీలు, చోరీలు సర్వసాధారణమయ్యాయి. వీటితో ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు. రాత్రిళ్లు ప్రయాణించాలంటేనే భయపడుతున్నారు. దోపిడీలు, చోరీలపై కొందరు పోయిన సొమ్ము ఎలాగూ రాదని పోలీసులకు ఫిర్యాదులు ఇవ్వడంలేదు. కొందరు ఫిర్యాదులు ఇస్తున్నా పోలీసులు కేసులు నమోదు చేసుకుంటున్నారే తప్ప రికవరీపై పెద్దగా పట్టించుకోవడంలేదన్న ఆరోపణలు ఉన్నాయి.

**స్టేషన్ పరిధి ఇలా...**

గుంతకల్లు మండలంలోని నక్కనదొడ్డి రైల్వేస్టేషన్ గుత్తికి 25 కిలోమీటర్లు దూరంలో ఉంది. పామిడి 20 కిలోమీటర్ల దూరం. కర్నూలు జిల్లా పగిడిరాయి స్టేషన్ 25 కి.మీ. ఉంది. తాడిపత్రి మండలంలోని చల్లవారిపల్లి 60 కిలోమీటర్లు దూరంలో ఉంది. వారానికో మృతదేహం చొప్పున ట్రాక్‌లపై పడుతున్నాయి. వాటిని గుత్తి, తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించి పోస్టుమార్టం చేయించాల్సి ఉంది. ఒక్కో శవం తరలింపు, ఖననానికి పోలీసులకు రూ.6 వేల వరకు ఖర్చు వస్తోంది. గుత్తి మీదుగా రోజూ 25 వరకు ప్యాసింజర్ రైళ్లు నడుస్తున్నాయి. వీటితో పాటు గూడ్సులు తిరుగుతుంటాయి. పరిధి దూరంగా ఉండటంతో పోలీసులు ఇబ్బందులు పడుతున్నారు.

**ఇరవైకి పది మందే..**

గుత్తి రైల్వేపోలీస్ స్టేషన్‌లో 20 మంది కానిస్టేబుళ్లకు గాను కేవలం పది మంది మాత్రమే ఉన్నారు. గుత్తి మీదుగా రైళ్లు ఎక్కువగా తిరుగుతుంటాయి. వాటి ఎస్కార్ట్‌కు సిబ్బంది లేరు. రాత్రి వేళల్లో రైళ్లకు జీఆర్పీ, ఆర్పీఎఫ్‌లు ఎస్కార్ట్‌గా వెళ్లాల్సి ఉంది. జీఆర్పీ పోలీసులు తక్కువగా ఉన్నాయి. పరిధి 60 కిలోమీటర్లు వరకు ఉండటంతో అవస్థలు తప్పడం లేదు. రైళ్లకు ఎస్కార్ట్ నామమాత్రంగా ఉంటోంది. దీంతో దుండగులు సునాయాసనంగా దోపిడీలు, చోరీలకు పాల్పడుతున్నారు. ఐదేళ్లు పూర్తి చేసుకుంటున్న కానిస్టేబుళ్లను ఉన్నతాధికారులు మాతృశాఖకు పంపుతున్నారు. కొత్తగా నియామకాలు చేయడం లేదు. ఈకారణంగానే సిబ్బంది కొరత ఉత్పన్నమవుతోంది.

**కొత్త నియామకాలు లేవు**

జీఆర్పీ పోలీసు స్టేషన్లలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. ఈకారణంగానే నేరాల నియంత్రణకు ఇబ్బందులు వస్తున్నాయి. 5ఏళు పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లను మాతృశాఖ(సివిల్)కు పంపుతున్నారు. కొత్తగా నియామకాలు లేవు. ఉన్నవారితోనే నేరాలు నియంత్రిస్తున్నాం. రికవరీలపై కూడా శ్రద్ధపెడతాం. అజయ్‌కుమార్, జీఆర్పీ, సీఐ, గుంతకల్లు

# కొత్త కార్డులు వచ్చేస్తున్నాయ్..!



చిత్తూరు : కొత్త బియ్యం కార్డు పొందాలనుకుని ఎంతో కాలంగా నిరీక్షిస్తున్న వారికి కూటమి ప్రభుత్వం అవకాశం కల్పించింది. రెండు మూడ్రోజుల్లో కొత్త బియ్యం కార్డుల జారీ మొదలుకానుంది. ఈ ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం కసరత్తు వేగవంతం చేసింది.. ఎన్నడూలేని విధంగా కొత్త బియ్యం కార్డుల్లో క్యూఆర్ కోడ్ విధానం అమలు చేయనున్నారు. ఈ క్రమంలో బియ్యం కార్డుల్లో పలు రకాల సవరణలకు ఇప్పటి వరకు 60,583 దరఖాస్తులు అందాయి. వాటిని రెవెన్యూ అధికారులు పరిశీలించి వెంటనే ఆమోదిస్తున్నారు.

జిల్లాలో కొత్త బియ్యం కార్డులకు 5,938, కార్డు విభజనకు 5,194 దరఖాస్తులందాయి. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి 3,347 కొత్త కార్డుల జారీకి ఆమోదముద్ర వేశారు. కార్డుల విభజనకు సంబంధించి 3,689 దరఖాస్తులకు ఆమోదముద్ర వేశారు. ఇప్పటి వరకు అందిన దరఖాస్తుల్లో అర్హత కలిగిన కొత్త కార్డుల వివరాలను జిల్లా పౌరసరఫరాల శాఖ ప్రభుత్వానికి నివేదించింది.

**నిరంతర ప్రక్రియ..**

కొత్త బియ్యం కార్డు పొందాలన్నా కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేయాలన్నా.. తొలగించాలన్నా.. ఇతరత్రా విభాగాలకు దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కూటమి ప్రభుత్వం కల్పించింది. మొత్తం ఏడు రకాల విభాగాలకు ప్రజలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. తుది గడువు విధించక పోవడంతో దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి.

**వీలైనంత త్వరగా జారీ..**

అర్హులందరికీ వీలైనంత త్వరగా కొత్త కార్డులు జారీ చేయనున్నాం. దీని వివరాలను ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించాం. ఈ నెల 5 లేదా 6 నుంచి కొత్త కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభం కానుంది.

శంకరన్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

**ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులు**

చిరునామా మార్పు: 1,474
ఆధార్ సవరణ: 908
సభ్యుల చేరిక: 45,890
సభ్యుని తొలగింపు: 1,117
కొత్త కార్డులకు: 5,938
కార్డు విభజనకు : 5,194
బియ్యం కార్డు సరెండర్: 41
చౌక దుకాణం నవీకరణ: 21

# జ్వరపీడితులతో ఆసుపత్రులు కిటకిట

నక్కపల్లి : మారిన వాతావరణంతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. ఈ ఏడాది వేసవిలోనే పలుమార్లు వరుస తుపాన్లతో చల్లగా గడిచిపోయింది. తొలకరి మొదలుకాగానే వర్షాలు తక్కువగానే పడినా ఎండలు గట్టిగా కాయడంతో ఇబ్బందులు మొదలయ్యాయి. తాజాగా అల్పపీడన ప్రభావంతో వరుస నాలుగు రోజుల పాటు కురిసిన వర్షాలు ప్రజలపై ప్రతికూల ప్రభావం చూపాయి. దీంతో జలుబు, జ్వరం, తలనొప్పితో పల్లెల్లో జనం ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల పారిశుద్ధ్య లోపం, తాగునీరు క్లోరినేషన్ చేయకపోవడం తదితర కారణాలతో అనారోగ్యం బారినపడ్డారు. దీంతో అతిసారం కేసులు పెరుగుతున్నాయి. ఫలితంగా ఆసుపత్రుల్లో రద్దీ పెరిగింది. ముఖ్యంగా నక్కపల్లి ప్రభుత్వాసుపత్రి రోగులతో కిటకిటలాడుతోంది. నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాలనుంచి పలువురు జ్వరపీడితులు, డయేరియా బాధితులు ఇక్కడ చికిత్స పొందుతున్నారు. దీంతో ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య పెరిగింది. రెండు వారాల వ్యవధిలో జ్వరానికి



సంబంధించి 200, డయేరియాకు సంబంధించి 50 కేసుల వరకు నమోదయ్యాయి.

**బయటి ఆహారానికి దూరంగా ఉండాలి..** వర్షాలు పడుతుండటంతో జ్వరాలు వస్తున్నాయి. ఆసుపత్రిలో రోగుల సంఖ పెరుగుతోంది. అవసరానికి తగినట్లు వైద్యం చేస్తున్నాం. ప్రజలు అప్రమత్తంగా ఉంటే ఇలాంటి వాటి నుంచి బయటపడొచ్చు. ప్రధానంగా కాచి చల్లార్చిన నీటినే తాగుతుండాలి. మాస్కులు ధరించడం ద్వారా అంటువ్యాధులు రాకుండా ఉంటాయి. ముఖ్యంగా బయట విక్రయించే ఆహార పదార్థాలు తినొద్దు. దీని ద్వారా అతిసారం ప్రబలుతోంది. ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

శిరీష, నక్కపల్లి ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారి

# కన్నీళ్లు తుడవాలి.. నీళ్లతో తడపాలి

తిరుపతి: తమ కన్నీళ్లు తుడవాలి.. వైకాపా పాలనలో నిర్లక్ష్యానికి గురైన సాగునీటి ప్రాజెక్టుల పనుల్లో కదలిక తెచ్చి సాగు భూములను తడపాలని కర్షకులు కోరుకుంటున్నారు. ఇందుకోసం కూటమి ప్రభుత్వం యత్నిస్తోంది. హంద్రీ- నీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్)లో భాగమైన పుంగనూరు, కుప్పం బ్రాంచ్ కాలువల విస్తరణ, లైనింగ్‌ను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నారు. ఇదే తరహాలో చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో దశాబ్దాలుగా ప్రతిపాదనల్లో ఉన్న ప్రాజెక్టులను పట్టాలెక్కిస్తే మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. ఈ దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలు తీసుకోవాలని రైతాంగం, ప్రజలు ఆశిస్తున్నారు.

ఐదేళ్ల జగన్ హయాంలో రెండు జిల్లాల్లో ఒక్క జలాశయ పనులు కూడా కాలేదు. నాడు ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు నియోజకవర్గం కుప్పానికి నీళ్లు ఇచ్చామని చెప్పుకొనేందుకు ఆఖర్లో హడావుడి చేసి అభాసుపాలయ్యారు. వైకాపాలో నంబరు 2 నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబానికి లబ్ధి చేకూర్చడానికి మూడు రిజర్వాయర్లు మంజూరు చేశారు. కేవలం స్వార్థ ప్రయోజనాలే పరమావధిగా పనిచేశారే తప్ప కర్షకుల మేలు కోసం పనులు జరిగిన దాఖలాలు లేవు. ఎన్డీయే ప్రభుత్వం వచ్చీరాగానే పుంగనూరు, కుప్పం బ్రాంచి కాలువలపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఒక్క చిత్తూరు జిల్లాలోనే ఏడాదిలో దాదాపు రూ.680 కోట్లు ఖర్చు చేసింది. జులై చివరి నాటికి పనులు పూర్తి చేసి రాష్ట్రంలో చిట్టచివర ఉన్న కుప్పానికి నీళ్లు తేవడానికి భగీరథుడిలా శ్రమిస్తున్నారు.

**రెండింటికి టెండర్లు పిలిచేదెప్పుడు?**

గుడుపల్లె మండలం యామగానిపల్లెలో 0.710 టీఎంసీలు, శాంతిపురం



మండలం మాదనపల్లి వద్ద 0.354 టీఎంసీల సామర్థ్యంతో రెండు జలాశయాల నిర్మాణానికి వైకాపా హయాంలో జీవో ఇచ్చారు. రూ.535.435 కోట్లతో పనులకు ఆమోదం తెలిపారు. తర్వాత వీటి ఊసే మరిచారు. రెండు రిజర్వాయర్లకు టెండర్లు పిలిస్తే వచ్చే ఏడాదైనా కృష్ణా జలాలను కుప్పంలో నిల్వ చేసుకునే అవకాశం ఉంటుంది. కొత్త పరిశ్రమలకూ నీరందుతుంది.

**తమిళనాడుకు వృథాగా వెళ్లాల్సిందేనా?**

బైరెడ్డిపల్లె మండలంలోని కైగల్ నదిపై జలాశయం నిర్మిస్తే బైరెడ్డిపల్లె, వి.కోట మండలాల్లో తాగునీటి సమస్యకు చెక్ పడుతుంది. రిజర్వాయర్ లేకపోవడంతో వర్షపు నీరంతా తమిళనాడుకు వృథాగా పోతోంది. 2019లో తెదేపా హయాంలో రూ.16.01 కోట్లు మంజూరు చేయగా.. వైకాపా పాలనలో రద్దుల జాబితాలో చేర్చారు. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పలమనేరు వచ్చినప్పుడు దీని ప్రస్తావన వచ్చింది.

**అటవీ అభ్యంతరాలతో ఆగిన తుంబ**

బంగారుపాళ్యం మండలం తుంబపాళ్యానికి మూడు కిలోమీటర్ల దూరంలో అటవీ ప్రాంతంలో తుంబ ప్రాజెక్టును నిర్మించారు. భూగర్భంలో కాలువలు ఏర్పాటు చేసి 3వేల ఎకరాలకు సాగునీరు అందించేవారు. భారీ వర్షాలకు గేట్లు కూలిపోవడంతో పంటలు వేసే పరిస్థితి లేదు. జైకా నిధులు రూ.2.30 కోట్లు మంజూరైనా అటవీ శాఖ అభ్యంతరాలతో పనులు ఆగాయి.

**ప్రత్యామ్నాయ ప్రణాళిక రూపొందించినా**

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని తూర్పు ప్రాంతానికి గాలేరు- నగరి సుజల స్రవంతి (జీఎన్ఎస్ఎస్) ప్రాజెక్టు వరప్రదాయిని. ఇది అందుబాటులోకి వస్తే 5 లక్షల మందికి తాగునీరు ఇవ్వవచ్చు. 1.05 లక్షల ఎకరాలు సస్యశ్యామలమవుతాయి. గతంలో ఉమ్మడి కడప జిల్లాలోని గండికోట నుంచి నీరు తీసుకునేందుకు ప్రణాళికలు రూపొందించారు. అటవీ శాఖ అనుమతులు రావడం కష్టమని భావించి నెల్లూరు జిల్లాలోని కండలేరు రిజర్వాయర్ నుంచి ప్రత్యామ్నాయ ప్రణాళిక తయారుచేశారు. అధికారులు డిజైన్లు పంపినా ఇప్పటివరకు ప్రభుత్వం ఆమోదించలేదు. ఈ ఏడాది ప్రారంభిస్తే 2029 ఎన్నికల నాటికైనా పనులు పూర్తవుతాయి.

## అనసూయ... మోడర్న్ డిజైన్స్‌లో స్టన్నింగ్ గ్లామర్!

టాలీవుడ్‌లో యాంకర్‌గా, నటిగా బలమైన గుర్తింపు తెచ్చుకున్న అనసూయ భరద్వాజ మరోసారి తన స్టైలిష్ లుక్‌తో అభిమానులను ఆకట్టుకున్నారు. తాజాగా ఆమె పర్పుల్ అండ్ యెల్లో కాంబినేషన్‌లో డిజైనర్ అవుట్‌ఫిట్ ధరించి ఇచ్చిన ఫొటోషూట్ పోజులు సోషల్ మీడియాలో హీట్ పెంచుతున్నాయి. ఈ అందమైన కలర్ కాంబినేషన్‌లోని డ్రెస్, ఆత్మవిశ్వాసంతో ఇచ్చిన ఎక్స్‌ప్రెషన్స్ అనసూయలోని ఫ్యాషన్ ఫ్లేర్‌ను మరోసారి నిరూపించాయి. ఈ ఫొటోలలో అనసూయ ధరించిన డిజైనర్ చోలీ, అలాగే లైట్ యెల్లో ఫ్లోయింగ్ స్కర్ట్ అభిమానుల్ని విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. పింక్ బ్యాక్‌గ్రౌండ్‌లో వేసిన కొన్ని పోజులు మరో లెవెల్‌లో ఉండగా, అవుట్‌డోర్ ఫొటోలు మరింత నాచురల్‌గా అనిపించాయి. స్పష్టంగా



చెప్పాలి అంటే... ఈ లుక్‌లో అనసూయ ఫ్యాషన్ ఐకాన్‌లా మెరిసిపోయారు. అనసూయ కెరీర్ విషయానికి వస్తే, ‘జబర్దస్త్’ షో ద్వారా మాస్ అభిమానులకు దగ్గరైంది. ఆ తరువాత ‘క్షణం’, ‘రంగస్థలం’, ‘పుష్ప’ వంటి సినిమాల్లో నటిగా తన వేరియేషన్ చూపించి మంచి పేరు సంపాదించుకుంది. ఆమె నటనకు గల డెఫినిషన్ ఒక్కటే... ఎంత మైనస్ రోల్ అయినా, ఎంత బోల్డ్ క్యారెక్టర్ అయినా న్యాయం చేస్తుంది. ఇటీవల ఆమె ఓటీటీ ప్రాజెక్ట్స్‌లోనూ యాక్టివ్‌గా మారింది. సినిమాలకే కాకుండా అనసూయ ఫ్యాషన్ గేమ్‌లోనూ ఎప్పటికప్పుడు ట్రెండింగ్‌లో ఉంటుంది. ప్రతి ఫొటోషూట్‌లోనూ ఒక కొత్త ప్రయోగాన్ని చేస్తూ, తన వయస్సు మీద కాదు తన స్టైల్ మీద దృష్టి పెట్టే తత్వం ఆమెను ప్రత్యేకంగా నిలబెడుతోంది. ట్రెండీ లుక్‌లతో పాటు ట్రెడిషనల్ డ్రెస్‌ల్లోనూ ఆమెకు మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది.

## నటి పిల్లల్ని ట్రోల్ చేస్తే కార్‌తో గుద్దించేస్తుందట

సోషల్ మీడియా యుగంలో ట్రోలింగ్ సర్వ సాధారణంగా మారింది. ప్రతి చిన్న అంశంపైనా చర్చలు, కామెంట్లు తీవ్రంగా మారాయి. ఇటీవల స్టార్ కిడ్స్ పై ఘోరమైన ట్రోలింగ్ సాగుతోంది. ముఖ్యంగా బాలీవుడ్ లో నటవారసుల అందచందాలు, విలాసాలు, లెగసీ వైఫల్యాలపై టార్గెట్ చేస్తూ కామెంట్లు వినిపిస్తున్నాయి. అయితే తన పిల్లలను ఎవరైనా కించపరుస్తూ కామెంట్ చేస్తే సీనియర్ నటి కాజోల్ అయితే ఏం చేస్తుందో తెలుసా? ఇదే ప్రశ్న కాజోల్ ని ప్రశ్నించింది మీడియా.. దీనికి స్పందించిన ఈ మేటి కథానాయిక.. -నా కార్ ఎదుటకు రావొద్దని చెబుతాను.. ఎందుకంటే మీదికి ఎక్కించి తొక్కించేస్తాను! - అని సరదాగా వార్నింగ్ ఇచ్చారు. కాజోల్ ప్రస్తుతం మా సినిమా ప్రమోషన్స్ లో బిజీగా ఉన్నారు. ఈ హారర్ థ్రిల్లర్ లో తన కుమార్తెను కాపాడుకునే తల్లి పాత్రలో కాజోల్ అద్భుతంగా



నటించారని ప్రశంసలు కురుస్తున్నాయి. నిజ జీవితంలోను తన పిల్లల జోలికి వస్తే కాజోల్ ఎలా ప్రవర్తిస్తారు? అనేది ప్రశ్న. ఒకప్పుడు అస్సలు సహించే స్థితిలో లేనని కాజోల్ తెలిపారు. -పిల్లలను కాపాడుకునే తల్లిగా, ఒకప్పుడు చాలా సీరియస్ గా ఉండేదానిని... ఇప్పుడు కొంత కూల్ గా ఉన్నాన-ని కూడా కాజోల్ అన్నారు. సోషల్ మీడియాలు, ట్రోలింగ్ జీవితాల్లో చిన్న భాగం.

దానికి బదులుగా సానుకూల అంశాలపై దృష్టి పెట్టాలని తన పిల్లలకు సలహా ఇచ్చినట్టు కాజోల్ తెలిపారు. సోషల్ మీడియాల్లో అలా మాట్లాడేవారు ఒక శాతం లేదా 0.1 శాతం మాత్రమే ఉంటారు. ఆ వ్యాఖ్యల్లో నిజమెంతో ఎవరికీ తెలీదు. అలాంటి వాటిపై కాదు..మీరు మంచిపై దృష్టి పెట్టాలి! అని కాజోల్ అన్నారు.




## వార్-2 - కూలీ.. హైప్ ఎలా ఉందంటే?



ఆగస్టు 14వ తేదీ ఇండియన్ బాక్సాఫీస్ వద్ద భారీ క్లాష్ జరగనున్న విషయం తెలిసిందే. రెండు హై వోల్టేజ్ సినిమాలు ఆ రోజు థియేటర్స్ లో రిలీజ్ కానున్నాయి. వార్-2, కూలీ చిత్రాలు ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. రెండు సినిమాలపై ఆడియన్స్ లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. రిలీజ్ కు ఇంకా పది రోజులు మాత్రమే మిగిలి ఉంది. కోలీవుడ్ సూపర్ స్టార్ రజినీ కాంత్ లీడ్ రోల్ లో నటించిన సినిమా కూలీ. లోకేష్ కనగరాజ్ దర్శకత్వం వహించిన ఆ మూవీ మాస్ మసాలా ఎంటర్టైనర్ గా రూపొందుతోంది. టాలీవుడ్ కింగ్ నాగార్జున, బాలీవుడ్ స్టార్ హీరో అమీర్ ఖాన్ సహా శ్రుతి హాసన్, సాబిన్ సాహిర్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. కళానిధి మారన్.. భారీ బడ్జెట్ తో రూపొందిస్తున్నారు. రీసెంట్ గా మేకర్స్.. ట్రైలర్ రిలీజ్ చేయగా అది ఆడియన్స్ ను విపరీతంగా మెప్పించింది. సినీ ప్రియులను అంచనాలను ఆకాశాన్ని తాకేలా చేసింది. యాక్షన్ ప్యాక్డ్ గా ఉన్న ట్రైలర్ ను.. సరైన రీతిలో మేకర్స్ కట్ చేశారనే చెప్పాలి. ఆ తర్వాత ఉన్న హైప్ ను భారీ పెంచారు. దీంతో సినిమా సాలిడ్ ఓపెనింగ్స్ ను సాధించడం పక్కా అని చెప్పడంలో డౌట్ అక్కర్లేదు. ఆ తర్వాత వార్-2 ట్రైలర్ కూడా ఇప్పటికే రిలీజ్ అయింది. కానీ మోస్తరు స్పందన మాత్రమే వచ్చింది. ఇంతకుముందు వచ్చిన టీజర్ విషయంలో కూడా అదే జరిగింది. దీంతో మేకర్స్ అనుకున్న స్థాయిలో అంచనాలు క్రియేట్ చేయలేదు. ఇప్పుడు భారీ ప్రమోషనల్ ప్రచారంతోపాటు విడుదలకు ముందు ఒక మంచి గ్లింప్స్ అవసరమనే చెప్పాలి. అయితే ఎన్టీఆర్, హృతిక్ రోషన్ వంటి స్టార్ హీరోలు ఉండటం ఓపెనింగ్స్ భారీగా ఉండనున్నట్లు తెలుస్తోంది. కానీ ప్రమోషన్స్ లో మాత్రం స్పీడ్ పెంచి అంచనాలు క్రియేట్ చేయాల్సిందే. అదే సమయంలో ఓవర్సీస్ లో కూలీ సినిమా అడ్వాన్స్ బుకింగ్స్ ఇప్పటికే స్టార్ట్ అయ్యాయి. అప్పుడే మిలియన్ డాలర్ మార్క్ కు దగ్గరగా వెళున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. కానీ వార్-2 ఇంకా ఊపందుకోలేదు. సినిమాకు తగిన సంఖ్యలో స్క్రీన్లు వచ్చేలా పంపిణీదారుల భారీ ఎత్తుగడలు అవసరం. ముందస్తు అమ్మకాలు బాగానే ఉన్నప్పటికీ.. ఇంకా హైప్ క్రియేట్ చేసిన వాటిని పెంచాలి. దీంతో కూలీ మూవీ వార్-2 కన్నా అన్ని విషయాల్లో ముందు ఉంది. దానితో ఈక్వల్ గా ఉండాలంటే వార్-2 మేకర్స్ ఏం చేస్తారో వేచి చూడాలి.

## ఘాజి దర్శకుడితో గోపిచంద్.. గోపీచంద్ నెవ్వర్ బిఫోర్ గ్లింప్స్!




టాలీవుడ్ మ్యాచో స్టార్ గోపీచంద్ ఇప్పుడు మరో ప్రతిష్టాత్మక చిత్రంతో అలరించేందుకు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. ఐబీ 7, ఘాజీ వంటి చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న సంకల్ప్ రెడ్డి దర్శకత్వం వహిస్తుండగా.. శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ బ్యానర్ పై శ్రీనివాసా చిట్టూరి పవన్ కుమార్ సమర్పణలో భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం హైదరాబాద్ లో పూజా కార్యక్రమాలు జరగ్గా.. ఇప్పుడు మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇండియన్ హిస్టరీలో కీలకమైన, మరచిపోలేని సంఘటనలతో రూపొందిస్తున్న ఆ సినిమాలో గోపీచంద్ నెవ్వర్ బిఫోర్ లుక్ లో కనిపించనున్నట్టు మేకర్స్ ఇప్పటికే అనౌన్స్ చేసి అంచనాలు పెంచారు. 7వ శతాబ్దం నాటి సంఘటనల ఆధారంగా సినిమా తెరకెక్కుతుండగా.. మేకర్స్ తాజాగా క్రేజీ అప్డేట్ ఇచ్చారు. నేడు గోపీచంద్ బర్త్ డే సందర్భంగా విషెస్ చెబుతూ స్పెషల్ పోస్టర్ తో పాటు గ్లింప్స్ ను రిలీజ్ చేశారు. ప్రస్తుతం ఆ రెండూ సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. మంచి రెస్పాన్స్ అందుకుని సినిమాపై భారీ బజ్ క్రియేట్ చేస్తున్నాయి. పోస్టర్ ను గోపీచంద్ వేరే లెవెల్ లో ఉన్నారు. గోపీచంద్ పొడవాటి జుట్టు, గుబురు గడ్డం, నుదుటన సింధూరం, చేతిలో కత్తి, దీర్ఘంగా చూస్తున్న కళ్లతో యోధుడుగా కనిపించారు. యుద్ధభూమి బ్యాక్ గ్రౌండ్ తో ఉన్న పోస్టర్.. పవర్ ఫుల్ గా ఉంటూ అబ్బురపరుస్తుంది. నెటిజన్లు, సినీ ప్రియులు.. పోస్టర్ అదుర్స్ అని చెబుతున్నారు. మరోవైపు, గ్లింప్స్ అయితే ఓ రేంజ్ లో ఉందని అంటున్నారు. మంచు కొండల సీన్ కూల్ గా స్టార్ట్ అవుతుంది. అప్పుడే గూడారం నుంచి యోధుడుగా గోపీచంద్ బయటకు వస్తారు. తన గుర్రంతో ఆత్మీయంగా గడుపుతారు. బ్యాక్ గ్రౌండ్ లో వస్తున్న ధీర సాంగ్.. అదిరిపోయింది. విజువల్స్ చాలా రిచ్ గా ఉండి బాగున్నాయి. మొత్తానికి సినిమాలో గోపీచంద్ ఎప్పుడూ చూడని పాత్రలో కనిపిస్తారని మరోసారి క్లారిటీ వచ్చేసింది. ఇప్పటికే ఫస్ట్ షెడ్యూల్ కాశ్మీర్ లో ఏప్రిల్ లో కంప్లీట్ చేశారు మేకర్స్. కొత్త షెడ్యూల్ ను హైదరాబాద్ లో స్టార్ట్ చేశారు. భారీ సెట్ లో ఇప్పుడు చిత్రీకరణ జరుగుతోంది. క్యాస్టింగ్ తో పాటు సాంకేతిక సిబ్బంది గురించి మరిన్ని వివరాలు త్వరలోనే వెల్లడి కానున్నాయి.

## తప్పు ఎక్కడ జరిగింది శ్రీనిధి...?

కన్నడ ముద్దుగుమ్మ శ్రీనిధి శెట్టి ఇండస్ట్రీలో ఎంట్రీ ఇవ్వడం తోనే బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ విజయాన్ని సొంతం చేసుకుంది. 2016 లో మిస్ సుప్రానేషనల్ కిరీటాన్ని గెలుచుకోవడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. ఆ సమయంలోనే ఈ అమ్మడికి కన్నడ సినిమా ఇండస్ట్రీ నుంచి ఆఫర్లు వచ్చాయి. చిన్న ఆఫర్లను సున్నితంగా తిరస్కరించి యశ్ కి జోడీగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందిన ‘కేజీఎఫ్’ సినిమాలో నటించింది. కేజీఎఫ్ మొదటి పార్ట్‌లో శ్రీనిధి శెట్టి పాత్ర పెద్దగా లేదు. అయినా కూడా ముద్దుగుమ్మకు మంచి ఆఫర్లు వచ్చాయి. కానీ కేజీఎఫ్ 2 విడుదల అయిన తర్వాతే తాను కొత్త సినిమాలకు కమిట్ అవుతాను అంటూ భీష్మించుకు కూర్చుకుంది. దాంతో చాలా



కన్నడ సినిమా ఆఫర్లతో పాటు ఇతర భాషల సినిమా ఆఫర్లు కూడా చేజార్చుకుంది. కేజీఎఫ్ 2లో కూడా శ్రీనిధి శెట్టి పాత్ర అంతంత మాత్రమే. అయినా కూడా ఆ సినిమా దక్కించుకున్న విజయం నేపథ్యంలో పాన్ ఇండియా రేంజ్‌లో శ్రీనిధి శెట్టికి మంచి గుర్తింపు దక్కింది. దాంతో ఆఫర్లు కూడా పెద్ద ఎత్తున వచ్చాయి. కానీ ఈమె పాత్రల ఎంపిక విషయంలో అతి జాగ్రత్త వహించినట్లు తెలుస్తోంది. కేజీఎఫ్ 2 సినిమా సమయంలోనే తమిల స్టార్ హీరో విక్రమ్‌తో కలిసి కోబ్రా సినిమాలో నటించింది. ఆ సినిమా డిజాస్టర్‌గా నిలిచింది, దాంతో ఆ సినిమాను కనీసం చెప్పుకునే పరిస్థితి శ్రీనిధి శెట్టికి లేదు. కేజీఎఫ్ సమయంలో వరుసగా ఆఫర్లు వచ్చినా పెద్దగా పట్టించుకోని శ్రీనిధి శెట్టి కోబ్రా తర్వాత ఆఫర్ల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి వచ్చింది. లక్కీగా తెలుగులో ఈ అమ్మడికి రెండు ఆఫర్లు వచ్చాయి. నానికి జోడీగా హిట్ 3 లో నటించే అవకాశం దక్కించుకున్న శ్రీనిధి శెట్టి ఆ తర్వాత సిద్దు జొన్నలగడ్డ సినిమా తెలుసు కదా లో ఇద్దరు హీరోయిన్స్‌లో ఒక హీరోయిన్‌గా నటించింది. హిట్ 3 మంచి విజయాన్ని సొంతం చేసుకున్నా కొన్ని కారణాల వల్ల ఆమెకు ఆశించిన స్థాయిలో రీచ్ రాలేదు. హిట్ 3 కారణంగా శ్రీనిధి శెట్టికి ఒక్కటంటే ఒక్క ఆఫర్ కూడా వచ్చిన దాఖలాలు లేవు అని ఇండస్ట్రీ వర్గాల టాక్. తెలుసు కదా సినిమాలో నటిస్తున్న కారణంగా అంచనాలు భారీగా పెట్టుకుంది. యూత్ ఆడియన్స్‌లో మంచి క్రేజ్ ఉన్న సిద్దు జొన్నలగడ్డ కచ్చితంగా ఈ సినిమాతో సాలిడ్ సక్సెస్‌ను అందుకుంటాడనే విశ్వాసం అందరిలోనూ వ్యక్తం అవుతుంది. అందుకే తెలుసు కదా విడుదల కోసం వెయిట్ చేస్తుంది.

## ఎన్టీఆర్ తో మరో దర్శకుడు.. సెట్టయినట్లేనా?

యంగ్ టైగర్ ఎన్టీఆర్ ప్రస్తుతం తెలుగు సినీ ఇండస్ట్రీలో మోస్ట్ బిజీ హీరోలలో ఒకరిగా కొనసాగుతున్నాడు. ఇప్పటికే బాలీవుడ్‌లో హృతిక్ రోషన్‌తో కలిసి “వార్ 2” సినిమాతో గ్రాండ్ ఎంట్రీకి సిద్ధమవుతున్నాడు. ఇకపోతే తెలుగు సినిమా పరంగా ఎన్టీఆర్ ప్రస్తుతం ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ డ్రాగన్ షూటింగ్‌తో బిజీగా ఉన్నాడు. ఇక ఈ ప్రాజెక్ట్ తర్వాత కొరటాల శివ దర్శకత్వంలో రూపొందే దేవర 2, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ దర్శకత్వంలో మరో సినిమా లైన్‌లో ఉన్నట్టు తెలుస్తోంది. అయితే ఇప్పుడు ఈ లైనప్ మధ్యనే ఇంకో క్రేజీ కాంబినేషన్ కూడా బజ్‌లోకి వచ్చి ప్రేక్షకుల్లో ఉత్కంఠను రేకెత్తిస్తోంది. అదే కోలీవుడ్ దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ తో ఎన్టీఆర్ చేయబోయే సినిమా. తాజాగా నెల్సన్ పుట్టినరోజు సందర్భంగా ప్రముఖ నిర్మాత నాగవంశీ చేసిన సోషల్ మీడియా పోస్ట్ ఇప్పుడు ఈ హైప్‌కి బలాన్నిస్తోంది. మా డియరెస్ట్ నెల్సన్ దిలీప్ కుమార్ కి హ్యాపీ బర్త్



డే. అతి త్వరలోనే బిగ్ స్క్రీన్ ట్రీట్ మళ్లీ వెనక్కి రాబోతుంది అనే కామెంట్ అభిమానుల్లో ఉత్సాహాన్ని కలిగిస్తోంది. ఇది కచ్చితంగా ఎన్టీఆర్‌తో చేసే సినిమాకే సంకేతమని ఫ్యాన్స్ భావిస్తున్నారు. నెల్సన్ గతంలో విజయ్ తో “బీస్ట్”, రజనీకాంత్ తో “జైలర్” వంటి భారీ ప్రాజెక్ట్స్‌ను తెరకెక్కించాడు. “జైలర్” మెగా బ్లాక్ బస్టర్ కావడంతో తమిళ ఇండస్ట్రీలో అతడికి మంచి మార్కెట్ ఏర్పడింది. అలాంటి నెల్సన్ ఇప్పుడు ఎన్టీఆర్ లాంటి మాస్ హీరోతో జతకడితే, అది అసలైన ఫైర్ కాంబో కానుంది. పైగా పాన్ ఇండియా రేంజ్‌లో సెట్ చేయదగిన కాంబినేషన్ ఇది కావడం విశేషం. ఇప్పటికే ఎన్టీఆర్ లైనప్ చాలా బిజీగా ఉంది. కానీ పరిశ్రమ వర్గాల్లో వినిపిస్తున్న టాక్ ప్రకారం, ఈ ప్రాజెక్ట్ ముందుగా ప్లాన్ చేసిన లైనప్‌లో కొన్ని మార్పులు జరగొచ్చని అంటున్నారు. ఎప్పుడు అయినా గ్రీన్ సిగ్నల్ వస్తే, నెల్సన్ - ఎన్టీఆర్ మూవీ త్వరలోనే సెట్స్ పైకి వెళ్ళే అవకాశముంది. ఈ కాంబి నేషన్ ఖచ్చితంగా భారీ మాస్ ఎంటర్టైనర్‌కి అవకాశం కల్పించనుంది. మరి ఏం జరుగుతుందో తెలియాలంటే మరికొంత కాలం ఆగాల్సిందే.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536